# కలామె హిక్మత్ - 1

## (వివేక వచనం)

రచన :

**సఫీ అహ్మద్ మదనీ**

అనువాదం :

**ముహమ్మద్ అజీజుర్రహ్మాన్** *B.A.*

ప్రకాశకులు :

**జమీఅతె అహ్లె హదీస్, ఆంధ్రప్రదేశ్**

*#23-1-626/3, మర్కజీ కుతుబ్ ఖానా, అహ్లె హదీస్*

*బీబీ బజార్, తలాబ్ కట్ట క్రాస్ రోడ్స్, హైదరాబాద్ - 500 002.*

https://teluguislam.net

**Kalam-e-Hikmat - I**
**(Viveka Vachanam)**
Kalam-e-Hikmat - 1 (Telugu)

Writer : Safi Ahmed Madani

Telugu Translator : Muhammad Aziz-ur-Rahman, B.A.

All Rights Reserved with Publishers

Second Edition : July, 2008

Copies : 2000

**Price : Rs.24**

***Published by :***
**Jameeat-e-Ahle Hadees, A.P.**
# 23-1-626/3, Markazi Kutub Khana, Ahle Hadees
Bibi Bazar 'X' Roads, Talabkatta
Hyderabad - 500 002

***Printed at :***
Unity Graphics
Purani Haveli, Hyderabad-2
Cell: 9885050261, 9985394757

https://teluguislam.net

హజ్రత్ ఇబ్రాహీం, హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిముస్సలాం)లు కాబా గృహాన్ని నిర్మిస్తూ ఇలా ప్రార్థించారు : "మా ప్రభూ! ఈ ప్రజలలో - స్వయంగా వీరి జాతి నుంచే - ఒక ప్రవక్తను ప్రభవింపజెయ్యి - (అతను) నీ వచనాలను వారికి వినిపించడానికి, వారికి గ్రంథం మరియు వివేకాన్ని గురించి ప్రబోధించడానికి, ఇంకా వారి జీవితాలను తీర్చి దిద్దడానికీని. నిశ్చయంగా నువ్వే గొప్ప అధికారివి, వివేకవంతుడివి."

*(అల్ బఖర : 129)*

https://teluguislam.net

“యదార్థానికి అల్లాహ్ విశ్వాసులపై ఎంతో దయదలిచాడు – (ఏ విధంగానంటే) వారి మధ్య స్వయంగా వారిలో నుంచే ఒక ప్రవక్తను ప్రభవింపజేశాడు. అతను ఆయన ఆయత్‌లను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు. ఇంకా వారికి గ్రంథాన్ని, వివేకాన్ని నేర్పుతాడు.”

*(ఆలి ఇమ్రాన్ : 164)*

https://teluguislam.net

# విషయసూచిక


| | అధ్యాయం | పేజి నెం. |
|---|---|---|
| 1. | పరలోకపు బికారి | 09 |
| 2. | ఇహపరాల శ్రేయం | 11 |
| 3. | మహనీయుని మహితోక్తులు | 14 |
| 4. | దైవ నామ స్మరణ | 18 |
| 5. | దైవ సింహాసనం ఛాయల్లో... | 22 |
| 6. | ప్రవక్త ప్రియ సహచరులను దూషించటం హరామ్ | 26 |
| 7. | దైవప్రేమ | 32 |
| 8. | పశ్చాత్తాపము | 34 |
| 9. | బలవంతుడు - బలహీనుడు | 37 |
| 10. | రెండు ఉత్తమ వచనాలు | 41 |
| 11. | మంచిని ప్రోత్సహించడం - చెడు వైపునకు పురికొల్పడం | 45 |
| 12. | మానవ సేవ | 49 |
| 13. | ప్రతి ముస్లిం గౌరవనీయుడే | 51 |
| 14. | స్వర్గం | 53 |
| 15, | పెండ్లి ప్రాముఖ్యత | 55 |
| 16. | ప్రవక్త సహచరుల స్థానం | 58 |
| 17. | దైవమార్గంలో ఖర్చు | 61 |
| 18. | విశ్వాసంలోని మాధుర్యం | 64 |
| 19. | దైవప్రవక్త (సఅసం) సంప్రదాయం | 69 |
| 20. | ప్రవక్త (సఅసం) యెడల ప్రేమ | 74 |
| 21. | సద్వర్తనుల సహచర్యం | 77 |
| 22. | స్వర్గం - నరకం | 81 |
| 23. | ముస్లిం చేసే దానధర్మాలు | 85 |


◆ ◆ ◆

https://teluguislam.net

# ముందుమాట

నేటికి పధ్నాలుగు వందల సంవత్సరాలకు పూర్వం కరుణామయుడైన అల్లాహ్ సమస్త మానవాళికి తన సందేశం అందించడానికై తన దాసుల్లో సద్వర్తనులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఎన్నుకున్నాడు. ఆనాడు ప్రపంచం అంధకారంలో మునిగి ఉంది. సత్యం, సదాచారం, సన్మార్గం అనేవి మానవ సమాజంలో బొత్తిగా అరుదైపోయాయి. ప్రజలు సన్మార్గాన్ని అన్వేషించేవారు. కాని వారికి అది లభించేది కాదు. తాత్వికతను, హేతువును ప్రబోధించే విద్యాలయాలెన్నో ఆనాడు ఉన్నప్పటికీ మానవత తన గమ్యాన్ని, గమనాన్ని గుర్తించలేక కారుచీకట్లలో తచ్చాడుతుండేది. ఇలాంటి నికృష్టపు పరిస్థితుల్లో దైవకారుణ్యం ఉప్పొంగింది. కృపాకరుడైన ఆ ప్రభువు మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)ను తన ప్రవక్తగా - అంతిమ సందేశహరునిగా - ఎన్నుకుని సమస్త మానవులకు మహోపకారం చేశాడు.

"వాస్తవానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేశాడు : స్వయంగా వారినుండే వారి మధ్య ఒక ప్రవక్తను లేపాడు. అతడు ఆయన ఆయత్‌లను వారికి వినిపిస్తాడు. వారి జీవితాలను తీర్చిదిద్దుతాడు, వారికి గ్రంథాన్ని, వివేకాన్ని నేర్పుతాడు. వాస్తవానికి ఈ ప్రజలే ఇంతకు పూర్వం ప్రత్యక్షమయిన వక్రమార్గాల్లో పడివున్నారు."

(ఆలి ఇమ్రాన్ : 164)

మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) కు లభించిన దైవదౌత్యం, హజ్రత్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ప్రార్థనాఫలం. ఇంకా అది సకల లోకాల వారి కోసం అల్లాహ్ తరపున వొసంగబడిన కారుణ్యం. ఒక ప్రవక్తగా ఆయన (సఅసం) గారి బాధ్యతలను పవిత్ర ఖుర్‌ఆన్‌లో నాలుగుచోట్ల పేర్కొనటం జరిగింది.

**1. తిలావతె ఖుర్‌ఆన్ :** దివ్య ఖుర్‌ఆన్‌ను చదివి వినిపించటం.

**2. తజ్కియ :** అంటే తన సహచరుల నీతినడవడికలను, ప్రవర్తనను గమనించి, సంస్కరించటం, వారిలోని చెడుగులను దూరం చేయటం, ఉత్తమ నైతికతను అలవరచుకోమని వారికి ప్రబోధించడం. ఈ లక్ష్యసాధనకొరకు తాను స్వయంగా ఆదర్శవంతంగా నిలబడటం.

**3. గ్రంథ బోధన :** అంటే దివ్య ఖుర్‌ఆన్‌లోని ఆయత్‌ల భావాన్ని విడమరచి చెప్పటం,

https://teluguislam.net

దైవాదేశాలను స్పష్టీకరించటం, స్వీయ ఆచరణ ద్వారా ఖుర్‌ఆన్ వాక్యాల ధ్యేయాన్ని చాటిచెప్పటం, ఉదాహరణకు : నమాజ్, రోజా, జకాత్, హజ్, జిహాద్ మొదలగు విధ్యుక్త ధర్మాలను క్రియాత్మకంగా నిరూపించటం.

**4. వివేకాన్ని నేర్పడం :** ఎందరో ప్రాచీన విద్వాంసుల, ఖుర్‌ఆన్ వ్యాఖ్యాతల అభిప్రాయంలో 'వివేకం' అంటే భావం మహాప్రవక్త (స) గారి ఆచరణే. ఆయన (స)కు దివ్యఖుర్‌ఆన్‌తో ప్రగాఢ సంబంధం ఉండేది. ఖుర్‌ఆన్‌పై ఆయన ఎల్లప్పుడూ ఆలోచించేవారు, యోచించేవారు. దానికి ఎంతగానో ప్రభావితులయ్యేవారు. ఆయన జీవితం ఖుర్‌ఆన్ రంగులో రంగరించబడి ఉండేది. ఇదిలా ఉండగా ఆయనపై సతతం దేవుని పర్యవేక్షణ ఉండేది. ఆయనకు అనునిత్యం దైవతోడ్పాటు లభించేది. అనువర్తన (ఇజ్తెహాద్) కు సంబంధించిన పొరబాటు గనక ఆయన వల్ల ఎప్పుడన్నా జరిగితే, దైవం తరఫున వెంటనే అది సరిదిద్దబడేది. చెప్పవచ్చిందేమంటే మరే మనిషిలోనూ లేని కొన్ని అసాధారణ ప్రత్యేకతలు మహాప్రవక్తలో ఉండేవి.

◆ దైవత్వం, దేవుని గుణగణాల గురించి ఆయనకు అందరికన్నా ఎక్కువ తెలుసు. ధర్మాధర్మాలు, మంచీచెడులు యుక్తాయుక్తాల విచక్షణా జ్ఞానం కూడా ఆయనకు అందరికంటే ఎక్కువ ఉండేది.

◆ ఆయన అందరికన్నా అధికంగా అల్లాహ్‌కు భయపడేవారు. దైవాన్ని సేవించే, విధేయత కనబరిచే విషయంలో అందరికన్నా ముందుండేవారు.

◆ ఆయన ఉత్తమ సందేశ ప్రచారకులు. మహా వక్త. ప్రతి విషయాన్ని ఆయన ఎంత చక్కగా, ఉత్తమ రీతిలో బోధించేవారంటే, ఆ విషయాన్ని అంతకన్నా మంచిగా వివరించటం సాధ్యపడదు.

◆ ఆయన (సఅసం) అందరికన్నా గొప్ప మానవశ్రేయోభిలాషి. మానవులను నరకాగ్ని నుండి రక్షించడానికి ఆయన సాధ్యమయినన్ని ప్రయత్నాలన్నీ చేసేవారు. ఈ మహత్కార్యం కొరకు ఎలాంటి త్యాగానికయినా సిద్ధంగా ఉండేవారు.

ఆయన పవిత్ర నోట వెలువడే ఒక్కొక్క పలుకులో బాధ్యతాభావం, భయభక్తులు, ధర్మనిష్ఠ తొణికిసలాడేవి. మరోవంక ఆయన జీవితంలో జీవిత సత్యాల సమగ్రరూపం ఉట్టిపడుతూ ఉండేది. (దేవుని తరఫున శాంతి, దీవెనలు ఆయనపై కురియుగాక!) ఆయన పలుకులు

https://teluguislam.net

సంక్షిప్తంగానే ఉన్నప్పటికీ అందులో ఎంత సమగ్రత ఉండేదంటే, వాటిని వివరిస్తూపోతే అది మహాసాగరమే అవుతుంది. ఆయన ప్రవచనాల లోతుల్లోకిపోయిన వారికి గొప్ప వివేక సంపద లభిస్తుంది.

దివ్య ఖుర్ఆన్‌లాగానే హదీసుల విషయంలోనూ జాగ్రత్తగా ఖచ్చితంగా వ్యవహరించాలన్నది సల్ఫెసాలెహ్‌ల విధానం. వారి మార్గానుసరణలోనే జీవితపు అన్ని రంగాలతో ముడిపడి ఉన్న కొన్ని హదీసుల (ప్రవక్త ప్రవచనాలు) ను ఎన్నుకుని వాటిని విపులీకరించటం జరిగింది. అవసరమనుకున్న చోట్ల మరికొన్ని వివరాలు కూడా క్రోడీకరించవలసి వచ్చింది. ఉదాహరణకు, ఉల్లేఖకులయిన సహాబాల జీవిత చరిత్రలోని కొన్ని ఘట్టాలు, దివ్య ఖుర్ఆన్ ఆయత్‌లు, ఈ గ్రంథాన్ని అందించటంలో ప్రాచీన హదీసువేత్తల వ్యాఖ్యానాలు, అభిప్రాయాలపై వీలయినంతవరకు ఆధారపడటం జరిగింది. మరికొన్ని చోట్ల ఆయా వ్యాఖ్యాతల అభిప్రాయాలను యధాతథంగా పొందుపరచటాన్ని కూడా మీరు గమనిస్తారు.

అల్లాహ్ ఈ కృషిలోని లోటుపాట్లను మన్నించి కరుణించుగాక! ఇంకా పాఠకులకు దీనిద్వారా ధర్మజ్ఞానం ప్రసాదించుగాక! (ఆమీన్). ఈ పుస్తక ప్రచురణలో ఆర్థిక సహకారం అందించిన శ్రేయోభిలాషులందరికీ అల్లాహ్ ఉత్తమ ప్రతిఫలం ప్రసాదించుగాక! వారి సంపదలో సమృద్ధినొసగుగాక! (ఆమీన్).

**- సఫీ అహ్మద్ మదనీ**

https://teluguislam.net

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

# 1. పరలోకపు బికారి

ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని హజ్రత్ అబూ హురైర (రజిఅన్) ఉల్లేఖించారు : "దరిద్రుడు ఎవరో మీకు తెలుసా?" దానికి సహాబాలు, 'ఎవరి వద్ద డబ్బు, సామగ్రి లేవో అతనే దరిద్రుడు అని మేము భావిస్తున్నాము' అని అన్నారు. ఆయన (సఅసం) ప్రబోధించారు : "నా అనుచర సమాజం (ఉమ్మత్)లో దరిద్రుడు ఎవరంటే, అతను ప్రళయదినం నాడు నమాజులు, ఉపవాసాలు, జకాత్‌లతో పాటు హాజరవుతాడు. (కాని అతను) ఒకప్పుడు ఇతన్ని తిట్టాడు, అతనిపై అపనింద వేశాడు. మరొకప్పుడు ఇతని సొమ్మును కాజేశాడు, వేరొకప్పుడు అతన్ని కొట్టాడు. అందుచేత అతని సత్కర్మలు వారికి (ఆ బాధితులకు) ఇచ్చివేయబడతాయి. ఒకవేళ అతని సత్కర్మలన్నీ అయిపోయి అతనింకా వారికి బాకీపడితే, వారి అపరాధాలు తీసి ఇతని లెక్కలో వేయబడతాయి. ఆపైన అతన్ని అగ్నిలోకి నెట్టివేయడం జరుగుతుంది." (ముస్లిం)

ఈ హదీసును ఉల్లేఖించిన వారు హజ్రత్ అబూహురైర (రజిఅన్), వీరు ప్రవక్త సహచరులలో ఎక్కువ హదీసుల్ని ఉల్లేఖించినవారు. హజ్రత్ అబూహురైర (రజిఅన్) యమన్‌లోని దోస్ తెగకు చెందినవారు. హిజ్రీ శకం 6వ ఏట వీరు మదీనాకు వచ్చి ఇస్లాం స్వీకరించారు. అప్పటి నుండి దైవప్రవక్త (సఅసం) జీవించినంతకాలం ఆయనకు తోడుండేవారు. ప్రవక్త (స) పలుకులన్నింటినీ ఆయన శ్రద్ధగా వినేవారు, ప్రవక్త ఆచరణను హృదయంలో పదిలపరచుకునేవారు. ఆయన ఇలా అన్నారు : "అన్సార్లు తమ తోటల్లో, ముహాజిర్లు వ్యాపార వ్యవహారాలలో నిమగ్నులై ఉండేవారు. నా చేయి దైవప్రవక్త (సఅసం) చేతిలో ఉండేది."

ఒకసారి హజ్రత్ అబూ హురైర (రజిఅన్) దైవప్రవక్త (సఅసం)తో, "ఓ దైవప్రవక్తా! నేను మీ పలుకులెన్నింటినో వింటున్నాను. (వాటిని) మరచిపోతానేమోనన్న భయం నాకుంది" అని విన్నవించుకున్నారు. ఆయన (సఅసం) సెలవిచ్చారు - "మీ దుప్పటిని పరచండి". హజ్రత్ అబూహురైర (రజిఅన్) దుప్పటి పరిచారు. ఆయన (స) తన చేతితో ఇన్ని నీళ్ళు దానిపై చల్లి, ఆ దుప్పటిని తుడుచుకొమ్మని చెప్పారు. నేను దుప్పటి తుడుచుకున్న తరువాత ఇక ఎన్నడూ మరుపు అనేదే రాలేదని హజ్రత్ అబూహురైర (రజిఅన్) అన్నారు.

https://teluguislam.net

వీరు గౌరవప్రదులయిన సహాబాలలోని వారు. 69 ఏళ్ళ వయస్సులో (హిజ్రీ 57లో) మదీనాలో తనువు చాలించారు. "దరిద్రుడెవరు?" అనేది హదీసులో ముఖ్యాంశం. సహాబాల మనుస్సుల్లో పరలోక చింతనను పెంపొందించడానికి మహాప్రవక్త పలు రీతుల్లో విషయాన్ని ప్రస్తావించేవారు. ఇహలోకంలోని పదాలను పరలోక పరమార్థంతో మేళవించేవారు. సహచరులు కూడా అదే రీతిలో ఆలోచించాలి, యోచించాలన్నదే దీని ఉద్దేశ్యం. 'దరిద్రుడెవరు?' అని ప్రశ్నించే రీతిలో అడిగారు ఆయన (స). సహచరుల దృష్టిని కేంద్రీకరించే ఉద్దేశ్యంతో ఇలా అడగటం జరుగుతుంది. సహాబాలు తమకు తోచినంతవరకు ఉత్తమరీతిలోనే దరిద్రునికి నిర్వచనం చెప్పారు. అప్పుడు దైవప్రవక్త (స) పరలోక దరిద్రుని స్థితిని విశ్లేషించారు. ప్రపంచపు దారిద్ర్యమైతే తాత్కాలికమైనది. ఎంతో సంక్షిప్తమైన ప్రపంచ జీవితంతోపాటే అది కూడా అంతమైపోతుంది. చాలావరకు ప్రపంచంలోనే మనిషి లేమి తరువాత కలిమి కూడా పొందుతాడు. నిజమైన దరిద్రుడు, ప్రళయదినాన చేసుకున్న సత్కర్మలన్నీ కోల్పోయేవాడే. అప్పుడతని వద్ద సత్కర్మల నిధి ఉండదు. అతనికి రుణం కూడా ఎవరూ ఇవ్వరు. ఇంకా అతను, ఇతరుల వద్ద నుండి సత్కర్మల్ని ముష్టెత్తుకుని తన అవసరాన్ని నెరవేర్చుకోనూలేడు.

లోకంలో కొంతమంది పరిస్థితి ఏమంటే వారు ఒకవైపు నుండి సత్కార్యాలు చేస్తూ పోతుంటారు. కాని మరోవంక వారి దుష్కర్మల చిట్టా కూడా పెరుగుతూనే ఉంటుంది. ముఖ్యంగా తోటి మనుషులకు చేసే అన్యాయానికి సంబంధించిన అపరాధాల చిట్టా. తీర్పు దినంనాడు మనిషి, ఇతరుల నుండి తాను పొందవలసిన హక్కును అంత తేలిగ్గా వదలుకోడు. తప్పకుండా బదులును అపేక్షిస్తాడు. ఈ హదీసు ద్వారా బోధపడే ముఖ్యాంశం ఏమంటే మనిషి కొన్ని మంచి పనులు చేసుకున్నంత మాత్రాన సరిపోదు - అతను చెడుపనుల్కు, అపరాధాలకు దూరంగా ఉండటం కూడా ఎంతో అవసరమే. ఒక వంక సత్కార్యాలు చేస్తూనే మరోవంక చెడు పనులు చేసే వ్యక్తి దృష్టాంతం ఎటువంటిదంటే, ఒక రోగి ఉన్నాడు - అతను, వ్యాధి నయం కావటానికి మందులూ వాడుతున్నాడు. ఇంకోవైపు పత్యం చేయకుండా ఏదిబడితే అది తినేస్తున్నాడు. దాని పర్యవసానం నష్టం తప్ప మరేం కాగలదు?

ఏవో కొన్ని దానధర్మాలు చేసి నిశ్చింతగా ఉండిపోయి, ఇక తమకేమీ ఫరవాలేదనుకుని ఏ చెడుపనికయినా వడిగట్టే వారికి ప్రళయదినాన పట్టే దుర్గతిపై అందరూ ఆలోచించాలి.

https://teluguislam.net

# 2. ఇహపరాల శ్రేయం

ప్రవక్త మహనీయులు ప్రబోధిస్తూ ఉండేవారని హజ్రత్ అబూహురైర (రజిఅస) ఉల్లేఖించారు : "ఓ దేవా! నా ధర్మాన్ని నా కోసం సవ్యంగా చెయ్యి. అది నా వ్యవహారానికి ప్రాతిపదిక. ఇంకా, నా కొరకు ప్రపంచాన్ని సజావుగా చెయ్యి. అందులో నా జీవితం ఉంది. ఇంకా, నా కొరకు పరలోకాన్ని సజావుగా చెయ్యి. దాని వైపునకే నేను మరలవలసి ఉంది. ఇంకా జీవితాన్ని నా కొరకు, అన్ని రకాల శ్రేయాలలో సమృద్ధికి మూలంగా చెయ్యి. ఇంకా, మరణాన్ని అన్ని రకాల ఆపదల నుండి విముక్తినిచ్చే సాధనంగా చెయ్యి." (ముస్లిం)

ఈ హదీసు ఐదు ప్రార్థనా వాక్యాలతో కూడుకుని ఉంది. ఈ ప్రార్థనా వచనాలను మహాప్రవక్త (సఅసం) అనేకసార్లు పలికేవారు. ఎందుకంటే ఈ ప్రార్థనా వచనాలు అత్యంత సమగ్రమైనవి, అర్థవంతమైనవి.

(1) "నా ధర్మాన్ని నా కోసం సవ్యంగా చెయ్యి" అనేది అసలు దుఆ. ఎవరికయితే ధర్మాన్ని సవ్యం చేసుకునే సద్బుద్ధి ప్రాప్తమయిందో వారికి ప్రాపంచిక, పారలౌకిక భాగ్యం కూడా లభించినట్లే. ఇంకా, అతని జీవితం శుభప్రదమైనదిగా, అతని పర్యవసానం ప్రశంసనీయంగా రూపుదాల్చింది. ధర్మం సవ్యం గావించబడటమంటే అర్థం మనిషికి సన్మార్గం ప్రాప్తమవటం, సదాచరణ చేసేవాడుగా అతను రూపొందడం అన్నమాట. దైవోపదేశం ఎటువంటి వరమంటే అది ప్రతి ఒక్కరికీ లభించదు. అల్లాహ్ అనుగ్రహం ఎవరిపై వర్షిస్తుందో వారికే అది ప్రాప్తమవుతుంది. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు : "(ఓ ప్రవక్తా!) .... ఈ ప్రజలు, తాము ఇస్లాం స్వీకరించి మీకు ఉపకారం చేసినట్లు మాట్లాడుతున్నారు. వారితో అనండి, మీ ఇస్లాం ఉపకారం నాపై పెట్టకండి. అల్లాహ్ మీకు, మేలును చేశాడు. నిజానికి మీరు (మీ విశ్వాసంలో) సత్యవంతులైతే ఆయన మీకు విశ్వాసభాగ్యం ప్రసాదించాడు."

తరువాత వచ్చిన నాలుగు దుఆ వచనాలు మొదటి వాక్యానికి తాత్పర్యం వంటివి. ఎవరి ధర్మం (దీన్) అయితే సజావుగా ఉందో వారి అన్నింటికన్నా పెద్ద సమస్య పరిష్కృతమైపోయింది. ఇక ఇతర సాఫల్య మార్గాలన్నీ తెరచుకున్నట్లే. ఈ మొదటి వాక్యంతో పాటు మిగిలిన నాలుగు వాక్యాలు కూడా మహాప్రవక్త (సఅసం) నోట వచ్చేశాయి. ఎందుకంటే అది దుఆ (ప్రార్థన, వేడుకోలు) చేసే సమయం! దేవుని ముందు అత్యంత వినమ్రతను ప్రదర్శించే సందర్భం! దాసుడు గనక దైవాన్ని అడిగితే, మాటి మాటికి అడిగితే సర్వోన్నత ప్రభువు సంతోషిస్తాడు. దాసుని నుండి ఆయన కోరేది కూడా అదే.

https://teluguislam.net

ఇబ్నె ఖయ్యూమ్ (రహ్మాలై) ఇలా రాస్తున్నారు : దైవ సమక్షంలో వేడుకునే సమయంలో వేడుకోలు వచనాలను విస్తృతపరచటం, సుదీర్ఘం చేయటం 'సంక్షిప్తీకరణ' కంటే ఉత్తమం. అందుకనే 'దుఆ' వచనాలను మలిసారి పలకటం, పునశ్చరణ చేయటం సంప్రదాయం (మస్నూన్). ఇదీ దుఆ యొక్క ఔన్నత్యం. దుఆలో మాటిమాటికి అడిగే దాసులను అల్లాహ్ ఇష్టపడతాడు. అందుచేతనే మహాప్రవక్త (సఅసం) గారి ప్రార్థనలలో స్పష్టమైన పదాలు మనకు కనిపిస్తాయి.

ఇమామ్ ముస్లిం, అలీ బిన్ అబీ తాలిబ్ ద్వారా - మహాప్రవక్త (సఅసం) ప్రవచించినట్లు ఉల్లేఖించారు : "ఓ అల్లాహ్! నేను నీకే విధేయుడినయ్యాను. నిన్నే విశ్వసించాను. ఇంకా నిన్నే నమ్ముకున్నాను. నిన్నే సేవించాను. నీవిచ్చిన ఆధారంతోనే వాదించాను. నువ్వే (న్యాయ) నిర్ణేత అని చెప్పాను. కనుక నువ్వు నా గత అపరాధాలను, జరగబోయే దోషాలను, గోచర అగోచర పాపాలను మన్నించు. నువ్వే నాకు దైవం. నువ్వు తప్ప మరో నిజ దైవం లేదు."

ఒకవేళ మహాప్రవక్త (సఅసం) నా అపరాధాలన్నింటినీ మన్నించు అని పలికినా సరిపోయేది. కాని ఆయన (స) ఎంతో వివరంగా విన్నవించుకున్నారు. ఇదే ఉత్తమ విధానం కూడా. ఎందుకంటే వేడుకోలు సమయంలో దాసుని తరఫున వినమ్రతా భావం, దాస్యభావం, నిస్సహాయ స్థితి వ్యక్తం కావాలి. తాను ఏ అపరాధాల మన్నింపునకై అంతగా మొరపెట్టుకుంటున్నాడో వాటిపట్ల అతని పశ్చాత్తాప భావం కూడా ప్రస్ఫుటమవటం అవసరం. ముక్తసరిగా అడిగేదానికన్నా వివరంగా అడగటాన్నే అల్లాహ్ మెచ్చుకుంటాడు. మహాప్రవక్త (సఅసం) వారి ప్రార్థనలు కూడా చాలావరకు ఇలాగే (వివరంగా) ఉండేవి. ఈ పద్ధతి ద్వారానే దాసుడు తన ప్రభువుకు సన్నిహితుడవుతాడు. తద్వారానే అతనికి ఎక్కువ ప్రతిఫలం లభ్యమవుతుంది.

ఇదీ సృష్టికర్త పరిస్థితి లేక విధానం. అయితే మనిషి వ్యవహారణ ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. మనిషిని ఎంత ఎక్కువగా అడిగితే అంత ఎక్కువగా విసుగుచెందుతాడు. మొహం చాటేస్తాడు. అడిగే వాళ్ళ నుండి పలాయనం చిత్తగిస్తాడు. అసహ్యించుకుంటాడు. యాచకులు తనకు భారమయ్యారని భావిస్తాడు. ఎదుటివారు తనని ఎంత తక్కువగా అడిగితే అంతగా వారిని గౌరవిస్తాడు. అడగని వారిని అధికంగా ప్రేమిస్తాడు. కాని దైవం అలా కాదు. పవిత్రుడైన అల్లాహ్‌ను మీరు ఎంతగా అడిగితే అంతే ఎక్కువగా ఆయన మిమ్మల్ని ప్రేమిస్తాడు.

(2) "నా ప్రపంచాన్ని నా కొరకు సవ్యం చెయ్యి" అంటే ధర్మసమ్మతమైన (హలాల్)

https://teluguislam.net

సంపాదనా మార్గాలను సుగమం చెయ్యమని భావం. సౌశీల్యవతి అయిన ఇల్లాలు, సద్వర్తనులయిన సంతానం ప్రసాదించమని, సజ్జనుల సహచర్యం వొసగమని, విపత్తులు, వైపరీత్యాల నుండి క్షేమంగా ఉంచమని, అన్ని రకాల పరీక్షలనుండి దూరంగా ఉంచమని భావం.

(3) "నా పరలోకాన్ని సజావుగా చెయ్యి" అంటే, సమాధి యాతన నుండి రక్షించమని, ప్రళయదినం నాటి కడగండ్ల నుండి కాపాడమని, "పుల్‌సిరాత్"ను సులభతరం చేయమని, అపరాధాలను, అపసవ్యమైన పోకడలను, అన్యాయాన్ని పరిహరించమని, కానుకల నిలయమైన స్వర్గంలోకి ప్రవేశం కల్పించమని భావం.

(4) "జీవితాన్ని శ్రేయాల పెంపుదలకు మూలంగా చేయి" అంటే భావం ఇది : నా జీవితం మంచి పనులలో గడిచిపోవాలి. జీవితంలోని ప్రతి ఘడియ ఫలవంతమైనదై ఉండాలి.

జీవితం కూడా అల్లాహ్ యొక్క మహదానుగ్రహం. ఎంతోమంది మరణ ఘడియలో ఆందోళన చెందుతారు. తమకు మరికొంత అవధి ఇస్తే ఫలాన ఫలాన మంచిపనులు చేసుకోవచ్చని కాంక్షిస్తారు. కాని ఆ క్షణాన్ని ఎవరూ ఆపలేరు. మరణ నిర్ణయాన్ని వాయిదా వేయలేరు. విశ్వాసి, అల్లాహ్ తనకు ప్రసాదించిన జీవితాన్ని మహాభాగ్యంగా భావించి మంచి పనులలో గడుపుతాడు. సత్కర్మల పత్రాన్ని పెంచుకుంటూ పోతాడు. కాని దుర్మార్గుడు, దౌర్భాగ్యుడు అలా కాదు - అతను ప్రతిక్షణం జీవితాన్ని దుర్వినియోగం చేస్తూ పరంలో అది తనకు భారం అయ్యేలా వ్యవహరిస్తాడు.

(5) "మరణాన్ని అన్నిరకాల యాతనల నుండి విముక్తినిచ్చే సాధనంగా చెయ్యి."

చెడులు, అపరాధాలతో నిండిన బ్రతుకుకన్నా మరణమే మేలు. ఇస్లాంలో ఆత్మహత్యకు ఎట్టి స్థితిలోనూ అనుమతి లేదు. మరణాన్ని కోరుతూ వేడుకోవడమూ తగదు. ఈ హదీసులో 'మరణం' ప్రస్తావన వచ్చిందంటే, దాని భావం మరణాన్ని కోరినట్లు ఎంతమాత్రం కాదు. ఈ హదీసులో మరణం వొసగమని చెప్పబడలేదు. వచ్చే మృత్యువు ప్రపంచలోనూ మరియు సమాధి యాతన నుండి కాపాడి, అన్ని రకాల ప్రశాంతతను, సౌఖ్యాన్ని ప్రసాదించేలా చెయ్యమని మాత్రమే దీని భావం.

మహాప్రవక్త వారి ఈ వేడుకోలులోని వాక్యాల క్రమం కూడా అత్యున్నతమైనది. ప్రథమంగా ధర్మం (దీన్) సజావుగా ఉంచమని కోరటం జరిగింది. ఆ తరువాత ప్రపంచ క్షేమం, పరలోక జీవిత సాఫల్యం ఆశించటం జరిగింది. అనంతరం జీవన వ్యవహారాలలో ఉత్తమ సరళిని, మరణానంతరం జీవితంలోని మొదటి దశను ప్రస్తావించటం జరిగింది.

https://teluguislam.net

# 3. మహనీయుని మహితోక్తులు

హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు - మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) ప్రవచించారు : "ఎవరయితే విశ్వాసి యొక్క ఐహిక బాధల్లో ఏ బాధనయినా దూరం చేస్తాడో, అల్లాహ్ ప్రళయదినం నాడు అతని బాధల్లో నుండి ఏ బాధనయినా దూరం చేస్తాడు.

"ఎవరయితే లేమికి గురైన వారి పట్ల సరళంగా వ్యవహరిస్తాడో అల్లాహ్ అతని ఇహపరాలను సులభతరం చేస్తాడు.

"ఎవరయితే ఒక ముస్లింలోని లోపాన్ని కప్పిపుచ్చుతాడో అల్లాహ్ అతని లోపాన్ని ఇహపర లోకాలలో దాచివేస్తాడు.

"దాసుడు సాటి సోదరునికి సహాయంగా ఉన్నంతవరకూ అల్లాహ్ అతనికి సహాయంగా ఉంటాడు.

"ఎవరయినా జ్ఞానాన్వేషణలో ఏ బాటపైనయినా బయలుదేరితే అల్లాహ్ అతని కోసం స్వర్గపు బాటను సుగమం చేస్తాడు.

"ఎప్పుడయినా కొంతమంది దేవుని ఏ గృహంలోనయినా దైవగ్రంథ పారాయణానికి సమావేశమైతే వారిపై ప్రశాంతత అవతరిస్తుంది. ఇంకా వారిపై కారుణ్యం అలుముకుంటుంది. దైవదూతలు వారిని ఆవరిస్తారు. అల్లాహ్ వారిని (ఆ దాసులను) తన దగ్గరి దూతల ముందు స్మరిస్తాడు.

"ఎవరి ఆచరణైతే అతన్ని వెనుక ఉంచేస్తుందో అతని పారంపర్యం అతన్ని ముందుకు పోనివ్వదు." (ముస్లిం)

(1) ఈ గొప్ప హదీసులో ఏడు మానవీయ, నైతిక నియమాలు బోధించబడ్డాయి. మొదట, "విశ్వాసి పడే బాధల్లో దేన్నయినా దూరం చేస్తే...." అని చెప్పబడింది. దీని భావం ఏమిటి? ఏ విశ్వాసినైనా అవసరానికి ఆదుకోవడం, ఏ విధంగానైనా అతనికి లాభం చేకూర్చడం, ఏ ఆపదనుండైనా అతనికి విముక్తిని కలిగించటం; ఈ పనిని మనిషి తన ధనం ద్వారానో, తన శ్రమ ద్వారానో, తన పలుకుబడి ద్వారానో, తన జ్ఞానం ద్వారానో చేయవచ్చు. ఇటువంటి పరోపకారిని అల్లాహ్ మెచ్చుకుంటాడు. తీర్పు దినంనాడు అతని యాతనను తగ్గిస్తాడు. అయితే మనిషి తాను ఏ పరోపకారం చేసినాదైవప్రసన్నతను చూరగొనడమే అతని ప్రధాన ఉద్దేశ్యమై ఉండాలి.

https://teluguislam.net

(2) "కష్టాల్లో ఉన్నవాని పట్ల సరళంగా వ్యవహరించటం" అంటే భావం, రుణగ్రస్తుడికి రుణం తీర్చేందుకు మరింత గడువు నివ్వటం లేదా అతని రుణాన్ని పాక్షికంగానో, పూర్తిగానో మాఫీ చేయటం. అలా చేసిన వానికి ప్రపంచంలోనూ, పరలోకంలోనూ అల్లాహ్ మార్గాలు సుగమం చేస్తాడు. చేతిలో పైసలు లేని రుణగ్రస్తుడిని మన్నించివేయటం లేక గడువు నొసగటం దైవమిచ్చే ప్రతిఫలానికి మంచి సాధనంగా ఉపయోగపడుతుంది, అయితే రుణగ్రస్తుడు రుణాన్ని తీర్చే తాహతును కలిగివుండి కూడా ఉద్దేశ్యపూర్వకంగా దాటవేస్తూ ఉంటే మాత్రం అతన్ని క్షమించి వదలివేయటం పుణ్యంగా పరిణమించదు.

(3) ఇక మూడవది, లోపాలను దాచిపెట్టడం గురించి -

లోపం లేదా లొసుగు శారీరకమైనదీ కావచ్చు. మానసికమైనదీ కావచ్చు, నైతిక సంబంధమైనదీ కావచ్చు, ఏ ముస్లింలోని శారీరక వైకల్యాన్నయినా అకారణంగా బహిర్గతం చేయటం అతనికి బాధ కలిగిస్తుంది. అతను మనస్తాపానికి గురవుతాడు. ఇక నైతిక సంబంధమైన లోపాలంటే వాటి గురించి ఎంతో వివరణ ఉంది. ఏ ముస్లిములోనైనా నైతికంగా ఏదైనా బలహీనత వుంటే, దానికతను మాటిమాటికీ ఒడిగట్టకుండా ఉంటే అట్టి పరిస్థితిలో అతని బలహీనత గురించి ప్రజల ముందుగాని, పాలకుల ముందుగాని చెప్పకోరాదని ఉలమాల (విద్వాంసుల) అభిప్రాయం. ఎందుకంటే అలా చెప్పటం వల్ల ఆ వ్యక్తి అవమానానికి గురవుతాడు. పరాభవం పాలవుతాడు. భవిష్యత్తులో ఆ లోపాన్ని సరిదిద్దుకుంటాడన్న నమ్మకం కూడా లేదు. అయితే ఎవరయినా అపరాధానికి, చెడు పనికి మాటిమాటికీ పాల్పడుతుంటే అతనికి నచ్చజెప్పాలి. నచ్చజెప్పినప్పటికీ అతనిలో దిద్దుబాటు కనబడకపోతే అప్పుడు అతని వ్యవహారాన్ని బాధ్యతాయుతులైన వారికి అప్పగించాలి. దానికిగాను అతనికి దండన లభించటం, అతనిలోని దుర్గుణాలను ప్రజలకు ఎరుకపరచటమే దీని ముఖ్యోద్దేశ్యం. అలా చేయటం వలన పరిసరాలలోని వారు అతని పట్ల అప్రమత్తంగా ఉంటారు. ఒకవేళ అతనిలోని లోపాలను ఉద్దేశ్య పూర్వకంగా ఉపేక్షించి వదలివేస్తే పరోక్షంగా చెడుపనుల్లో అతన్ని ప్రోత్సహించినట్లే అవుతుంది. ఇది ఎంతమాత్రం సమంజసం కాదు. దుర్మార్గుడి దుర్గుణాలను చాటటం చేయటం చాడీగా పరిగణించబడదు. పైగా దాన్ని బహిర్గతం చేయడం అవసరం. ఈ నేపథ్యంలో దైవప్రవక్త ఏమని ప్రబోధించారంటే, "మీలో ఎవరయినా, ఎప్పుడయినా ఏదయినా చెడును చూస్తే దాన్ని మీ చేత్తో సంస్కరించండి, ఇది సాధ్యపడకపోతే మీ నోటిద్వారా ఆ పని చెయ్యండి. అదీ వీలుపడకపోతే మీ మనసులోనయినా దాన్ని చెడుగా భావించండి. ఇది మీ విశ్వాసానికి ఆఖరి మెట్టు."

https://teluguislam.net

ఇక తరచూ చెడుకు పాల్పడని మొదటి వ్యక్తిలోని లోపాన్ని బహిర్గతం చేయకుండా ఉండటం ఎంత అవసరమో అతనిలోని లోపాన్ని అతనికి తెలిసి వచ్చేలా నచ్చజెప్పటం కూడా అంతే అవసరం. తద్వారా అతను ముమ్ముందు ఆ విషయంలో జాగ్రత్తగా ఉండే అవకాశం ఉంది.

(4) "దాసుడు తన సోదరుని సహాయంలో ఉన్నంత వరకు ...." ప్రతి ముస్లింకు మరో ముస్లిం నుండి సహాయం కోరే హక్కు ఉంది. ధార్మిక వ్యవహారాలలోనూ ప్రపంచంలోని మరే సమంజసమయిన సహాయం పొందే విషయంలోనూ వీలయినంతవరకు అల్లాహ్ దీని గురించి ఆదేశించాడు -

> **"సత్కార్యాల్లో, భయభక్తుల విషయాల్లో ఒండొకరికి సహాయపడండి. చెడులు మరియు అన్యాయం విషయంలో మటుకు పరస్పరం సహకరించుకోబాకండి, అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ కఠినంగా శిక్షించేవాడు." (అల్ మాయిదా : 2)**

(5) "అల్లాహ్ అతని కోసం స్వర్గపు బాటను సుగమం చేస్తాడు." స్వర్గానికి దారి అంత సులభమైనది కాదు. అది కష్టాలు, అవరోధాలతో నిండి ఉంది. మనిషి స్వతహాగా సులభమైన దాన్నే కోరుకుంటాడు. అందుకేనేమో స్వర్గానికి గొనిపోయే మార్గంలో చాలా కొద్దిమంది నడుస్తుంటారు. అయితే సత్య ప్రధానమైన జ్ఞానాన్వేషణలో బయలుదేరిన వ్యక్తికై అల్లాహ్ స్వర్గపు బాటను సులభతరం చేసివేస్తాడని తెలుస్తోంది. ఎందుకంటే జ్ఞానాన్వేషణకై బయలుదేరిన వ్యక్తి లక్ష్యమే స్వర్గానికి చేరుకోవటంగా ఉంటుంది. అతను ఆ లక్ష్య సాధనలో ఎదురయ్యే కష్టాలను కష్టంగా తలపోయడు. సంతోషంగా వాటిని సహిస్తాడు. మరోవైపు అల్లాహ్ తన అపార కృపతో, అతను కష్టాల బారిన పడకుండా కాపాడుతూ ఉంటాడు.

ప్రభువు అభీష్టమేదో దాసులకు తెలియపరచటం, ఆయన ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని వారికి వివరించటం నిజమయిన జ్ఞానం. అటువంటి జ్ఞానుల గురించి అల్లాహ్ తన గ్రంథంలో ఇలా ప్రస్తావించాడు :

> **"వారితో అనండి, తెలిసినవారు, తెలియనివారు - ఇద్దరూ సమానులు అవగలరా? హితబోధను బుద్ధిమంతులే స్వీకరిస్తారు." (అజ్జుమర్ : 9)**

(ధర్మ) విద్యలోని సుగుణం ఏమంటే అది తన విద్యార్థి విశ్వాసాన్ని, భావనలను సంస్కరిస్తుంది. నైతికతను పెంపొందిస్తుంది. అతని జీవితాన్నే తీర్చిదిద్దుతుంది.

https://teluguislam.net

అతనిలో సంస్కారాన్ని అలవరుస్తుంది. అతను పరలోక సాఫల్యమే తన లక్ష్యంగా ఎంచుకుంటాడు. దానికోసం ఏ త్యాగమయినా అతనికి తేలికగానే కనిపిస్తుంది.

(6) ''వారిపై ప్రశాంతత అవతరిస్తుంది. ఇంకా వారిపై కారుణ్యం అలుము కుంటుంది..... ''

ఇక్కడ ప్రశాంతత అంటే భావం హృదయాలు నెమ్మదిస్తాయనీ, మనస్థైర్యం ప్రాప్తమ్మవుతుందనీని, మస్జిద్ అల్లాహ్ గృహం. అందులో ఖుర్ఆన్‌ను అర్థం చేసుకోవడానికి సమకూడటం పుణ్యప్రదమయిన పని అని ఈ హదీసు ద్వారా సుబోధకమవుతోంది. అరబీ లిపి నెరిగిన ప్రతి వ్యక్తి ఖుర్ఆన్‌ను చూచి చదవగలడు. అయితే దివ్య ఖుర్ఆన్‌ను మృదుమధురంగా పఠించే పఠిత ఉంటే అతని ద్వారా ఖుర్ఆన్ వినాలి. దాన్ని అర్థం చేసుకునే, దానిపై యోచించే కృషి చేయటం శుభప్రదం. ఖుర్ఆన్ అవగాహనకై మస్జిద్‌లో సమావేశమవటం సున్నత్ కూడా.

(7) ''అతని పరంపర అతన్ని ముందుకు పోనివ్వదు ...'' ఇది అత్యంత ముఖ్యమయిన విషయం. సంతానంపై వంశ పారంపర్యంపై చెందే గర్వాన్ని, అహంకారాన్ని ఈ వాక్యం అంతం చేస్తుంది. ప్రతి వ్యక్తి ఆచరణ అతని స్వయానికే ఉపకరిస్తుంది. తండ్రి చేసుకున్న సదాచరణ దైవసమక్షంలో కేవలం తండ్రి స్థాయినే పెంచుతుంది. కొడుకుకు మాత్రం దానివల్ల ఒరిగేదేమీ ఉండదు. ప్రపంచంలో మాదిరిగా పరలోకంలో వ్యక్తికి ఆస్తిపాస్తులు, అంతస్తుల ద్వారా గౌరవం లభించదు. అక్కడ ప్రతి వ్యక్తికి ఆదరణ లభించినా, పరాభవం చేకూరినా అది అతని కర్మల్నిబట్టి ఉంటుంది. ప్రతి వ్యక్తి తాను చేసుకున్న కర్మలకు తనే బాధ్యుడు.

అల్లాహ్ తన పవిత్ర గ్రంథంలో సెలవిచ్చాడు -

> **"మానవుడు దేనికోసం ప్రయత్నిస్తాడో అదే అతనికి ప్రాప్తమవుతుంది. ఇంకా అతని ప్రయత్నం త్వరలోనే తెలిసిపోతుంది. మరి అతనికి పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది."**

**(అన్నజమ్ : 39 - 41)**

తేలిందేమంటే సదాచరణ చేయని వ్యక్తి దైవ సమక్షంలో తన తాత ముత్తాతల పుణ్యకార్యాలను ఉదాహరించి తప్పుకోలేడు. తాత తండ్రుల మంచి పనుల మూలంగా అతనికి ఉన్నత స్థానం లభించబోదు.

https://teluguislam.net

# 4. దైవనామ స్మరణ

ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు : దైవదూతలు కొందరు దైవనామాన్ని స్మరించే వారిని వెదుకుతూ దార్లలో తిరుగుతుంటారు. దైవ స్మరణలో నిమగ్నులై ఉన్నవారిని చూడగానే వారు, 'మా అవసరార్థం ఇటు మరలిరండి' అని పరస్పరం పిలుచుకుంటారు. దైవనామ స్మరణలో ఉన్నవారిని ఎందరు దూతలు తమ బాహువులతో ఆక్రమిస్తారంటే, వారి వరస మొదటి ఆకాశం వరకు చేరుకుంటుంది. వారిని వారి ప్రభువు, అంతా తెలిసి కూడా అడుగుతాడు : "నా దాసులు ఏమంటున్నారు?" దైవదూతలు సమాధాన మిస్తారు - 'వారు నీ పవిత్రతను కొనియాడుతున్నారు. ఇంకా, నీ గొప్పతనాన్ని కొనియాడుతున్నారు. ఇంకా, నీ ఔన్నత్యాన్ని శ్లాఘిస్తున్నారు. ఇంకా, నిన్ను స్తుతిస్తున్నారు. నీ పెద్దరికాన్ని వర్ణిస్తున్నారు.' అల్లాహ్ అడుగుతాడు : 'వారు నన్ను చూశారా?' 'లేదు. అల్లాహ్ సాక్షి! వారు నిన్ను చూడలేదు' అని దూతలు సమాధానమిస్తారు. అల్లాహ్ అడుగుతాడు : 'ఒకవేళ వారు నన్ను చూస్తే అప్పుడు వారి స్థితి ఎలా ఉంటుంది?' దూతలు అంటారు - 'వారు గనక నిన్ను చూసినట్లయితే నిన్ను మరింత ఎక్కువగా సేవిస్తారు. నిన్ను ఇంకా ఎక్కువగా జ్ఞాపకం చేస్తారు. ఇంకా ఎక్కువగా నీ పవిత్రతను కొనియాడతారు.' ఆయన అంటాడు : 'వారు నా నుండి ఏం కోరుతున్నారు?' దూతలు అంటారు - 'వారు మీతో స్వర్గం కోరుతున్నారు'. ఆయన అంటాడు : 'ఒకవేళ వారు నన్ను చూస్తే అప్పుడు వారి స్థితి ఎలా ఉంటుంది?' దూతలు అంటారు - 'వారు గనక నిన్ను చూసినట్లయితే నిన్ను మరింత ఎక్కువగా సేవిస్తారు. నిన్ను ఇంకా ఎక్కువగా జ్ఞాపకం చేస్తారు. ఇంకా ఎక్కువగా నీ పవిత్రతను కొనియాడుతారు. ఆయన అంటాడు : 'వారు నా నుండి ఏం కోరుతున్నారు?' దూతలు అంటారు - 'వారు మీతో స్వర్గం కోరుతున్నారు.' ఆయన అంటాడు : ఒకవేళ దాన్ని చూస్తే వారి పరిస్థితి ఎట్లా ఉంటుంది?' దూతలు బదులిస్తారు - 'వారు గనక దాన్ని చూస్తే ఇంకా అధికంగా దాన్ని ఆశిస్తారు. దాని కోసం ఎంతగానో గాలిస్తారు. దాని వైపునకు మరింత ఎక్కువగా మళ్ళుతారు.' ఆయన అడుగుతాడు : 'వారు దేన్నుండి శరణువేడుతున్నారు?' దూతలు సమాధానమిస్తారు - '(నరక) అగ్ని నుండి.' ఆయన అంటాడు : 'వారు ఆ అగ్నిని చూశారా?' దూతలంటారు - 'లేదు, అల్లాహ్ సాక్షిగా! ఓ ప్రభూ! వారు దాన్ని చూడలేదు.' ఆయన అంటాడు : 'ఒకవేళ వారు దాన్ని చూసి ఉంటే అప్పుడు వారి స్థితి ఏమౌను?' వారు సమాధానమిస్తారు - 'ఒకవేళ వారు దాన్ని చూస్తే దాన్నుండి మరింత దూరం

https://teluguislam.net

పారిపోతారు. దానిపట్ల ఇంకా ఎక్కువగా భయపడతారు.' అల్లాహ్ సెలవిస్తాడు : 'నేను మిమ్మల్ని సాక్ష్యంగా పెట్టి చెబుతున్నాను - నేను వారిని క్షమించి వేస్తాను.' అప్పుడు ఒక దూత అంటాడు - 'ఫలానా మనిషి స్మరణ చేసిన వారిలో లేడు. అతను మరో పని మీద అక్కడకు వచ్చేశాడు.' అల్లాహ్ అంటాడు : 'వారు (దైవస్మరణ చేసేవారు) ఎటువంటి వారంటే వారితోపాటు కూర్చున్న వ్యక్తి కూడా (ఆ భాగ్యాన్ని) కోల్పోడు." (బుఖారి)

ఈ హదీసులో "జిక్ర్" వాస్తవికతను, "జిక్ర్" చేసే వారి ఘనతను, ఇంకా జిక్ర్ చేసే వారితోపాటు కూర్చునే వారి భాగ్యాన్ని గురించి వివరించటం జరిగింది.

ఇక్కడ 'జిక్ర్' అంటే అర్థం ఇతర హదీసులలో పలుసార్లు నొక్కి చెప్పబడిన పవిత్ర వాక్కులను వల్లించడం. ఉదాహరణకు, 'సుబ్హానల్లాహ్', 'అల్‌హమ్‌దు లిల్లాహ్', 'లా ఇలాహ ఇల్లల్లాహ్', 'అల్లాహు అక్బర్'. ఇంకా అదేవిధంగా 'లాహౌల వ లా ఖువ్వత ఇల్లా బిల్లాహ్', 'బిస్మిల్లాహ్', 'హస్బునల్లాహ వ నీమల్ వకీల్', 'అస్తగ్‌ఫిరుల్లాహ్' మొదలగు వాక్యాలను పలుకుతూ ఉండటం, ఇంకా ఇహపర శ్రేయాలను దైవం నుండి కోరటం కూడా జిక్ర్ కోవలోకే వస్తాయి. వాజిబ్ మరియు ముస్తహబ్ ఆచరణలను చేయటం కూడా కొన్ని సమయాలలో 'జిక్ర్' (దైవస్మరణ) గానే పరిగణించబడుతుంది. ఉదాహరణకు ఖుర్ఆన్ పారాయణం, హదీసు అధ్యయనం, జ్ఞాన సదనం, నఫిల్ నమాజులు.

దైవ నామ స్మరణ చేసే వ్యక్తికి తాను పలికే పదాల భావం తెలిస్తేనే పుణ్యఫలం లభిస్తుందన్న నియమం లేదు. అయితే ఆయా పదాలకు వ్యతిరేక భావం మాత్రం అతని మనసులో ఉండకూడదన్నది షరతు. పలికే పదాలకు అర్థం కూడా తెలిసి ఉంటే ఆ స్మరణ పరిపూర్ణతను సంతరించుకుంటుంది. అల్లాహ్ ఔన్నత్యం, ఆయన అన్ని లోపాలకు, బలహీనతలకు అతీతుడు అనే భావం మనసులో గనక సతతం మెదలుతూ ఉన్నట్లయితే అప్పుడు ఆ స్మరణ మరింత అర్థవంతం అవుతుంది. దైవమార్గంలో కృషి సలుపుతూ, ఆయన మనపై విధిగా చేసిన వాటిని తు.చ. తప్పకుండా పాటిస్తూ గనక 'జిక్ర్' చేస్తే అది ఇంకా సమగ్రతను సంతరించు కుంటుంది. సంస్మర్త గనక ఏకాగ్ర చిత్తంతో దైవం వైపునకు మరలి, సంకల్పశుద్ధితో దైవాన్ని స్మరిస్తే అది మరింతగా ప్రభావవంతం అవుతుంది.

హజ్రత్ అబ్దుల్లా బిన్ బసర్ (రజిఅన్) ఉల్లేఖించిన హదీసులో దైవ నామ స్మరణ యొక్క ప్రాముఖ్యత మరోవిధంగా చెప్పబడింది. ఒక వ్యక్తి మహాప్రవక్త (సఅసం) సన్నిధికి వచ్చి, "ఓ దైవప్రవక్తా! ఇస్లాం ఆదేశాలెన్నో ఉన్నాయి. మీరు నాకు ఏదో

https://teluguislam.net

ఒక దాన్ని గురించి చెప్పండి, దాన్ని నేను అంటిపెట్టుకుని ఉంటాను" అని అన్నాడు. అప్పుడు మహాప్రవక్త (సఅసం) ప్రబోధించారు - "నీ నోరు (నాలుక) సతతం అల్లాహ్ నామస్మరణలో ఉండాలి." (తిర్మిజి)

వివిధ ఉల్లేఖనాల ద్వారా స్పష్టమయ్యేదేమంటే, దేవుని పవిత్రతను, ఆయన ఘనతను కొనియాడటం, ఆయన స్తోత్రం చేయటం, ఆయన గ్రంథాన్ని పారాయణం చేయటం, స్వర్గ నరకాలను ప్రస్తావించటం, దైవానుగ్రహాలపై కృతజ్ఞతలు వ్యక్తపరచటం వంటివి 'జిక్ర్ సదనాలు' అనిపించుకుంటాయి.

"అంతా తెలిసి ఉండి కూడా వారిని వారి ప్రభువు అడుగుతాడు." సర్వజ్ఞాని అయిన అల్లాహ్, తన దూతలతో తన దాసుల గురించి అలా ప్రశ్నించాడంటే, దాసుల విధేయతను వారికి తెలియపరచటానికే అలా చేసి ఉండవచ్చు. ఎందుకంటే, అల్లాహ్ ఆదంను సృష్టించదలచినపుడు దైవదూతలు పలికిన పలుకులను దృష్టిలో ఉంచుకుని అల్లాహ్ ఈ విధంగా ప్రశ్నిస్తాడని కొందరు ఇస్లామీయ విద్వాంసులు వ్యాఖ్యానించారు. ధరణిలో ఒక ఖలీఫా (ప్రతినిధి)ని సృష్టించబోతున్నానని అల్లాహ్ అన్నప్పుడు దైవదూతలు,

> **"ప్రభూ! అవనిలో కల్లోలం రేకెత్తించే, రక్తపాతం సృష్టించేవాడిని నువ్వు సృష్టిస్తున్నావా?! నీ స్తోత్రంతో పాటు నీ పవిత్రతను కొనియాడటానికి మేమున్నాముగా" అని విన్నవించుకున్నారు. ఆయన సెలవిచ్చాడు : "ఏదైతే నాకు తెలుసో అది మీకు తెలియదు."**
>
> **(అల్ బఖర : 20)**

'ఆనాడు నేను ఆదంను సృష్టిస్తుంటే మీరలా అన్నారు, చూడండి ఇప్పుడు ఆదం సంతతి ఏ విధంగా షైతానీ ప్రేరణలను ఎదిరించి, నా స్తోత్రం చేస్తున్నారో అని అల్లాహ్ తన దూతలకు పరోక్షంగా చెప్పదలిచాడు.

ఈ హదీసుపై మరికొంతమంది విద్వాంసుల వ్యాఖ్యానం ఇలా ఉంది : ఆదం బిడ్డలు చేసే 'జిక్ర్' (దైవస్మరణ) దైవదూతలు చేసే స్మరణకన్నా శ్రేష్ఠమయినది. ఎందుకంటే మనిషి తన దైనందిన వ్యాపకాలను నిర్వర్తిస్తూ అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ, షైతాన్ ఎత్తులను ఎప్పటికప్పుడు చిత్తుచేస్తూ దైవ నామస్మరణకు పూనుకుంటాడు. కాని దైవ దూతలకు ఈ ఇబ్బందులు లేవు.

"ఒకవేళ వారు నన్ను చూస్తే అప్పుడు వారి పరిస్థితి ఎలా ఉంటుంద"ని ప్రశ్న

https://teluguislam.net

టనిద్వారా తెలిసిందేమంటే ఐహిక జీవితంలో అల్లాహ్‌ను చూడటం సాధ్యపడదు. మహాప్రవక్త (స) ప్రవచనాన్ని ఇమామ్ ముస్లింగారూ అబూ అమామ ద్వారా ఉటంకించారు - ప్రవక్త (స) ఇలా అన్నారు : “మీరు మీ ప్రభువును మీరు మరణించే వరకు చూడలేరని తెలుసుకోండి.” దైవచిత్తమయితే విశ్వాసులు తీర్పుదినంనాడు సర్వలోకాల ప్రభువును చూస్తారు. అయితే అల్లాహ్‌ను కళ్ళారా చూడకుండానే ఆయనకు భయపడటం, ఆయన వైపునకు మరలటమే సాఫల్యానికి నిదర్శనం.

“వారెటువంటి వారంటే వారితో పాటు కూర్చున్న వ్యక్తి కూడా (భాగ్యానికి) నోచుకోక పోడు.”

సుబ్‌హానల్లాహ్! వారితో కలసి కూర్చున్న వ్యక్తి సయితం అదృష్టవంతుడై పోయాడంటే దైవ నామస్మరణ చేసేవారు ఎంతటి శుభప్రదమైనవారు!

ఈ హదీసులో పేర్కొనబడిన “జిక్ర్ సమావేశాలు” అంటే భావం విశ్వాస భావంతో దైవ నామాన్ని స్మరించే సమావేశాలలో విశ్వాసులను సహజమైన రీతిలో కలుసు కోవటం అని మహాప్రవక్త మరియు ఆయన సహచరుల హయాంలో అటువంటి సదనాలు సమావేశాలు జరిగేవి. విశ్వాసులు పరస్పరం కలుసుకునేవారు, పరామర్శలు జరిపేవారు. అల్లాహ్‌ను స్మరించేవారు. ఒండొకరిని మంచి వైపునకు ఆహ్వానించేవారు. చెడుల సంస్కరణకై నిర్మొహమాటంగా చెప్పేవారు. అల్లాహ్‌కు విధేయులై మెలగాలని, ఆయన ధర్మంపై స్థిరత్వం కలిగి ఉండాలని తాకీదు చేసేవారు.

ఈ హదీసు ద్వారా జిక్ర్ మరియు దానికోసం సమావేశమవటం యొక్క మహత్మ్యం తెలిసి వస్తోంది. ఆఖరికి సద్వర్తనులతో కలిసి కూర్చునే వ్యక్తి కూడా కారుణ్య భాగ్యానికై అర్హుడైపోతాడు. 'దైవనామ స్మరణ' దైవదూతలకు ఆహారం వంటిదని వారు దానికోసం తిరుగుతూ ఉంటారని కూడా ఈ హదీసువల్ల తెలుస్తోంది. అల్లాహ్‌చే నిర్మితమైన స్వర్గం మేలైన వస్తువులతో నిండి ఉంది. దాన్ని ఆశించే వ్యక్తికై అల్లాహ్ మార్గం సుగమం చేస్తాడు. దానికి భిన్నంగా నరకం కష్టాలతో యాతనలతో నిండి ఉంది. ఎవరయితే నరకాగ్నిని కోరుకుని, దానికి ఆహుతి అయ్యేపనులు చేయాలనుకుంటారో అటువంటి వారికై కూడా అల్లాహ్ మార్గాలు తెరుస్తాడు.

https://teluguislam.net

# 5. దైవ సింహాసనం ఛాయల్లో...

హజ్రత్ అబూ హురైరా (రజిఅన్) ఉల్లేఖించారు : "ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారు : "ఏడు రకాల మనుషులున్నారు, వారిని అల్లాహ్ తన ఛాయలో ఉంచుకుంటాడు, ఆ రోజున ఆయన ఛాయతప్పితే మరో ఛాయ ఉండదు. (ఆ ఏడుగురు ఎవరంటే) న్యాయం చేసే నాయకుడు, ప్రభుదాస్యంలో గడిపిన నవ యువకుడు, మస్జిదుల్లో మనసు లగ్నమై ఉండే మనిషి, అల్లాహ్ కొరకు పరస్పరం ప్రేమించేవారు, ఆ ప్రాతిపదికపైనే సంఘటితమయ్యేవారు, ఇంకా ఆయన కొరకే వేర్పడిపోయేవారు, అందమయిన స్త్రీ చెడు వైపునకు పిలిస్తే నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను అని చెప్పి తిరస్కరించే వారు, కుడిచేతితో దానం చేస్తే ఎడమ చేతికి తెలియనంత గుట్టుగా దానధర్మాలు చేసే వ్యక్తి, ఒంటరిగా నున్నప్పుడు దైవాన్ని స్మరించగా తన రెండు కళ్ళ నుండి కన్నీరు కార్చే వ్యక్తి." (బుఖారి)

మహత్ పూర్వకమయిన ఈ హదీసును ఇమామ్ బుఖారి (రహ్మాలై) సహీహ్ బుఖారిలో నాలుగు చోట్ల పొందుపరిచారు. ఉల్లేఖనంలోని పదాలలో కొద్దిపాటి వైవిధ్యం గోచరిస్తోంది. ఇమామ్ ముస్లిం, తిర్మిజి, నిసాయి (రహ్మాలై)లు కూడా ఈ హదీసును తమ గ్రంథాలలో ఉటంకించారు.

ఈ హదీసులో ప్రళయదినం నాటి దృశ్యం వివరించబడింది. ఆనాడు సూర్యుడు అతి దగ్గరగా ఉంటాడు. ప్రజలంతా గ్రీష్మ తాపానికి ఉడికిపోతూ చెమటలో మునిగిపోతుంటారు. ఆ సమయంలో వారికి ఎటువంటి నీడా ఉండదు. అప్పుడు అల్లాహ్ తన దాసుల్లో కొందరిని తన ఛాయల్లోకి తీసుకుంటాడు. ఇక్కడ ఛాయ అంటే భావం దైవ సింహాసనం యొక్క నీడ. దీని వివరాలు సల్మాన్ (రజిఅన్) హదీసులో ఉన్నాయి.

ఏడు రకాల మనుషులకు ఈ సందర్భంగా శుభవార్త ఇవ్వబడింది. మరికొన్ని హదీసుల ప్రకారం ఈ ఏడు రకాల వారికే కాకుండా విశ్వాసులకు తోడ్పాటునిచ్చిన మరికొందరికి కూడా దైవ సింహాసనం నీడ పొందే భాగ్యం ప్రాప్తమవుతుందని విదితమవుతోంది. ఇమామ్ ముస్లిం ఉల్లేఖనం ప్రకారం రుణగ్రస్తుడికి గడువు ఇవ్వటమో లేదా అతన్ని పూర్తిగా మన్నించి వదలివేయడమో చేస్తే అల్లాహ్ అతనికి తన నీడలో చోటిస్తాడు. హకీమ్ ఉల్లేఖనాన్ని బట్టి యోధునికి సహాయపడిన వారు, బానిస విమోచనకు తోడ్పడిన వారు ప్రళయదినాన దేవుని నీడకు నోచుకుంటారు. బగ్వి ఉల్లేఖనం ప్రకారం సత్యవంతుడైన వ్యాపారి ప్రభువు ఛాయలో ఉంటాడు.

1. హదీసులో అందరికంటే ముందు న్యాయశీలుడైన నాయకుని ప్రస్తావన వచ్చింది.

https://teluguislam.net

దీన్నిబట్టి న్యాయశీలుడైన నేత ప్రాముఖ్యత ఎటువంటిదో బోధపడుతుంది. నాయకుడు గనక న్యాయం చేసే వాడైతే అతని వల్ల అసంఖ్యాకమైన సంస్కరణలు జరుగుతాయి. సమాజానికి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయి. ఇక్కడ నాయకుడంటే అధికారం కల బాధ్యతాయుతుడని భావం. దైవ సన్నిధిలో ప్రవక్తల తర్వాత స్థానం న్యాయశీలుడయిన నేతదే. అసలు హదీసులో "ఆదిల్" అనే పదం ఉంది. అదల్ అంటే సమత్వం సమతూకం అనే అర్థాలు కూడా వస్తాయి. ఆదిల్ అంటే ప్రతి వస్తువు అది ఉండవలసిన చోట ఉండేటట్టు చూసేవాడు అని ఒక అర్థం. మరికొంత మంది దృష్టిలో ఆదిల్ అంటే విశ్వాసాలు, నైతిక నియమాలు, ఆచరణలో సమతౌల్యం దెబ్బతినకుండా చూసేవాడు, విచ్ఛిన్నతను, చిందర వందరతనాన్ని నిరోధించేవాడు. కర్షకుల హక్కుల్ని పర్యవేక్షించేవాడే ఆదిల్ అని మరికొంత మంది అన్నారు. ఆదిల్ అనే పదానికి అన్నిటికన్నా సమగ్రమయిన అర్థం దైవాదేశాలను ఖచ్చితంగా అమలుపరిచేవాడని.

2. "దైవదాస్యంలో యౌవ్వనాన్ని గడిపిన వాడు ......"

యౌవ్వనంలో చేసిన ఆరాధనలకు ప్రతిఫలం చాలా ఎక్కువగా లభిస్తుంది. సాధారణంగా మనిషి యౌవ్వనంలో విషయ లాలన వైపునకు మొగ్గు చూపుతాడు. ఆ వయస్సులో అతనిలో లైంగిక వాంఛలు అధికంగా ఉంటాయి. ప్రాపంచిక సుఖాల్ని జుర్రుకోవాలన్న కాంక్షలో పడి పెడత్రోవపట్టే అవకాశాలు కూడా ఎక్కువగానే ఉంటాయి. అయినప్పటికీ అతను వాటన్నిటినీ విడనాడి సన్మార్గాన్ని అవలంబించాడంటే అతని స్థానం నిశ్చయంగా ఉన్నతమయినదే మరి.

3. "మస్జిదులలో మనసు లగ్నమై ఉండే మనిషి ....." అంటే మస్జిదులతో ఎక్కువగా ముడిపడి ఉండేవాడు. వీలయినంత ఎక్కువ సమయం మస్జిదులలో గడపటానికి అతను ఇష్టపడతాడు. వేళకు సామూహికంగా నమాజ్ చేయాలన్న ఆరాటం అతనిలో అధికంగా ఉంటుంది. మస్జిద్‌కు సంబంధించిన పనులలో, మునుముందుంటాడు. ఒకసారి నమాజ్ చేసిన తరువాత రెండో పూట నమాజ్ కూడా జమాఅత్‌తో కలసి మస్జిదులోనే చేయాలని మనసారా కోరుకుంటాడు. దీనిద్వారా విదితమయ్యే మరో విషయమేమిటంటే, ముస్లిం ఏ మస్జిద్ పట్లయినా అసూయా ద్వేషాలు కలిగి ఉండడు. ఏ మస్జిద్ అయినా అతనికి సమానమే. అతనికి కావలసిందల్లా ఏ మస్జిదులోనయినా సామూహికంగా ఫర్జ్ నమాజ్ సలపటమే.

4. "అల్లాహ్ కొరకు ఒండొకరిని ప్రేమించేవారు."

అంటే వారి పరస్పర ప్రేమ లేదా సంబంధానికి మూలం ప్రాపంచిక లాభం పొందడం కాదు. వారు మంచిని పెంపొందించడానికి, చెడులకు దూరంగా ఉండటానికి వారు

https://teluguislam.net

స్నేహం చేస్తారు. ఒకరినొకరు కష్టాలలో ఆదుకుంటారు. ఎదుటివారి దుఃఖంలో పాలుపంచుకుంటారు. గత్యంతరం లేని పరిస్థితి ఆసన్నమైతే, లేదా మరణం వస్తే తప్ప వారు వేరు కారు.

5. "..... నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను" అని పలికే మనిషి. అందమైన స్త్రీ మనసును వశీకరిస్తుంది. కాని సులభంగా దక్కదు. కాని ఒక సౌందర్యవతి తారసపడటమే గాక, కోరివచ్చి కవ్విస్తుంటే, పురుషుడిని మరుపురాని పొందుకోసం రమ్మంటుంటే, ఎటువంటి వ్యయ ప్రయాసలు లేకుండానే కోరిక తీర్చుకునే అవకాశం లభిస్తుంటే అట్టి పరిస్థితిలో కూడా మగవాడు "నేను అల్లాహ్‌కు భయపడుతున్నాను" అని చెప్పి ఆమె ఆహ్వానాన్ని త్రోసిపుచ్చటం అపూర్వమైన విషయం. 'తఖ్వా' (భయభక్తులు, నిష్ఠ)కు ఇది గొప్ప తార్కాణం.

6. "కుడిచేతితో చేసిన దానం గురించి ఎడమ చేతికి తెలియదు." ఇది, మనిషి తానుచేసే నఫిల్ (అదనపు) దాన ధర్మాలకు ఉద్దేశించినదని పండితుల అభిప్రాయం. అయితే 'జకాత్' ఫర్జ్‌గా చేయబడింది. కనుక దాని చెల్లింపు బాహాటంగా లేదా సామూహికంగా జరగవలసి ఉంటుంది. కాని సర్వ సాధారణంగా ఇచ్చే దానధర్మాలు ఒక ప్రత్యేక సమయంలోనే గాక తరచూ చేస్తుండటం, అదీ గుట్టుగా ఇవ్వటం ఉత్తమం. అలాగాక బహిర్గతంగా, అందరికీ తెలిసే విధంగా దానాలుచేస్తే, దాతలో ప్రదర్శనా బుద్ధి జనించే ప్రమాదముంది. దీనిద్వారా రెండు విషయాలు దృష్టికి వస్తాయి. ఒకటేమంటే జకాత్ ఇవ్వగల స్థోమత ఉన్నవాడే దానధర్మాలు చేసే శక్తిని కూడా కలిగి ఉంటాడు. రెండవదేమంటే; మనిషి కేవలం జకాత్ చెల్లించేసి నా వంతు తీరిపోయిందని చేతులు దులుపుకు కూర్చోవటం సమంజసం కాదు. వీలయినంతవరకు, దేవుడు తనకు ప్రసాదించిన దాంట్లోంచి బీద సాదలకు సాయం చేస్తుండాలి. ఆ సాయం కూడా నిశ్శబ్దంగా, గప్‌చిప్‌గా చేస్తే అతను తన మనసును ప్రదర్శనాభావం, అహంకార భావం నుండి కాపాడిన వాడవుతాడు. ఎందుకంటే ప్రదర్శనాబుద్ధి, అహంకారం మనిషి సదాచరణలను హరించివేస్తాయి. కుడిచేయి, ఎడమచేయి దృష్టాంతం విషయావగాహన కోసం ఇవ్వబడింది. దీని భావం ఏమంటే; అతనెంత రహస్యంగా దానం చేశాడంటే దగ్గరలో ఉన్నవారికి, ఇరుగుపొరుగు వారికి, బంధుమిత్రులకు కూడా దాని గురించి తెలియలేదు. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో చూడండి :

**"ఒకవేళ మీరు మీ దానాలను బహిరంగంగా ఇస్తే అదీ మంచిదే. కాని మీరు గనక రహస్యంగా వాటిని అగత్యపరులకు ఇస్తే అది**

https://teluguislam.net

**మీ కొరకు ఎంతో మేలైనది. అలా చేయటం వల్ల మీ అపరాధాలెన్నో పరిహరించబడతాయి. మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు."**
**(అల్ బఖర : 271)**

7. "ఒంటరిగా అల్లాహ్‌ను జ్ఞాపకం చేస్తుండగా రెండు కళ్ళ నుండి నీళ్ళు కార్చే వ్యక్తి."

దైవ నామస్మరణ అనేది అయన గ్రంథాన్ని పారాయణం చేయడం వల్లనో, అయన స్తోత్రం చేయడం ద్వారానో, అయన ఆగ్రహానుగ్రహాలపై యోచన చేయడం వల్లనో, అయన నిదర్శనాలపై అలోచించడం ద్వారానో నెరవేరుతుంది. ఒంటరిగా ఉన్నప్పుడు అన్న షరతు ఎందుకు పెట్టబడిందంటే ఒంటరి తనంలో మనిషి ఏకాగ్రత కలిగి ఉంటాడు. ప్రదర్శనా భావానికి దూరంగా ఉంటాడు. అట్టి సమయంలో అతనికి దేవుని శిక్ష జ్ఞప్తికివస్తే మనసులో అందోళన హెచ్చుతుంది. హృదయం కరిగి కళ్ళగుండా ప్రవహిస్తుంది. ఒక్కోసారి ఒంటరిగా దైవ సన్నిధిని పొందానన్న అనందానుభూతితో కూడా కన్నీరు వస్తుంది. ఇటువంటి వారికి శుభవార్త ఇవ్వబడింది:

**"వారు ఎటువంటి ప్రవక్తలంటే, అల్లాహ్ వారిపై కానుకల్ని కురిపించాడు - ఆదం సంతతి నుండి ఇంకా ఆ ప్రజల వంశం నుండి, ఎవరినైతే మేము నూహ్ (అలైహి)తో పాటు ఓడలో పయనింపజేశామో. ఇంకా ఇబ్రాహీమ్ వంశం నుండి, ఇస్రాయీల్ వంశం నుండి, ఇంకా వారెవరంటే, సన్మార్గం పొందినవారు మరియు నియుక్తులైన వారు. వారి పరిస్థితి ఎటువంటిదంటే, కరుణామయుని వచనాలు వారికి వినిపించినప్పుడల్లా వారు ఏడుస్తూ సాష్టాంగపడే వారు."** **(మర్యమ్ : 58)**

ప్రారంభంలో పేర్కొనబడిన హదీసులో ఏడు రకాల సద్వర్తనుల ఉన్నత స్థానాన్ని, ప్రళయ దినం నాడు వారు పొందే మహదానుగ్రహాన్ని గురించి ప్రధానంగా చెప్పటం జరిగింది. ఏ మనిషిలోనయినా అటువంటి సుగుణాలనేకం సృజించబడటం, వాటి మూలంగా దేవుని కారుణ్యఛాయల్లో చోటు లభించటం ఆశ్చర్యకరమేమీ కాదు. కావలసిందల్లా చిత్తశుద్ధితో సాధన చేయడమే.

https://teluguislam.net

# 6. ప్రవక్త ప్రియ సహచరులను దూషించటం హరామ్

హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు - దైవప్రవక్త (సఅసం) ప్రవచించారు: "నా సహచరులను తిట్టబాకండి. నా సహచరులను తిట్టబాకండి. ఎవరి అధీనంలో నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను - ఒకవేళ మీలో ఎవరయినా ఉహద్ అంత బంగారం ఖర్చు పెట్టినాసరే వీరి (అంటే సహాబాలు ఖర్చుచేసిన) అర్థసేరు కాదుకదా కనీసం పావుసేరు ధాన్యానికి సమానమయిన పుణ్యఫలం కూడా పొందలేరు." (ముస్లిం)

అబూసయీద్ ఖుదరి (రజిఅన్) ప్రకారం ఖాలిద్ బిన్ వలీద్ - అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ల మధ్య ఒకసారి అభిప్రాయభేదం తలెత్తింది. అప్పుడు ఖాలిద్ బిన్ వలీద్ ఆవేశంలో అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రఅ)ను దుర్భాషలాడారు. అప్పుడు మహాప్రవక్త (సఅసం) పై హదీసును పలికారు.

"ఉహద్" ఒక పర్వతం పేరు. ప్రాచీన కాలంలో అది మదీనాకు రెండుమూడు కిలోమీటర్ల దూరంలో ఉండేది. అయితే అది ప్రస్తుతం మదీనా నగరంలో ఒక వీధిగా ఉంది. ఈ పర్వతానికి అనుకునే ఆనాడు మహా సంగ్రామం జరిగింది. అది ఉహద్ సంగ్రామంగా చరిత్ర ప్రసిద్ధిచెందింది.

అర్థసేరు అనేపదం హదీసులోని 'మద్ద్' అనే పదానికి మారుగా వ్రాయడం జరిగింది. "మద్ద్" అనేది ధాన్యం కొలిచే డబ్బాలాంటిది. అది ఇంచుమించు అర్థసేరుకు సమానం.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ మహాప్రవక్త (సఅసం) గారి తొల్దొలి సహచరులలోనివారు. దైవం ఆయనకు పుష్కలమయిన ధనరాసుల్ని ఒసగాడు. అయితే ఆయన ఆ ధనరాసులను దైవమార్గంలో విరివిగా ఖర్చు చేశారు. హిజ్రీ 33లో మదీనాలో తనువు చాలించారు.

ఖాలిద్ బిన్ వలీద్ కూడా మహాప్రవక్త సహచరులలోని వారే. అయితే ఆయన ప్రారంభంలో మహాప్రవక్త (సఅసం)కు వ్యతిరేకంగా నిలబడి పోరాడినవారు. ఆ తరువాత హిజ్రీ 8వ యేట సత్యాన్ని గ్రహించి ఇస్లాం స్వీకరించారు. ఇక ఆ తరువాత ఆయన ఇస్లాం వ్యాప్తికై తన శక్తులన్నింటినీ ధారపోశారు. ఆయన్ని ఏ సైనిక పటాలానికి కమాండర్‌గా నియమించినా విజయమే లభించేది. హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ హిజ్రీ 21 యేట కాలధర్మం చెందారు.

https://teluguislam.net

పై హదీసులో సహాబాల స్థానం, వారి త్యాగాలు ప్రముఖంగా ప్రస్తుతించబడ్డాయి. విశ్వాస స్థితిలో మహాప్రవక్త (స)ను చూచి, ఆయన వెంట ఉన్నవారిని, విశ్వాస స్థితిలోనే మరణించినవారిని సహాబాలు అంటారు.

ఇమామ్ నవవి ఇలా అంటున్నారు -

"మహాప్రవక్త (స) సహచరులంతా ఆదరణీయులే. నమ్మకస్తులే. 'ఒకవేళ వారు ఉపద్రవానికి గురయినా కాకపోయినా' దీని భావం ఏమంటే వారిలో ఎవరు మహాప్రవక్త (స) గారి పలుకులను ఉల్లేఖించినా అవి ప్రామాణికంగానే పరిగణించబడతాయి. వారి ఉల్లేఖనాలపై సంశయాలకు తావులేదు. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహ్మాలై) ఇలా అంటున్నారు : "మహాప్రవక్త సున్నత్‌ని అనుసరించే వారందరిలో సహాబాలు నమ్మకస్తులన్న విషయంలో ఏకాభిప్రాయం ఉంది. ఎవరో కొద్దిమంది బిద్అతీలు (కొత్తపుంతలు తొక్కేవారు) మాత్రమే దీంతో విభేదిస్తారు."

కాజీ అయాజ్ ఇలా అన్నారు - "ఈ హదీసు ద్వారా సహాబాలంతా, తదనంతర అనుయాయులకన్నా శ్రేష్ఠులు అన్న విషయం స్పష్టమవుతోంది. ఎందుకంటే మహాప్రవక్త (స) ప్రత్యక్ష సహచరులు తొలి దశ నుంచీ కష్టకాలంలో ఆదుకున్నారు. తమ ఇళ్ళల్లో ఉన్నదంతా దైవమార్గంలో అర్పించారు. ఎల్లప్పుడూ మహాప్రవక్తను వెన్నంటి ఉండేవారు. ఈ భాగ్యం తరువాతి వారికి లభించలేదు. జిహాద్ విషయంలోనయినా, విధేయత విషయంలోనయినా సహాబాల తరువాతే ఇతరుల స్థానం. సర్వోన్నత ప్రభువు ఇలా సెలవిచ్చాడు -

> **"మీలో (మక్కా) విజయానంతరం ఖర్చుపెట్టిన వారు మరియు పోరాడినవారు (మక్కా) విజయానికి పూర్వం ఖర్చుపెట్టినవారితో, పోరాడినవారితో సమానులు కాజాలరు. వారు ఉన్నత శ్రేణికి చెందినవారు."**

అదీగాక వారి హృదయాలలో ప్రేమానురాగాలు, దయాభావం, సంకల్పశుద్ధి, అణకువ, వినమ్రత, దైవమార్గంలో పోరాటపటిమ విరివిగా ఉండేవి. ఒక్క క్షణమే కానివ్వుగాక మహాప్రవక్త (స)తో కలసి గడపటమే వేరు. ఆ మధుర క్షణాలతో సరితూగగల ఆచరణ ఇంకేది కాగలదు!? ఎవరెంత ప్రయత్నించినా ఆ స్థాయికి చేరుకోలేరు. అది కేవలం దైవకృప మాత్రమే. అల్లాహ్ కోరిన వారికే అది దక్కింది.

కాజీ అయాజ్ ఇలా అభిప్రాయపడ్డారు : "ఈ ఉన్నతస్థానం, మహాప్రవక్త వెంట సుదీర్ఘకాలం గడిపిన, దైవమార్గంలో విరివిగా ఖర్చుచేసిన, ధర్మపోరాటం చేసిన, హిజ్రత్ చేసిన వారికే వర్తిస్తుందని పలువురు హదీసువేత్తలు అంటున్నారు. అంతేగాని

https://teluguislam.net

మహాప్రవక్తను కేవలం ఒకసారి చూసినవారికో, లేక మక్కా విజయానంతరం విశ్వసించిన వారికో ఆ ఉన్నత స్థానం లభించదు. ఎందుకంటే వారికి దైవమార్గంలో హిజ్రత్‌గాని, ప్రారంభంలో విశ్వసించిన ముస్లిములకు సహాయపడే అవకాశం గాని రాలేదు."

ఈ అభిప్రాయంకన్నా, మహాప్రవక్తను విశ్వాసస్థితిలో చూసిన వారంతా సహాబాలుగానే పరిగణించబడతారన్న అభిప్రాయమే నిర్వివాదాంశంగా తోస్తుంది.

ఈ హదీసు మహాప్రవక్త ప్రియ సహచరుల త్యాగాల సాగరంలో ఒక బిందువు మాత్రమే. దైవగ్రంథమైన ఖుర్‌ఆన్‌లోనూ, మహాప్రవక్త పలుకులలోనూ సహాబాల స్థానం అత్యున్నతమైందని చెప్పబడింది.

> "(ఈ విజయప్రాప్తి) ఆ బీద ముహాజిర్లకే చెందాలి. ఎవరయితే తమ ఇళ్ళూ, వాకిలి మరియు ఆస్తిపాస్తులకు నోచుకోకుండా తీసివేయబడ్డారో, వీరు దైవకృపను, ఆయన ప్రసన్నతను కోరుకుంటారు. అల్లాహ్ మరియు ప్రవక్త మద్దతుకై సన్నద్ధులై ఉంటారు. వీరే సన్మార్గగాములు. ఇంకా, ఈ ముహాజిర్లు వలస రాకపూర్వం విశ్వసించి 'దారుల్ హిజ్రత్' (యస్రిబ్ లేదా మదీనా) లో వేచివున్న వారికి కూడా (ఈ విజయ ప్రాప్తిచెందాలి). వీరు తమ వద్దకు వలస వచ్చిన వారిని ప్రేమిస్తారు. ఏది వారికి ఇచ్చినా దాని గురించి మనసులోనే పెట్టుకోరు. తమకేదయినా అవసరం ఉన్నప్పటికీ తమ స్వయంపై ఇతరులకే ప్రాధాన్యతనిస్తారు. యథార్థానికి తమ మనసులోని సంకుచితత్వానికి దూరంగా మసలుకున్నవారే సాఫల్యం పొందుతారు." (అల్ హష్ర్ : 8, 9)

పై రెండు ఆయత్‌లలో అల్లాహ్ అన్సార్లను, ముహాజిర్లను సాఫల్యం పొందిన వారుగా పేర్కొన్నాడు. ఈ విధంగా ఎన్నో ఆయత్‌లలో మహాప్రవక్త ప్రియ సహచరులు కొనియాడబడ్డారు. తరువాత వచ్చిన అనుయాయులు ఈ సహాబాల పట్ల ప్రేమ కలిగి ఉండాలని, వారి కోసం దైవాన్ని ప్రార్థిస్తూ ఉండాలని తాకీదు చేయడంజరిగింది. హష్ర్ సూరాలోనే పదవ ఆయత్‌లో చూడండి -

> "వీరి తరువాత వచ్చిన వారు ఇలా వేడుకుంటారు – "ఓ మాప్రభూ! మమ్మల్ని, మాకు పూర్వం విశ్వసించిన సోదరులందరినీ క్షమించు! విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎటువంటి కాపట్యాన్నీ ఉంచబాకు. మా ప్రభూ! నువ్వెంతో దయామయుడవు, కృపాకరుడవు."

తమకు పూర్వం విశ్వసించిన వారి మన్నింపునకై ప్రార్థించటం విశ్వాసుల సుగుణానికి తార్కాణమని పై ఆయత్ ద్వారా రూఢీ అవుతోంది. వారి యెడల ఎటువంటి

https://teluguislam.net

కాపట్యాన్నిగాని, దురుద్దేశ్యాన్ని గాని వారు సహించరు.

మహాప్రవక్త ప్రియ సహచరులలో ఎవరినయినాసరే నోటికొచ్చినట్లు మాట్లాడే వారిని గురించి హజ్రత్ ఆయిషా (ర.అన్హా) అర్వ బిన్ జుబైర్‌తో ఇలా అన్నారు: "ఓ నా సోదరి కుమారా! సహాబాల మన్నింపునకై వేడుకుంటూ ఉండమని వీరికి ఆదేశించబడింది. కాని వీళ్ళు వారిని దుర్భాషలాడారు." (ముస్లిం)

మహాప్రవక్త (సఅసం) ప్రబోధించారు - "అత్యుత్తమమైన కాలం నాది. ఆపైన నా తరువాతది. ఆపైన దాని తరువాతది." (బుఖారి)

ఇబ్నె అబ్బాస్ (రజిఅన్) ఇలా అన్నారు - "మహాప్రవక్త వారి సహచరులను దూషించకండి. వారు మహాప్రవక్తతో గడిపిన ఒక్క క్షణం మీ యొక్క 40 యేళ్ళ అచరణకన్నా శ్రేష్ఠమైనది."

"కొంతమంది, దైవప్రవక్త సహచరులను, ఆఖరికి అబూబకర్, ఉమర్‌లను కూడా పరుషంగా మాట్లాడుతున్నారు" అని హజ్రత్ ఆయిషా (ర.అ) తో చెప్పగా, "అందులో ఆశ్చర్య పడాల్సింది ఏముంది? వారి ఆచరణ సమాప్తమయింది. అయితే వారికి లభించేపుణ్యఫలం సమాప్తం కారాదని అల్లాహ్ నిర్ణయించాడు" అని ఆమె బదులిచ్చారు. ఈ పలుకులను జాబిర్ (రజి) ఉల్లేఖించారు. దీని భావం ఏమిటంటే, దుర్భాషలాడిన, చాడీలు చెప్పిన వారి సత్కార్యాలు కీర్తిశేషులయిన ఆ మహనీయుల ఖాతాలో జమ అవుతాయి. ఆ విధంగా వారు చనిపోయినప్పటికీ ప్రతిఫలాన్ని పొందుతూనే ఉన్నారు.

ప్రముఖ హదీసు వేత్త అబూజర్ అత (రహ్మలై) ఇలా అన్నారు : ఎవరయినా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రియ సహచరులలో ఎవరినయినా అగౌరవపరుస్తూ మాట్లాడటం మీరు చూస్తే అతను ధర్మభ్రష్టుడని తెలుసుకోండి. ఎందుకంటే దైవప్రవక్త (స) సత్యసంధులు. ఖుర్‌ఆన్ సత్యబద్ధమైనది. అటువంటి ఖుర్‌ఆన్‌ను, మహాప్రవక్త సంప్రదాయాన్ని మనదాకా అందజేసినవారే సహాబాలు. ఖుర్‌ఆన్ మరియు సున్నత్‌ను మనకందజేసిన సహాబాలు నమ్మకస్తులు కారని వారు చెప్పదలుస్తున్నారు. ఆ విధంగా ఖుర్‌ఆన్ హదీసులు మిథ్య అని నిరూపించదలుస్తున్నారు. ఇటువంటి వారంతా ధర్మవిరోధులు, ధర్మభ్రష్టులు."

మహాప్రవక్త (స) ప్రియసహచరుల విషయంలో అహ్లె సున్నత్‌వల్ జమాఅత్ పంథా సమతూకంతో కూడినది. అది వారి స్థానం నుండి వారిని మరీ ఎత్తి దైవంతో సరితూగే స్థానమూ కల్పించదు. అలా అని వారిని అవహేళనచేసే విధంగానూ దిగజార్చదు. అందుకే అహ్లె సున్నత్‌లు మధ్యస్థ విధానాన్ని అవలంబిస్తారు. వారు అందరినీ

https://teluguislam.net

ప్రేమిస్తారు. న్యాయంగా ఎవరికి ఏ స్థానం ఇవ్వాలో ఇస్తారు. వారి అంతస్తును మరింత పైకి ఎత్తనూ ఎత్తరు. వారి హక్కుల్ని నెరవేర్చటంలో లోటూ రానివ్వరు. మహాప్రవక్త సహచరుల ప్రశంసలో వారి నోళ్ళు తడిగా ఉంటాయి. వారి పట్ల ప్రేమతో వారి హృదయాలు నిండిపోతాయి.

సహాబాల మధ్య ఎప్పుడయినా, ఏదయినా విభేదం గాని, వివాదం గాని తలెత్తితే అది కేవలం 'ఇజ్తెహాద్' షరీఅత్ అన్వయింపు కారణంగానే తలెత్తేది. ఎవరు ఇజ్తెహాద్‌లో కరెక్టుగా ఉంటే వారికి రెట్టింపు ప్రతిఫలం లభిస్తుంది. మరెవరి ఇజ్తెహాద్‌లో లోపం ఉంటుందో వారికి ఒకే వంతు ప్రతిఫలం లభిస్తుంది. సహాబాలు మానవాతీతులు కారు. వారూ మానవులే. వారి ద్వారా కూడా పొరపాట్లు జరగవచ్చు. జరిగేవికూడా. అంతమాత్రాన అసాధారణమయిన వారి త్యాగాలు, సుగుణాలు మరుగున పడజాలవు. వారి సత్కర్మలు తదనంతర అనుయాయుల సత్కార్యాల కంటే అధికం. అలాగే వారి పొరపాట్లు వారి తరువాతి వారి పొరబాట్లకన్నా బహుస్వల్పం. అదీగాక, అల్లాహ్ వారిని మన్నించాడు. వారితో ప్రసన్నుడైనాడు.

తావీ (రహ్మాలై) గారు "అఖీద అహ్లుల్ సున్నత్" లో ఇలా రాస్తున్నారు : మనమంతా మహాప్రవక్త ప్రియ సహచరులను ప్రేమిస్తున్నాము. వారిలో ఎవరి ప్రేమ పట్ల కూడా వైపరీత్యానికి పోము. ఇంకా వారిలో ఏ ఒక్కరితోనో సంబంధాన్ని త్రెంచుకోవటమూ లేదు. ఎవరు సహాబాల పట్ల కపటత్వం ప్రదర్శించారో వారిపట్ల మేముకూడా అలాగే వ్యవహరిస్తాము. మేము మటుకు వానిని మంచి పదాలతోనే స్మరిస్తాము. వారిపట్ల ప్రేమ ఉంటేనే ధర్మం (దీన్) పట్ల ప్రేమ, విశ్వాసం ఉన్నట్లు లెక్క. వారిపట్ల గనక వైరభావం ఉంటే అది కుఫ్ర్ (తిరస్కారం)కు, కాపట్యానికి, తలపొగరుతనానికి ఆనవాలు అవుతుంది.

ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (రహ్మాలై) ఏమంటున్నారో చూడండి -

సహాబా (ర.అ)లందరి సుగుణాలను స్మరించడం, వారిలోని పరస్పర విభేదాల గురించి చర్చకు తావీయకుండా ఉండిపోవటం సంప్రదాయం (సున్నత్). ప్రవక్త సహచరుల్లో ఏ ఒక్కరినయినా సరే దూషించినవాడు మార్గవిహీనుడే. సహాబాల పట్లప్రేమ కలిగి ఉండటం సున్నత్. వారి కోసం దైవాన్ని వేడుకోవటం దైవ సాన్నిధ్యాన్ని పొందటమే. ఇంకా వారి మార్గాన్ని అనుసరిస్తే అది మోక్షానికి వారధి వంటిది. వారి పాద చిహ్నాలలో నడుచుకోవటం ఔన్నత్యానికి సోపానం.

సహాబాలలోని తప్పులను చర్చించే, లేదా వారిలో ఎవరినయినా అవమానపరచే అనుమతి ఎవరికీ లేదు. అలా చేసిన వారిని కాలపు రాజ్యాధికారి విధిగా శిక్షించవలసి ఉంటుంది. అటువంటి వారిని మన్నించి వదలివేయటం సబబు కాదు. వారిని

https://teluguislam.net

శిక్షించాలి, ఆపైన వారిచేత పశ్చాత్తాపం ప్రకటించాలి. పశ్చాత్తాపపడితే సరి. లేకపోతే వారికి మళ్ళీ శిక్ష విధించాలి. వారు తమ తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడేవరకూ నిర్బంధంలో పెట్టాలి.

అబూ సయీద్ ఖుదరి (ర.అ) ఉల్లేఖించిన హదీసు ప్రకారం సహాబాలలో అంతస్తులున్నట్లు నిర్ధారణ అవుతోంది. వారిలో వివిధ కోవలున్నట్లు కూడా విదితమవుతోంది. విజయానికి పూర్వం దైవమార్గంలో తమ ధనంతో, ప్రాణాలతో పోరాడిన వారికి విజయం తరువాత పోరాడిన వారు సాటి రాలేరని అల్లాహ్ స్వయంగా పేర్కొన్నాడు.

> **"మీలో ఎవరయితే విజయం తరువాత ఖర్చు చేశారో, పోరాడారో వారు ఎప్పటికీ విజయానికి పూర్వం ఖర్చుచేసిన, పోరాడిన వారితో సమానులు కాలేరు."**

ఇక్కడ "విజయం" అనే పదం హుదైబియా ఒడంబడిక నేపథ్యంలో ఉంది. హుదైబియా ఒప్పందం తరువాత చేసిన త్యాగాల కంటే హుదైబియా ఒప్పందానికి ముందుచేసిన త్యాగాలు ఇంకా విలువైనవని తెలుస్తోంది. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)ని ఖాలిద్ బిన్ వలీద్ (రజి) పరుషంగా మాట్లాడినప్పుడు మహాప్రవక్త (సఅసం) వారించటమే గాక అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌ను తన సన్నిహితునిగా పేర్కొన్నారు. ఎందుకంటే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ తొలి రోజుల్లో ఇస్లాం స్వీకరించారు. ఖాలిద్ బిన్ వలీద్ చివర్లో ఇస్లాం స్వీకరించారు. ఖాలిద్ బిన్ వలీద్ అంతటి వారే అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)కు సాటి రాలేనపుడు ఆ తరువాతి అనుయాయుల్లో మాత్రం సహాబాలతో సరిపడే వారెవరుంటారు?

ఈ హదీసు ద్వారా బోధపడిందేమంటే మహాప్రవక్త (సఅసం) యొక్క ప్రియ సహచరులంతా మనకు గౌరవనీయులు, ఆదర్శప్రాయులు, కనుక వారి పొరపాచ్చాలను వెతుకుతూ ఉండటం, వాటిని సాగదీయటం వాంఛనీయం కాదు. అది అమర్యాద, అవిజ్ఞత అనిపించుకుంటుంది. మనం ఎంతసేపటికీ వారి సత్కార్యాలనే మార్గపు కాగడాలుగా ఎంచుకోవాలి. వారిలోని లోటుపాట్లను విస్మరించాలి. వారి స్థాయిని మనలో ఎవరూ అందుకోలేరని తెలుసుకోవాలి. వారి అపారమైన సుగుణాల ముందు వారి లోటుపాట్లు దేనికీ పనికిరావు. అనుయాయుల్లో ఎవరయినా సరే వారికి వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకోవటం అమర్యాదకరంగానే పరిగణించబడుతుంది. మనం చేయవలసిందల్లా వారి శ్రేయాన్ని అభిలషిస్తూ ప్రార్థించటం, వారి జీవితాల ద్వారా గుణపాఠం గరపుతూ ఉండటమే.

https://teluguislam.net

# 7. దైవప్రేమ

అంతిమ దైవ ప్రవక్త (సఅసం) ఉపదేశించారని హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు : "అల్లాహ్ తన దాసుల్లో ఎవరినయినా ఇష్టపడినపుడు జిబ్రయీల్‌ను పిలిచి, 'అల్లాహ్ ఫలానా దాసుడ్ని ఇష్టపడుతున్నాడు. కనుక మీరు కూడా అతన్ని ప్రేమించండి' అనంటాడు. జిబ్రయీల్ అతన్ని ప్రేమించటం మొదలెడతారు. తరువాత ఆయన ఆకాశవాసుల్లో ప్రకటన గావిస్తూ 'అల్లాహ్ ఫలానా దాసుడ్ని ఇష్టపడుతున్నాడు కాబట్టి మీరు కూడా అతన్ని ప్రేమించండి' అని కోర్తారు. ఆకాశవాసులు అతన్ని ప్రేమించసాగుతారు. ఇంకా భూవాసులలో అతని పట్ల ఆదరాభిమానం కలుగజేయబడుతుంది." (ముస్లిం)

ఈ హదీసులో అల్లాహ్‌లోని ప్రేమైక గుణం ప్రధానంగా చెప్పబడింది. దైవప్రేమకు అర్హుడయ్యే దాసుడెవరు? దీని సమాధానం ష్పూబాన్ (రజి) గారి హదీసు ద్వారా చాలా వరకు లభిస్తుంది. మహనీయ ముహమ్మద్ ప్రవచించారు - దాసుడు దైవ ప్రసన్నతను బడయటంలో ఎంతగా లీనమైపోతాడంటే, అల్లాహ్ తన దూతతో, 'జిబ్రయీల్! నా ఫలానా దాసుడు నన్ను మెప్పించగోరుతున్నాడు. ఓ జిబ్రయీల్! నా ఫలానా దాసుడు నన్ను ప్రసన్నుడ్ని చేయదలుస్తున్నాడు. వినండి! అతనిపై నా కారుణ్యం అలుముకుంది' అని అంటాడు. అప్పుడు జిబ్రయీల్ 'ఫలానా దాసునిపై దైవ కారుణ్యం అవతరించుగాక!' అని అంటారు. ఆకాశవాసులు కూడా 'అతనిపై దైవ కారుణ్యం వర్షించుగాక!' అని ఎలుగెత్తి చాటుతారు." (అహ్మద్)

దైవప్రసన్నతాన్వేషణ అనేది ఆయన నిర్ణయించిన విధ్యుక్త ధర్మాలను పాటించటం ద్వారా, అదనపు ఆరాధనల ద్వారా నెరవేరుతుంది. అలాగే అధర్మమయిన వాటికి దూరంగా మసలుకోవటం, నిష్ఠను ధర్మపరాయణతను అలవరచుకోవటం కూడా అవసరం. ఈ సందర్భంలో మహాప్రవక్త ఈ ఆయత్‌ను పఠించినట్లు తిబ్రానీలో ఉంది :

> "ఎవరయితే విశ్వసించారో, సత్కార్యాలు చేశారో వారికోసం కరుణామయుడు నిశ్చయంగా త్వరలోనే ప్రేమను సృజిస్తాడు."
>
> **(మర్యమ్ - 96)**

అంటే విశ్వాసుల కొరకు అల్లాహ్ హృదయాలను మెత్తబరుస్తాడు. వారి యెడల ప్రజల మనస్సులలో ప్రేమను పుట్టిస్తాడు.

https://teluguislam.net

యజమాని తన దాసుణ్ని ప్రేమించటమనేది ఆయన స్థాయికి తగిన విధంగా ఉంటుంది. యదార్థానికి నిజ యజమాని స్థాయికి ఎవరూ చేరుకోలేరు. అలాగే ఆయన గుణగణాలను ఎవరూ విశ్లేషించనూ లేరు. అయినప్పటికీ అంతటి శక్తిమంతుడు సద్వర్తనుడైన దాసుణ్ని ప్రేమిస్తాడనేది యదార్థం. అదులో ఎటువంటి సందేహానికి ఆస్కారం లేదు.

ప్రేమ ఒక అనిర్వచనీయమైన భావన. అది కేవలం ఆచరణ లేదా ప్రవర్తన ద్వారానే వ్యక్తమవుతుంది. ఆకాశవాసులు భూవాసులు కూడా పరస్పరం ప్రేమించుకుంటారు. ఎదుటివాని శ్రేయాన్ని అభిలషించటం, విపత్తుల బారినుండి అతన్ని కాపాడటం, ఆపదలో ఆదుకోవటం ఇత్యాది విధాలుగా అది వ్యక్తమవుతూ ఉంటుంది. ఇక ఆకాశ వాసుల ప్రేమ ఎలా ఉంటుందంటే, వారు మంచివారైన దాసుల మన్నింపునకై దైవాన్ని ప్రార్థిస్తారు. వారి మనసులలో సవ్యమైన భావాలను కలిగిస్తారు.

"అతని పట్ల ఆదరాభిమానం కలుగజేయబడుతుంది" అంటే భావం భూవాసులు కూడా అతనంటే ఇష్టపడతారని. ఈ హదీసు ద్వారా సజ్జనులను ప్రేమించడం అల్లాహ్ ప్రేమకు తార్కాణమని కూడా విదితమవుతోంది. "మీరు ధరణిలో అల్లాహ్‌కు సాక్షులు" అని మహాప్రవక్త తన సహచరుల నుద్దేశించి చెప్పారు.

అల్లాహ్ ప్రేమకు ప్రతిరూపం. ప్రేమ ఆయన గుణగణాలలో ప్రముఖమైంది. దాని అన్వేషణకు పూనుకున్న వారికి, దానికోసం పరితపించిన వారికే ఆ భాగ్యం ప్రాప్తిస్తుంది.

https://teluguislam.net

# 8. పశ్చాత్తాపం

హజ్రత్ అబూ హురైర (రజిఅన్) ఉల్లేఖించారు - మహాప్రవక్త ముహమ్మద్(సఅసం) ప్రబోధించారు : "ఏ దాసుడైనా అపరాధం చేసి 'నా ప్రభూ! నా వల్ల అపరాధం జరిగిపోయింది. నన్ను క్షమించు' అని వేడుకుంటే అతని ప్రభువు ఇలా అంటాడు- 'తన తప్పులను మన్నించి, తనను రక్షించగల ప్రభువు ఉన్నాడన్న సంగతి నా దాసునికి తెలుసా? అయితే నేను నా దాసుడ్ని క్షమించివేశాను.' ఇక అల్లాహ్ కోరినంత వరకు అతను అపరాధాకు దూరంగా ఉంటాడు. మళ్ళీ అపరాధంచేసిమళ్ళీ అడుగుతాడు; 'ఓ నా ప్రభూ! నా వల్ల మరొక తప్పు జరిగిపోయింది. దీన్ని కూడా క్షమించేయి' అప్పుడు అల్లాహ్, 'తన తప్పులను మన్నించి, తనను కాపాడగల ప్రభువు ఉన్నాడని నా దాసుడు తెలుసుకున్నాడా? అయితే నేను నా దాసుడ్ని మన్నించాను' అని అంటాడు. ఇక ఆ దాసుడు అల్లాహ్ తలచినంతవరకు అపరాధాల బారినుండి సురక్షితంగా ఉంటాడు. మళ్ళీ అపరాధానికి ఒడిగట్టి తిరిగి ప్రార్థిస్తాడు ; 'నా స్వామీ! నా వల్ల ఒక తప్పు జరిగిపోయింది. నన్ను క్షమించి వదిలెయ్యి.' అల్లాహ్ తిరిగి అంటాడు - 'తన తప్పులను మన్నించి తనకు రక్షణ కల్పించే ప్రభువు ఉన్నాడన్న యధార్థాన్ని నా దాసుడు గ్రహించాడా?! అయితే నేను నా దాసుడ్ని క్షమించివేశాను. నేను నా దాసుడ్ని క్షమించి వేశాను. అతను తాను తలచింది చేయగలడు." (బుఖారి).

ఈ హదీసులో పశ్చాత్తాపం (తౌబా) ప్రాముఖ్యత, దాని ఘనత వివరించబడింది. దాసుడు తప్పును ఒప్పుకుని తన వైపునకు మరలడాన్ని అపరాధాల మన్నింపునకై తనను ప్రార్థించటాన్ని విశ్వప్రభువు ఎంతగానో ఇష్టపడతాడు. ఆయన క్షమాగుణానికి అంతే లేదు. ఖుర్తబి ఏమంటున్నారంటే, ఈ హదీసు క్షమాభిక్ష ద్వారా పొందే ప్రయోజనానికి అనంతమైన దైవకారుణ్యానికి, విస్తారమైన ఆయన అనుగ్రహాలకు, ఆయన గొప్పదనానికి ప్రతీకగా నిలిచింది. క్షమాభిక్ష భావం అనేది మనసులో కలిగి నోటిద్వారా గనక వ్యక్తమయితే పాపాల నుండి తప్పక విముక్తి లభిస్తుంది. మనసులో గనక పశ్చాత్తాప భావం ఏర్పడితే అది అతని ముఖ కవళికలపై అతని మాటలపై కూడా ప్రభావం వేస్తుంది. అతని మాటల్లోనే లజ్జా భావం వ్యక్తమవుతుంది.

అటువంటి వక్తి తన చేత ఎప్పుడు అపరాధం జరిగిపోయినా పశ్చాత్తాపాన్ని ఆశ్రయిస్తాడు. అయితే ఒక వ్యక్తి పొద్దస్తమానం "అస్తగ్ఫిరుల్లాహ్, అస్తగ్ఫిరుల్లాహ్" అంటూనే పాపాలు మామూలుగా చేస్తూపోతే మాత్రం అతను పశ్చాత్తాపం గ్రహించలేదనుకోవాలి. అటువంటి నోటితో పశ్చాత్తాపం ప్రకటించినా అది వ్యర్థమే.

https://teluguislam.net

ఇబ్నె అబీ అద్దీనా గారు అబ్దుల్లా బిన్ అబ్బాస్ ద్వారా ఉటంకించారు : అపరాధాల పట్ల పశ్చాత్తాపం చెందినవాడు అపరాధం చేయనట్లే లెక్క. అయితే నిత్యం అపరాధాలు చేస్తూ కూడా ప్రభువు ముందు క్షమాభిక్ష కోరేవాడు ప్రభువుతో పరిహాసమాడా డన్నమాట."

ఖుర్‌తబి అభిప్రాయం ఇలా ఉంది : "ఈ హదీసు ద్వారా వ్యక్తమయ్యే ఒక కోణం ఏమంటే, రెండవసారి చెడుకు పాల్పడితే అది మొదటి అపరాధం కన్నా ఎక్కువ పాతకం అవుతుంది. ఎందుకంటే ఈసారి మొదటి పశ్చాత్తాపం కూడా భంగమైపోయింది. అయితే రెండవసారి చెందిన పశ్చాత్తాపం కూడా చాలా మంచిదే. ఎందుచేతనంటే అతను కారుణ్య ప్రభువును మాటిమాటికీ క్షమ కోసం దరఖాస్తు చేసుకుంటున్నాడు. అంతేకాదు, తనచేత ఘోరం జరిగిపోయిందని ఒప్పేసుకుం టున్నాడు. తనుచేసిన తప్పును 'నువ్వు తప్ప మరొకడు క్షమించడు' అని కూడా అంగీకరిస్తున్నాడు.

ఈ హదీసు వివరణలో నవవి ఇలా వ్రాశారు : "పాపం అన్నది ఒకసారి జరిగినా, వెయ్యిసార్లు జరిగినా, లేదా అంతకంటే ఎక్కువసార్లు జరిగినా ప్రతిసారి పశ్చాత్తాపం చెందాలి. లేదా చివరిలోనయినా పశ్చాత్తాపం మనస్ఫూర్తిగా చెందితే అది నిజమవుతుంది."

పశ్చాత్తాపం స్వీకరించబడటానికి నాలుగు షరతులున్నాయని ఉలమాలు (ఇస్లామీయ పండితులు అంటారు) -(1) పాపపు పనులను పూర్తిగా విడనాడాలి. (2) గతంలో జరిగిపోయిన పాతకాలపై మనిషి సిగ్గుపడాలి. (3) ఇకపై వాటిని చేయబోమని దృఢ సంకల్పం చేసుకోవాలి. (4) పాపాల వైపునకు గొనిపోయే విషయాలు, వస్తువులతో పూర్తిగా సంబంధం త్రెంచుకోవాలి. ఒకవేళ ఆ వస్తువులు సాటి మనుషులకు సంబంధించినవైతే వారికి వారి హక్కును ఇచ్చివేయాలి. లేనిపక్షంలో వారిని క్షమాపణ కోరుకోవాలి.

పశ్చాత్తాపంతో, సిగ్గుతో కుమిలిపోవటమన్నదే ప్రధాన విషయం అని కొందరు ఉలమాలు అంటారు. ఎందుకంటే మనిషి సిగ్గుతో కుంచించుకుపోయినపుడే మళ్ళీ ఆ పాపం జోలికి పోకుండా ఉంటాడు.

"సిగ్గుతో కృంగిపోవడమే పశ్చాత్తాపం"
(ఇబ్నుమాజ, సహీహ్ హాకిమ్)

క్షమించమని తనను ప్రాధేయపడే వారంటే అల్లాహ్‌కు అమితమైన వాత్సల్యం, అందుకే "నా దాసుడు" అని మనిషిని ప్రస్తావించాడు. 'అతన్ని క్షమించాను పో' అని శుభ వర్తమానం ఇచ్చాడు.

https://teluguislam.net

"అల్లాహ్ రక్షించినంత కాలం అతను పాపాలకు దూరంగా ఉంటాడు" అనే దాని భావం ఏమంటే మనిషి అనునిత్యం పాపం చేయడు. మానవ సహజమైన బలహీనత కారణంగా ఎప్పుడో ఓసారి అతనిచేత పొరపాటు జరిగిపోతుంది. మరి కొంతకాలం గడచిన తరువాత మరో ఘోరం జరుగుతుంది. వీలయినంతవరకు అటువంటి ఘోరాలకు దూరంగా, జాగ్రత్తగా మసలుకోవటమే ధర్మ పరాయణతకు, దైవభీతికి నిదర్శనం. అలాకాకుండా అడ్డూ అయిపూ లేకుండా, నిర్భయంగా పాపాలు చేస్తూ ఏదో మొక్కుబడిగా పశ్చాత్తాపం పలికినవాడు పశ్చాత్తాపం యొక్క సారాన్ని అర్థమే చేసుకోలేదని అనుకోవాలి. పైపెచ్చు గౌరవోన్నత ప్రభువుతో అతను పరాచికాలాడు తున్నాడన్నమాట.

"నేను నా దాసుణ్ణి క్షమించివేశాను" అనేది హదీసులోని వాక్యం. దాసుడు గనక తన ప్రభువు యొక్క కారుణ్యా కడలి వద్ద నిలబడి మొరపెట్టుకుంటే అది ఉప్పొంగుతుంది. ఎన్నోసార్లు దాసుని పాపాలు క్షాళనం అయినట్లు ప్రకటించబడు తుంది. అదే ఆ పరమాత్ముని గొప్పదనం. అందుకే దాసుడు తన వల్ల జరిగే పొరబాట్లు, పొరపొచ్చాల పట్ల నిరాశకు, అసంతృప్తికి తావీయకుండా ఆయన వైపునకు మరలాలి. క్షమించటమే తన గొప్పదనం అనుకునే ప్రభువును క్షమాభిక్ష కోరాలి.

"అతను తలచింది చేసుకోవచ్చు"

ఆదం కుమారుడు బలహీనతలకు ప్రతిరూపం. తనవల్ల ఘోరం జరిగిపోయినపుడు అతను ప్రభువును వేడుకుంటే అది పరిహరించబడుతుంది. ఇంకా దాని బారినుండి అతను పరిరక్షించబడతాడు.

మొత్తమ్మీద ఈ హదీసు ద్వారా తేలిందేమిటంటే మనిషి ద్వారా పాపాలు జరుగుతాయి. జరుగుతుంటాయి. అయితే ఒకసారి పాపం జరిగిపోయిన తరువాత మలిసారి దాని వాతన పడకుండా తనను కాపాడుకుంటూ, అప్రమత్తంగా ఉండేవాడే, ఎప్పుడయినా ఏదయినా పొరపాటు జరిగిపోయినపుడు సిగ్గుతో, దైవభీతితో కంపించేవాడే, తన ప్రభువు ముందుకు వచ్చి మన్నింపును కోరేవాడే ఉత్తముడు.

https://teluguislam.net

# 9. బలవంతుడు - బలహీనుడు

అంతిమ దైవప్రవక్త ప్రవచించారని హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు - "బలవంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికంటే మేలైనవాడు. ఇంకా - అతను అల్లాహ్‌కు ప్రీతిపాత్రుడు. ఇంకా, ప్రతివానిలోనూ మంచి ఉంటుంది. మీ కొరకు ప్రయోజనకరమయిన వాటిని ఆశించండి. ఇంకా, దైవ సహాయం కోరండి, నిస్పృహకు లోనవబాకండి. మీకు ఏదయినా బాధ కలిగితే, 'ఒకవేళ నేను అలాచేసి ఉంటే ఇలా జరిగేది' అని అనబాకండి. దానికి బదులు, 'ఇది అల్లాహ్ నిర్ణయించిన విధి. ఆయన తలచినదే అయింది' అని అనండి. ఎందుకంటే, 'ఒకవేళ అలా జరిగి ఉంటే.....' (అనే ఊహాగానాలు) షైతాన్ మార్గాన్ని తెరచివేస్తాయి.' (ముస్లిం)

ఈ హదీసులో దైవప్రవక్త (సఅసం) మూడు ముఖ్య విషయాలను ప్రబోధించారు :

1. "బలవంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికన్నా మేలైనవాడు. అతను అల్లాహ్‌కు ప్రీతిపాత్రుడు. "ఇక్కడ బలం అంటే అన్ని రకాల బలం అని భావం. ఇమామ్ నవవి (రహ్మాలై) ఇలా అన్నారు: ఇక్కడ బలం అంటే మనో నిబ్బరం కలిగి ఉండి, పరలోక విషయాలలో ముందంజ వేయడం అని భావం. ఈ గుణాలున్న వ్యక్తి ధర్మపోరాటంలో అందరికంటే ముందుకుపోయి శత్రువుపై దాడి జరుపుతాడు. అందరికంటే ముందు దైవాన్వేషణలో మునుముందు ఉంటాడు, మంచిని పెంచడంలో, చెడులను నిర్మూలించడంలో, సహనం వహించటంలో వజ్ర సంకల్పుడై ఉంటాడు. దైవమార్గంలో ఎన్ని ఆపదలు ఎదురైనా ఓరిమిని ప్రదర్శిస్తాడు. నమాజ్, రోజా, జకాత్ తదితర ఆరాధనలకై, ఇంకా వాటి రక్షణకై అందరికంటే ఎక్కువగా చురుకుదనం కలిగి ఉంటాడు.

> **శారీరక బలం లేదా శరీర దారుఢ్యం కూడా దైవానుగ్రహమే. హజ్రత్ దావూద్ (అలైహి) గురించి చెబుతూ అల్లాహ్ ఇలా అన్నాడు : "అల్లాహ్ ఆయనకు బుద్ధిబలాన్ని, కండబలాన్ని సమృద్ధిగా ప్రసాదించాడు." (అల్ బఖర : 247)**

జ్ఞానశక్తి కూడా మహదానుగ్రహమే. తన అంతిమ గ్రంథంలో సర్వోన్నత ప్రభువు ఏమన్నాడో చూడండి -

> **"మీరు (వారితో) అనండి, జ్ఞానులు, అజ్ఞానులు ఇద్దరూ ఒకటేనా? కేవలం బుద్ధిమంతులే హితబోధను స్వీకరిస్తారు." (అజ్జుమర్ : 9)**

ధనబలం కూడా దైవప్రసాదితమైన వరమే. అల్లాహ్ సెలవిచ్చాడు :

https://teluguislam.net

'ఇంకా చూడండి. అల్లాహ్ మీలో కొందరికి కొందరికంటే ఉపాధి విషయంలో ఆధిక్యత ప్రసాదించాడు. అయితే ఎవరికయితే ఈ ఆధిక్యత ఇవ్వబడిందో, వారు తమ ఉపాధిని తమ బానిసల వైపునకు మళ్ళించే వారు కాదు. ఇద్దరూ ఈ ఉపాధిలో సమానమైన భాగస్థులు అయ్యేందుకు. అయితే అల్లాహ్ ఉపకారాన్నే ఒప్పుకోవటానికి వీరు తిరస్కరిస్తున్నారా?"
**(అన్ నహ్లా - 71)**

ఒక మనిషికి రెండో మనిషిపై ఆధిక్యతను ఇచ్చే, ఇంకా అతని వ్యవహారాలలో సరళతను సృష్టించే ప్రతిదీ బలంగానే పరిగణించబడుతుంది. అటువంటి బలం గనక దైవ విధేయతలో, దైవ ప్రసన్నతను పొందే పనుల్లో వినియోగమైతే అది ఎంతో ప్రశంసనీయమైనదవుతుంది. ఈమాన్ (విశ్వాసం) అనేది ఎలాంటి ప్రేరణంటే అది మనిషి శక్తి సామర్థ్యాలు సరైన మార్గంలో వ్యయమయ్యేలా చేస్తుంది. తద్వారా మేలును, శుభాన్ని కలిగిస్తుంది. అందుకనే, "బలవంతుడైన విశ్వాసి బలహీనుడైన విశ్వాసికన్నా మేలైనవాడు, అల్లాహ్‌కు ప్రీతిపాత్రుడు" అని దైవప్రవక్త (సఅసం) ప్రబోధించారు.

2. "ప్రతి వానిలోనూ మంచి ఉంది."

అంటే విశ్వాసి బలవంతుడైనా, బలహీనుడైనా అతను మంచివాడే. ఎందుకంటే అతనిలో విశ్వాసం ఉంది. విశ్వాసం స్వతహాగా బలమైనది. అన్ని రకాల శక్తులు క్షీణించినా కనీసం విశ్వాస బలమైతే ఉండనే ఉంటుంది. కనుక ఏ విశ్వాసినైనా హీనుడుగా, అల్పుడుగా పరిగణించడం సమ్మతం కాదు.

3. "మీ కొరకు మేలైన వాటిని ఆశించండి."

ఇక్కడ ఆశించడమంటే భావం ప్రయత్నించడం, దానికోసం శక్తియుక్తులన్నీ ఒడ్డటం. ప్రాపంచికంగానయినా, పారలౌకికంగానైనా శ్రేయస్కరమైన ప్రతిదాన్నీ పొందమని దైవప్రవక్త (స) ఆదేశించారు. విశ్వాసి ప్రతి మంచినీ పొందే ప్రయత్నంలో ఉంటాడు. ఎందుకంటే అతను తన ప్రభువు అనుగ్రహానికి అతీతుడు కాలేదు. అల్లాహ్ సెలవిచ్చాడు :

**"(ఓ ప్రవక్తా! అనండి) నాకే గనక అగోచరాల జ్ఞానం ఉండి ఉంటే, ప్రయోజనకరమైన వాటిని నేను పుష్కలంగా పొందేవాడిని. నాకు నష్టమే వాటిల్లేది కాదు."** **(అల్ ఆరాఫ్ - 188)**

4. "దైవ సహాయం అడగండి"

లాభదాయకమైన వాటిని పొందమని ఆదేశించిన తరువాత మహాప్రవక్త (సఅసం),

https://teluguislam.net

'లాభకరమైన వస్తువు దైవ ప్రమేయంతోనే ప్రాప్తిస్తుంద'ని కూడా చెప్పారు. అందుకే లక్ష్య సాధన కొరకు దైవ సహాయాన్నే వేడుకోవాలి. ప్రతి మేలు, ప్రతి సహాయం ఆయన అనుగ్రహంతోనే లభిస్తుంది. అల్లాహ్ తలచనంతవరకూ ఏ కారణాలూ ఏమీ చేయలేవు. ఎందుకంటే కారణాలను పర్యవసానాలను సృష్టించిన వాడు అల్లాహ్‌యే గనక. ధర్మసమ్మతమైన కోర్కెల సాధనకై విశ్వాసి ధర్మ సమ్మతమైన వనరులనే వినియోగిస్తాడు. అయితే నమ్మకం మాత్రం లాభనష్టాలను చేకూర్చగల శక్తిని కలిగిఉన్న దైవంపై పెట్టుకుంటాడు.

5. "నిస్పృహకు లోనవబాకండి"

అంటే దైవవిధేయతలో, దైవ సహాయం కోరే విషయంలో అలసత్వం, బద్ధకం పనికిరావు. దానికి బదులు దైవాన్ని ఆశతో వేడుకోవాలి. వేడుకోవటంతో పాటు 'సాధన' చేయాలి. దైవానుగ్రహాలను పొందే విషయంలో మందకొడిగా ఉండటం, విముఖతను చూపటం ఎంతకీ మంచిది కాదు. అలా చేస్తే దైవానుగ్రహాలను ఆక్షేపించినట్లవుతుంది. విశ్వసించిన వ్యక్తి దైవానుగ్రహాలను ఎన్నడూ ఆక్షేపించడు.

6. మీకేదయినా బాధ కలిగినపుడు, 'మేము గనక అలాచేసి ఉంటే ఇలా జరిగి ఉండేది' అని అనటం ఎంతమాత్రం భావ్యం కాదు.

విశ్వాసి సమస్త ప్రయత్నాలను చేసిన తరువాత కూడా అనుకున్నది నెరవేరకపోతే, దాని నష్టం నుండి బయటపడకపోతే, అప్పుడు దైవ నిర్ణయానికి రాజీపడిపోవాలి. దైవచిత్తం కాని దాన్ని సాధించలేనని తెలుసుకోవాలి. ఫలానా కారణంగా ఈ పని కాలేదని నిందమోపటం, లేదా ఒకవేళ ఆ చర్య గైకొని ఉంటే అది నెరవేరేది అని కాకి లెక్కలు వేయటం మోమిన్ (విశ్వాసి) స్థాయికి ఎంతమాత్రం తగదు.

7. ఈ హదీసులో "ఒకవేళ" అనే పదం ఉపయోగించరాదని చెప్పబడింది. అయితే కొన్ని ఇతర హదీసుల్లో ఈ "పదం" వాడినట్లు కూడా ఉంది. అంతిమ హజ్ సందర్భంగా మహాప్రవక్త (సఅసం), 'ఒకవేళ ఇప్పుడు నా దృష్టికి వచ్చిన విషయం ముందే తెలిసి ఉంటే ఖుర్బానీ పశువుల్ని తెచ్చేవాణ్ణి కాను' అని అన్నారు. అలాగే దివ్య ఖుర్‌ఆన్‌లో,

> "ఒకవేళ నాకే గనక అగోచర విషయజ్ఞానం ఉంటే ప్రయోజనకరమైన వాటినెన్నో పొందేవాడిని, నాకు కష్టనష్టాలే రాకుండా ఉండేవి (అని ఓ ప్రవక్తా వారితో చెప్పివేయండి)" అని అనబడింది.

దీని భావం ఏమంటే భవిష్యత్తులో ఏదైనా మంచి పని చేయాలన్న సంకల్పం ఉంటే, ఉదాహరణకు, 'ఒకవేళ వచ్చే సంవత్సరం దాకా నేను బ్రతికివుంటే హజ్ చేస్తాను'

https://teluguislam.net

అనవచ్చు. అందులో తప్పులేదు. లేదా గత జీవితంలో దైవవిధేయత విషయంలో జరిగిన లోటుపాట్లను తల్చుకుని సిగ్గుపడుతూ, 'ఒకవేళ నేను నమాజ్‌ను క్రమం తప్పకుండా చేసివుంటే ఎంత బాగుండేది!' అని అనవచ్చు. ఇంకా, అల్లాహ్‌కు అయిష్టం కాని రీతిలో ఏదన్నా వాక్యం పలికినా దోషం లేదు. ఉదాహరణకు హిజ్రత్ సందర్భంగా హజ్రత్ అబూబకర్ (రజిఅన్) సూర్ గుహలో, ఓ దైవప్రవక్తా (స)! బహు దైవారాధకులలో ఎవరయినా తల ఎత్తాడంటే చాలు, మిమ్మల్ని చూసేస్తాడు" అని అన్నారు.

అయితే గతంలో జరిగిపోయిన నష్టాన్ని తలచుకుని 'అరె అలా చేసేబదులు ఇలా చేసి ఉంటే లాభదాయకంగా ఉండేదేమో!' అని మాత్రం అనకూడదు. అలా అనటం వల్ల దైవంపై నమ్మకం సడలిపోయిన భావం వ్యక్తమవుతుంది. ఉదాహరణకు, "నేను ఫలానా వస్తువు తిని ఉంటే స్వస్థత చేకూరేదేమో" అని అనడం విశ్వాస రాహిత్యానికి ఆనవాలుగా ఉంటుంది.

ఈ హదీసులో ఎన్నో ముఖ్యమైన విషయాలు చెప్పబడ్డాయి. మొదటి విషయమేమంటే విశ్వాసులలో ఒకటికి రెండు కోవలకు చెందిన వారుంటారు. అయితే వారిలోని బలవంతుడంటే అల్లాహ్‌కు ఇష్టం. ఎందుకంటే దైవాజ్ఞాపాలనలో అతను తన బలాన్ని శక్తిని ధారపోస్తాడు. బలహీనుడైన విశ్వాసికన్నా సక్రమంగా ఎక్కువగా దైవాన్ని సేవిస్తాడు. అందుకే బలాన్ని, శక్తిని పొందడానికి ప్రయత్నించమని దైవప్రవక్త నొక్కిపలికారు. ఎందుకంటే ప్రతిదీ ప్రయత్నం ద్వారానే హస్తగతమవుతుంది. అలసత్వం సోమరితనాలవల్ల ఏదీ ప్రాప్తించదు. సోమరితనం, బద్ధకాలను దూరం చేసి ధర్మసమ్మతమయిన ఒనరులను వినియోగించుకోవాలని చెప్పబడింది.

అయితే ఒక విశ్వాసి ప్రత్యేకత ఏమంటే అతని మనసు ఎంతసేపటికీ భౌతిక వనరులపైకాక, దైవ ప్రోద్బలంపై ఆధారపడి ఉంటుంది. మనిషి ఎన్ని ఒనరుల్ని సమకూర్చుకున్నా, ఎన్ని జాగ్రత్తలు గైకొన్నా నిర్ణీత లక్ష్యం నెరవేరి తీరుతుందన్న నమ్మకం లేదు. మనిషి విఫలుడవటం సంభవమే. ఒక్కోసారి అతను నిర్ణయించుకున్న లక్ష్యాన్ని అందుకోకపోవటంలోనే అతని శ్రేయస్సు ఇమిడి ఉండవచ్చు. ఎందులో ఏం మేలుందో దైవానికే తెలుసు. ఇటువంటి పరిస్థితుల్లో విశ్వాసి నిరాశకు గురికాకుండా తన ప్రభువేచ్ఛతో రాజీపడిపోతాడు. విధిని విదిలించే, ఒనరులను తప్పుపట్టే బదులు 'దైవచిత్తం ఇలా ఉంది కాబోలు. కనుక ఇది నాకు ఆమోదమే' అని అంటాడు. అలాగే అతని అంతర్యం ఈర్ష్య, అసూయ, కపటత్వం, ద్వేషం వంటి నకారాత్మక భావనల నుడి, తుచ్ఛమైన భావాల నుండి సురక్షితంగా ఉంటుంది. ఇంకా అతని అంతర్యంపై దైవ కారుణ్యం ప్రశాంతత అవతరిస్తాయి.

https://teluguislam.net

# 10. రెండు ఉత్తమ వచనాలు

హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు : దైవప్రవక్త (సఅసం) ప్రవచించారు: "రెండు వచనాలున్నాయి. అవి కరుణామయుని (అల్లాహ్)కి అత్యంత ప్రీతికరమైనవి. అవి నోటికి చాలా తేలికైనవే, (కాని) త్రాసులో చాలా బరువుగా ఉంటాయి. అవే 'సుబ్‌హానల్లాహి వ బిహమ్దీ', 'సుబ్‌హా నల్లాహిల్ అజీమ్.' (బుఖారి)

1. 'సుబ్‌హానల్లాహి వ బిహమ్దీ' అంటే అల్లాహ్ పవిత్రతను ఆయన స్తోత్రంతో సహా కొనియాడుతున్నాను అని అర్థం. 'సుబ్‌హానల్లాహిల్ అజీమ్' అంటే మహోన్నతుడైన అల్లాహ్ పవిత్రతను వర్ణిస్తున్నాను అని భావం.

అల్లాహ్ పవిత్రత అనేది ఆయన సుగుణాలకు ప్రతీక, సకల లోపాలకు, బలహీనతలకు ఆయన అతీతుడు అనే భావం ఇందులో స్ఫురిస్తుంది. బహుదైవోపాసకులు ఏ బలహీనతలను, మరే భాగస్వామ్యాలను ఆయనకు ఆపాదిస్తారో వాటన్నింటికీ ఆయన అతీతుడు.

విశ్వాసి ఘటించే శ్రద్ధాంజలి అల్లాహ్ ఔన్నత్యానికి, ఆయన స్థాయికి తగిన విధంగా ఉంటుంది. యదార్థానికి ఆయన అన్ని రకాల దోషాలకు దూరంగా ఉన్నవాడు.

హదీసులో పేర్కొనబడిన రెండు సద్వచనాలు ఎంతో సంక్షిప్తమైనవి. సులభమైనవి. సృష్టిపై దృష్టిని సారించిన తరువాత, ఈ సువిశాల విశ్వ వ్యవస్థలోని నిర్వహణా యంత్రాంగం, అందలి పరమార్థాలపై యోచించిన తరువాత విశ్వాసి నోట అప్రయత్నంగా వెలువడే ఈ రెండు వచనాలు అనంత విశ్వ వ్యవస్థలోని అన్నింటికన్నా గొప్ప సత్యంగా, నిజమైన దైవస్తోత్రంగా రూపొందుతాయి.

ప్రభువు ఏ విధంగా తన వ్యక్తిత్వంలో, గుణగణాలలో పవిత్రుడో అదేవిధంగా సృష్టి ఏర్పాట్లలోనూ సాటిలేనివాడు. ఆయన మానవులను ఆలోచించమని కోరాడు :

> **"ఒక దానిపై ఒకటి సప్తాకాశాలను నిర్మించిన వాడు ఆయనే. మీరు కరుణామయుని సృష్టిలో ఎటువంటి సంబంధ రాహిత్యాన్ని కనలేరు. మరి మీ దృష్టిని సారించండి - మీ కేదయినా ఆటంకం కానవస్తోందా? మాటిమాటికీ దృష్టిని సారించండి, మీ దృష్టి అలసిసొలసి, ఓడిపోయి తిరిగివస్తుంది." (అల్‌ముల్క్ : 3,4)**

2. "కరుణామయునికి అత్యంత ప్రీతికరమైనవి" : దీని గురించి హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా అన్నారు : కరుణామయుడు అన్న పదాన్ని ఇక్కడ ప్రధానంగా పేర్కొనడం జరిగిందంటే ఈ హదీసులో అల్లాహ్ యొక్క సువిశాలమైన కారుణ్యాన్ని సుబోధకం చేయడమే దీని పరమ ఉద్దేశ్యం అయి ఉంటుంది. ఆయన కరుణ ఎంత

https://teluguislam.net

విస్తృతమైనదంటే, తన దాసుల మామూలు ఆచరణకు కూడా ఆయన పుష్కలమైన ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

అల్లాహ్‌కు ఈ వచనాలు అత్యంత ప్రీతికరం ఎందుకంటే, వీటి ద్వారా దాసుడు తన ప్రభువు గొప్పతనాన్ని, ఆయన ఏకత్వాన్ని, ఆయన అద్భుతాలను చాటుతాడు. బహుదైవోపాసకులు, దైవధిక్కారుల వైఖరి ఇందుకు భిన్నంగా ఉంటుంది. వారు ఒకవేళ దైవాన్ని విశ్వసిస్తున్నప్పటికీ ఆయనకు సహవర్తులుగా ఇతరుల్ని నిలబెట్టడం ద్వారా ఆయన గుణగణాలని నిర్లక్ష్యంచేసిన వారవుతారు. ఒక్కోసారి వారు దేవుని శక్తి యుక్తుల్ని సయితం అనుమానించే నిందించే విధంగా ప్రవర్తిస్తారు. అయితే నిజమైన విశ్వాసి, నికార్సయిన ఏకేశ్వరోపాసి చేసే స్తోత్రం, జిక్ర్ (స్మరణ) ఎంతైనా ఆదరణీయమైనవి.

దివ్య ఖుర్‌ఆన్‌లో ఎన్నో సూరాల ఆరంభం అల్లాహ్ పవిత్రతను కొనియాడటంతోనే జరిగింది. 'హదీద్' "హష్ర్", "సఫ్" సూరాలు ఇలా ప్రారంభమయ్యాయి -

> **"సబ్బహ లిల్లాహి మాఫిస్సమావాతి వ మాఫిల్ అర్జి వహువల్ అజీజుల్ హకీమ్."**
>
> అనువాదం : **"భూమ్యాకాశాలలో ఉన్న ప్రతి వస్తువూ అల్లాహ్‌ను స్తుతించాయి. ఆయన అధిపతి, వివేకవంతుడు."**

ఇదేవిధంగా, "జుమా", "తగాబున్" సూరాలు కూడా అల్లాహ్ పవిత్ర స్మరణతోనే మొదలయినాయి.

3. "నోటికి చాలా తేలికైనవి" అంటే ఈ వచనాలను వల్లించడం అత్యంత సులువు. అరబీ భాషలోని కొన్ని పదాలను పలకటం సులభం కాదు. పైగా ఆ పదాలను చాలా జాగ్రత్తగా పలకవలసి ఉంటుంది. ఖిరాత్ కళా నిపుణులు అరబీ భాషలోని పదాలను రెండు రకాలుగా విభజించారు :

(అ) షదీద్ : అంటే గట్టిగా (నొక్కి) పలకబడేవి.

(ఆ) రఖ్వ : అంటే తేలిగ్గా ఉచ్చరించబడేవి.

అయితే హదీసులోని రెండు వచనాల - సుబ్‌హానల్లాహి వ బిహమ్ది, సుబ్‌హానల్లాహిల్ అజీమ్ - లో 'బ' అనే అక్షరం తప్ప మిగిలిన అక్షరాలన్నీ "రఖ్వ" లోకే వస్తాయి. ఈ విధంగా, ఈ రెండు వచనాలు నోటికి చాలా తేలికైనవి. మహాప్రవక్త చెప్పింది సత్యమని నిరూపణయింది.

4. "త్రాసులో చాలా బరువైనవి" అంటే తీర్పుదినం నాడు మనిషి కర్మలు తూయబడి నపుడు సత్కర్మల తక్కెడలో అవి బరువును పెంచుతాయి, నోటి ఉచ్చరణకు ఆ

https://teluguislam.net

వచనాలు తేలికైనప్పటికీ ఫలితం రీత్యా అత్యంత బరువైనవి. ఆ బరువే పరలోకంలో పనికొచ్చేది.

నోటిద్వారా జారిన మాటలు కూడా త్రాసులో తూయబడతాయన్న విషయం గత కాలాల్లో ప్రజలకు అర్థం కాకపోయిందేమో గాని ఉష్ణోగ్రతను, శీతోష్ణ స్థితిని సయితం కొలిచే నేటి ఆధునిక మానవుడికి ఇది వింతేమీ కాదు. ఇన్షా అల్లాహ్ తీర్పుదినం నాడు మనిషి కర్మలు, విశ్వాస పరిమాణం తప్పకుండా తూయబడతాయి.

హదీసులోని శుభప్రదమైన ఆ రెండు వచనాలు పఠిస్తూ ఉండాలని పలుచోట్ల చెప్పబడింది. విధ్యుక్త ధర్మాల (ఫరాయిజ్)ను నిర్వర్తించటం మనసుకు కాస్త శ్రమగా తోచవచ్చునేమో గాని ఈ వచనాలను వల్లించడం కష్టతరమేమీ కాదు. అందుకే వీటిని పలుకుతూ ఉండటంలో పిసినారితనం కనబరచరాదు.

ఈ రెండు వచనాలు ఇంతటి మహత్ పూర్వకంగా ఎలా రూపొందాయని ఆలోచిస్తే, పఠిత ఈ రెండు వచనాలను పఠిస్తూ పఠిస్తూ వాటి అర్థంపై యోచించటం మొదలెడతాడని, తద్వారా అతని హృదయాంతరాళంలో నిజస్వామి పట్ల గౌరవం, ప్రేమ ఏర్పడతాయని తెలుస్తోంది. తద్వారా అతని హృదయం నుంచి ఎన్నో రుగ్మతలు దూరం అవుతాయి. నిర్మలమైన మనసుతో ఇవ్వడతను ప్రభువుకు సన్నిహితుడవుతాడు. ప్రభువుకు సన్నిహితుడైన దాసుని స్థానం గురించి ఇక చెప్పవలసిందేముంది!

"ఈ వచనాలు త్రాసులో బరువు కలిగి ఉంటాయి" అంటే భావం విశ్వాసి ఈ రెండు వచనాలను పలుకుతూనే అపరాధాలు చేస్తూ ఉండటం పరిపాటి. అయితే హదీసులోని రెండు వచనాలు ఎంతటి మహత్తు గలవంటే ఎన్నో దుష్కర్మల కంటే అవి ఎక్కువ బరువు కల్గి ఉంటాయి. అందుచేత ఈ వచనాలను పలికే వారల్లా ఘోర అపరాధాలు చేస్తూ ఉండమని భావం ఎంతమాత్రం కాదు. సాధారణంగా 'జిక్ర్' (దైవనామ స్మరణ) లో గడిపే మనిషి దుష్కర్మలకు దూరంగానే ఉంటాడు. మానవ సహజమైన దౌర్బల్యం మూలంగా ఎప్పుడో ఒకప్పుడు అతని చేత తప్పు జరగవచ్చుగాని సతతం జరగదు. అదీగాక ఈ పవిత్ర వచనాలు అతని మనసులో భయభక్తులను సృజిస్తాయి. అటువంటి వ్యక్తికి దైవం తరఫున కూడా రక్షణ లభిస్తుంది. సహాయం లభిస్తుంది. కనుక అతను ధర్మ సమ్మతమయిన కోర్కెలను ధర్మ సమ్మతమయిన విధానాల ద్వారానే తీర్చుకుంటాడు. నెరవేరని మరెన్నో కోర్కెలను మనసులోనే అణచుకుంటాడు. త్యాగ భావం అలవరచుకుంటాడు.

ఘోర అపరాధాలకు ఒడిగట్టడం విశ్వాస బలహీనతకు తార్కాణం. విశ్వాసంలో

https://teluguislam.net

బలహీనుడుగా ఉన్నవాడే పెద్ద పాపాలకు పాల్పడతాడని అహ్లెసున్నత్ వర్గం భావిస్తుంది. ఎన్ని అపరాధాలు చేస్తే అంతే అతని ఈమాన్ (విశ్వాసం) క్షీణిస్తూ పోతుంది. అతన్నే "ఫాసిఖ్" "ఫాజిర్" (అపరాధి, అపచారి) అనటం జరుగుతుంది. అయితే అతను గనక తనను విశ్వాసిగా చెప్పుకునేంతవరకు, ధర్మ భ్రష్టతకు పాల్పడకుండా, షిర్క్ (బహుదైవారాధన)కు ఒడిగట్టకుండా ఉన్నంతవరకూ అతన్ని ముస్లింలలో ఒకడుగానే పరిగణించటం జరుగుతుంది. అతని వ్యవహారం పరలోకంలో అల్లాహ్‌కే వదలివేయబడుతుంది. అయితే ఏకేశ్వరోపాసకుడయిన ప్రతి వ్యక్తినీ నరకం నుండి విముక్తి కలిగిస్తానని ఆయన అంటున్నాడు. అందుకే అల్లాహ్ తనగ్రంథంలో శుభవార్తను, హెచ్చరికను ఒకేచోట ప్రస్తావించాడు:

> **"నేనే ఎక్కువగా మన్నించేవాడిని మరియు కరుణించేవాడినని, అయితే నా శిక్ష కూడా అత్యంత వ్యథాభరితమైన శిక్షేనని (ఓ ప్రవక్తా!) నా దాసులకు చెప్పివేయండి."** **(అల్ హిజ్ర్ : 49, 50)**

దాసులు తన వైపునకు మరలి రావాలని తనను అధికంగా జ్ఞాపకం చేయాలని, తన గొప్పతనాన్ని గురించి అదే పనిగా చెప్పుకోవాలని, తనను క్షమాశీలునిగా, స్వర్గ యజమానిగా చెప్పుకోవటంలో నిమగ్నులవ్వాలని, తనంటే భయపడుతూ ఉండాలని, పాపాలకు దూరంగా ఉండాలని, క్షమాభిక్ష పెట్టడంలో తాను ఎంత ఉదార స్వభావుడో నేరస్థులను పట్టుకోవటంలో కూడా అంతే కఠినుడని, కనుక తన పట్టు పట్ల తరచూ భయపడుతూ ఉండాలని అల్లాహ్ పై రెండు ఆయత్‌లలో దాసులకు చెబుతున్నాడు.

దైవ కారుణ్యంపై ఆశలు పెంచుకోవటం, ఆయన ఆగ్రహం పట్ల భయపడుతూ ఉండటం విశ్వాసుల ముఖ్య లక్షణం. దైవప్రవక్తలు హజ్రత్ జకరియ్యా, హజ్రత్ యహ్యా (అలైహిముస్సలాం)ల గురించి ఖుర్ఆన్‌లో సెలవీయబడింది :

> **"వారు సత్కార్యాల వైపునకు పరుగెత్తేవారు. మమ్మల్ని భయంతో ప్రార్థించేవారు, ఇంకా వారు మా ముందు వంగి ఉండేవారు."**
>
> **(అంబియా : 90)**

పై ఆయత్ ద్వారా తెలిసేదేమంటే విశ్వాసి అత్యంత వినయ వినమ్రతలతో దైవనామాన్ని స్మరిస్తూ మంచి పనులు చేస్తూ కూడా ఆయన పట్టు పట్ల భయంతో కంపిస్తూ ఉంటాడు. దైవ నామస్మరణ, దైవారాధనలు అతన్ని ఎంతటి నిష్ఠాపరునిగా మలుస్తాయంటే చెడు పనులంటేనే అతనిలో అసహ్యం జనిస్తుంది.

https://teluguislam.net

# 11. మంచిని ప్రోత్సహించడం - చెడు వైపునకు పురికొల్పడం

ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారని హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు : "సన్మార్గం వైపునకు ఆహ్వానించే వానికి అతని ద్వారా సన్మార్గం పొందిన వారికి లభించినంత పుణ్యఫలం లభిస్తుంది. (అయితే) వారి ప్రతిఫలంలో మటుకు ఎటువంటి కొరతా రాదు. (ఇకపోతే) మార్గవిహీనత వైపునకు పిలిచే వ్యక్తికి, అతని ద్వారా మార్గభ్రష్టులైన వారికి లభించినంత దుష్ఫలం లభిస్తుంది. కాగా, ఆ మార్గభ్రష్టుల దుష్కర్మలు తగ్గటమూ జరగదు." (ముస్లిం)

ఈ పవిత్ర హదీసు ద్వారా రూఢీ అయ్యేదేమిటంటే సౌశీల్యం దైవ మార్గదర్శకత్వాల ప్రాతిపదికలపై అల్లాహ్ వైపునకు, సత్కార్యాల వైపునకు సందేశం ఇచ్చేవాడు ఎంతో ఆదరణీయుడు. అతనికి లభించే ప్రతిఫలం అపారం. దాన్ని అతను ఊహించనైనా లేడు. అల్లాహ్ శుభవార్త ఇచ్చాడు :

> "ఎవరయితే అల్లాహ్ వైపునకు (ప్రజలను) పిలిచాడో, సత్కార్యాలు చేశాడో, ఇంకా, నేను ముస్లింని అని అన్నాడో అతనిమాట కంటే మంచి మాట మరెవరిది కాగలదు?" (హామ్ మీమ్ సజ్దా : 33)

దైవం వైపునకు ఆహ్వానించే వాని మాటకు అంతటి ఉన్నత స్థానం ఎందుకివ్వ బడిందంటే అతని మాట ద్వారా ఎంతోమంది దైవ మార్గదర్శకత్వం పొందుతారు. వారందరికీ ఆ మహాభాగ్యం లభించటానికి కారకుడైనందుకు గాను వారు సంపాదించినంత పుణ్యం ఇతనికి కూడా ప్రాప్తిస్తుంది. సత్య సందేశానికి ఉన్న ప్రాధాన్యత ఎంతటిదో ఈ ఒక్క హదీసు ద్వారా అంచనా వేయవచ్చు.

పోతే; మార్గ విహీనత, మార్గభ్రష్టతల వైపునకు ప్రజలను పిలవటం మహా పాతకం. అదెంత ఘోరమయిన అపరాధం అంటే అతని ద్వారా ఎంతమంది మార్గభ్రష్టులయ్యారో, అంతమందీ ఎన్ని పాపాలు చేశారో అన్ని పాపాల భారం అతనిపై కూడా పడుతుంది. మహాప్రవక్త (సఅసం) ఉపదేశించినట్లు హజ్రత్ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజిఅన్) చెప్పారు : "ఏ ప్రాణీ అన్యాయంగా వధించబడినా దాని రక్తపు భారం ఆదం యొక్క మొదటి కుమారునిపై పడుతుంది. ఎందుకంటే మొదటి హత్య చేసిన వాడు అతనే." (బుఖారి, ముస్లిం, తిర్మిజి)

https://teluguislam.net

ఆదం కుమారుడైన ఖాబైల్, మరో కుమారుడైన హాబైల్‌ని హతమార్చాడు. లోకంలో అది మొట్టమొదటి హత్య. ప్రళయదినం వరకు ఎన్ని హత్యలు జరిగినా వాటి పాపం ఖాబైల్ ఖాతాలోకి వెళుతూనే ఉంటుంది. ఎందుకంటే అతనే హత్యల ద్వారం తెరిచాడు. ఈ విధంగానే చెడుల వైపునకు ప్రజలను పురికొల్పేవాడు కూడా ప్రళయం వరకు అతని అనుయాయులు చేసిన పాపభారాన్ని మోస్తూ ఉంటాడు. మరోవైపు ఆ చెడులు చేసే వారి దుష్ఫలం కూడా ఏమాత్రం తగ్గదు.

"ఎవరయితే సన్మార్గం వైపునకు ఆహ్వానిస్తారో..."

"ఎవరయితే మార్గ విహీనత వైపునకు పిలుస్తారో...."

అన్ని రకాల పిలుపు లేక ఆహ్వానం ఇందులో ఇమిడిఉంది. అది మూజువాణీగా కావచ్చు, సైగ ద్వారా కావచ్చు, ఆచరణ ద్వారా కావచ్చు, వ్రాతపూర్వకంగా కూడా కావచ్చు. ఇక్కడ సన్మార్గం అంటే దైవాదేశాలు, దైవప్రవక్త (సఅసం) పవిత్ర పలుకులకు సంబంధించిన విషయం. అల్లాహ్ సెలవిచ్చాడు :

> "మీరంతా ఇక్కడి నుండి దిగిపోండి" అని మేము తెలిపాము. ఇకపైన నా తరపు నుండి ఏదైనా ఉపదేశం మీ వద్దకు వచ్చినప్పుడు, ఎవరయితే నా ఈ ఉపదేశాన్ని అనుసరిస్తారో, వారికి ఏ విధమైన భయం కాని విచారం గాని కలిగే అవకాశం ఉండదు." **(అల్ బఖర : 38)**

ఇక్కడ 'నా తరపు ఉపదేశం' అంటే ఆకాశ గ్రంథాలు ప్రవక్తల ప్రబోధనలని భావం. దైవం తరపున అవతరించిన ఆదేశాలను పాటించటం, దైవప్రవక్తకు విధేయత చూపటం కూడా సన్మార్గానుసరణగానే భావించబడుతుంది.

దివ్య ఖుర్‌ఆన్‌లో మరోచోట ఇలాసెలవీయబడింది :

> "మీ ప్రభువు తరపు నుండి మీపై ఏదైతే అవతరింపజేయబడిందో దాన్నే అనుసరించండి. అది తప్ప ఇతర సంరక్షకులను అనుసరించబాకండి. కాని మీరైతే హితం గ్రహించేది చాలా తక్కువ." **(అల్ ఆరాఫ్ : 3)**

మరోచోట చెప్పబడింది :

> "నగరం మూల నుండి ఒక మనిషి పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పాడు, "నా జాతి ప్రజలారా! ప్రవక్తల్ని అనుసరించండి. మీ నుండి ప్రతిఫలాన్ని అపేక్షించని వారిని సరైన మార్గంలో ఉన్న వారిని (అనుసరించండి)" అని. **(యాసీన్ : 20, 21)**

https://teluguislam.net

ఏ గ్రంథమైతే దైవోపదేశాలకు, దైవప్రవక్త సంప్రదాయానికి అనుగుణంగా లేదో అది మార్గ విహీనత వైపునకు గొనిపోయే గ్రంథంగానే పరిగణించబడుతుంది. దైవప్రవక్త (స) ప్రవచించారు - 'మా ఈ (ధర్మ) వ్యవహారంలో ఎవరయినా లేనిపోని విషయాన్ని కల్పిస్తే అది రద్దు చేయబడుతుంది. (బుఖారి, ముస్లిం). మరో సందర్భంలో ఇలా పలికారు : "మా పద్ధతిలో లేనిదాన్ని ఎవరయినా చేస్తే అది స్వీకారయోగ్యం కానేరదు." (ముస్లిం)

"వారి పుణ్యఫలంలో ఏ కొరతా రాదు" అంటే సజ్జనుల లెక్కలోని సత్కర్మలను తీసి, వారిని సన్మార్గంలోకి తెచ్చిన వ్యక్తికి ఇవ్వటం జరగదు అనిభావం. అల్లాహ్ కారుణ్యం అనంతమైనది. అది ప్రతి ఒక్కరికీ లభిస్తుంది. విరివిగా లభిస్తుంది. ఈ వాక్యంలో అటు సద్వర్తనులకు, ఇటు సన్మార్గం వైపునకు ఆహ్వానించే వారికి - ఇద్దరికీ శుభవర్తమానం ఉంది.

"వారి పాపాల భారంలో ఎటువంటి తగ్గింపూ జరగదు" : చెడులకు నాంది పలికి, అవి వెర్రితలలు వేయటానికి కారకుడైనందున ఆ చెడులను అనుసరించే వారందరికీ లభించేంత పాప భారం ఈ చెడుల పితామహుడికి కూడా లభిస్తుంది. ఈ వాక్యంలో దుర్వర్తనులకు, దుర్వర్తనం వైపునకు పిలిచిన వారికి కూడా గట్టి హెచ్చరిక ఉంది.

ప్రజలకు మార్గ దర్శకత్వం వహించటంలో ఉన్నత సంప్రదాయాలను నెలకొల్పటం, సత్క్రియలకై పురికొల్పటం కూడా చేరి ఉంది. జరీర్ బిన్ అబ్దుల్లా గారి హదీసు ద్వారా ఈ విషయం మరింత స్పష్టమవుతుంది. ఆయన ప్రకారం ప్రవక్త మహనీయులు (సఅసం) సన్నిధికి కొంతమంది పల్లెవాసులు వచ్చారు. వారు ఆపదలో ఉన్నారు. ఆయన (స) వారి దురవస్థను, అక్కరలను పసిగట్టి దానధర్మాల ద్వారా వారిని ఆదుకోవలసిందిగా ప్రజలకు పురికొల్పారు. అయితే ప్రజలు దానధర్మాలు చేయటంలో నిర్లిప్తత వహించారు. ఆయన (సఅసం) ముఖారవిందంపై విచార ఛాయలు ప్రస్ఫుటమయ్యాయి. అంతలో ఒక అన్సారి వెండి నాణాల సంచి తెచ్చారు. మరొకరు కూడా అదే పని చేశారు. ఆపై ఒకరి తరువాత ఒకరు తెచ్చి దానం చేయసాగారు. ప్రవక్త గారి మోము ఆనందంతో విచ్చుకునేవరకూ వారు తెస్తూనే ఉన్నారు. అప్పుడు ఆయన (సఅసం) ఉపదేశించారు : "ఎవరయినా ఇస్లాంలో ఉత్తమ సంప్రదాయాన్ని నెలకొల్పితే తదనంతరం కూడా అది కొనసాగితే, దాన్ని పాటించే వారందరికీ లభించినంత పుణ్యఫలం, దాన్ని నెలకొల్పిన ఒక్క వ్యక్తికీ లభిస్తుంది. (అలా అని) అటు, దాన్ని అనుసరించే వారి ప్రతిఫలంలో కోత విధించటం జరగదు. (అదేవిధంగా) ఇస్లాంలో ఎవరయినా దుస్సంప్రదాయాన్ని ప్రవేశపెడితే,

https://teluguislam.net

తరువాత వారు దాన్ని పాటిస్తే, ఆ పాటించే వారందరిపై పడే పాపభారం దాని మూల స్థాపకుడిపై కూడా పడుతుంది. అటు ఆ దుర్మార్గగాముల పాపంలో తగ్గింపు కూడా ఉండదు. (ముస్లిం)

ఉన్నత సంప్రదాయాలను, ఉత్తమ అలవాట్లను నెలకొల్పటమంటే భావం ముస్లిములు షరీఅత్ ఆదేశాలను పాటించడంలో మార్గం సుగమం అయ్యే పనులు చేయడమని. అదేవిధంగా ఖుర్ఆన్, హదీసులను ఆయా ప్రజల మాతృ భాషలోకి అనువదించి, ధర్మావలంబనలో సాయపడటం కూడా ఈ కోవలోకే వస్తుంది.

ఈ హదీసులో పేర్కొనబడిన అన్సారీ సహచరుడు అందరి కంటే ముందు వెండి నాణాల సంచి తెచ్చి సమర్పించుకోవటం వల్ల ఇతర ముస్లిముల్లోని సేవాభావం జాగృత మయ్యింది. వారంతా దాన ధర్మాలకు పూనుకుని ఆ సత్కార్యంలో తలో చేయి వేశారు. దానికి గాను వారందరికీ లభించే సత్ఫలితం ఆ మొదటి అన్సారీకి లభిస్తుంది.

ఎందుచేతనంటే సత్కార్యం కోసం ఆయన వేసిన ముందడుగు ఇతర సహచరులకు ప్రేరణ నిచ్చింది. స్ఫూర్తి నిచ్చింది. ఇదేవిధంగా ఎవరయితే హితకార్యాల కోసం ప్రేరణ, ప్రోత్సాహాల వాతావరణం సృష్టిస్తారో వారి స్థానం గొప్పది. అయితే అటువంటి వారందరి ధ్యేయం దైవ ప్రసన్నతను చూరగొనడం అయి ఉండాలి. దాంతోపాటు చేసే పని కూడా ఉత్తమ పద్ధతిలోనే చేయాలి.

ఈ హదీసు ద్వారా మంచికై పురికొల్పే పని ఎంత మహత్పూర్వకమో, ఎంత ప్రాధాన్యతతో కూడుకున్నదో విశదమవుతోంది. అలాగే చెడులను సర్వసామాన్యం చేయడం ఎంత ఘోరపాతకమో స్పష్టమవుతోంది.

https://teluguislam.net

# 12. మానవసేవ

హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు : మహాప్రవక్త (సఅసం) ఉపదేశించారు- "ప్రళయదినం నాడు అల్లాహ్ అవశ్యంగా అడుగుతాడు : 'ఓ ఆదం కుమారా! నేను వ్యాధిగ్రస్తుడినయ్యాను. నువ్వు నన్ను పరామర్శించలేదు' అతనంటాడు: 'ఓ నా ప్రభూ! నేను నిన్ను పరామర్శించడమేమిటి? నువ్వైతే సమస్త లోకాల పాలకుడవు?' అల్లాహ్ అంటాడు : 'నా ఫలానా దాసుడు వ్యాధిగ్రస్తుడైన సంగతి నీకు తెలీదా? కాని నువ్వతన్ని పరామర్శించలేదు. నువ్వతన్ని పరామర్శించి ఉంటే నన్నక్కడ పొందేవాడివి కాదా?'

'ఓ ఆదం పుత్రుడా! నేను నిన్ను అన్నం అడిగాను. కాని నువ్వు నాకు అన్నం పెట్టలేదు.' అతనంటాడు : 'నా దేవా! నేన్నీకు ఎలా అన్నం పెట్టగలను? నువ్వైతే నిఖిల జగతికి పరిపోషకుడివి.' అల్లాహ్ అంటాడు: 'నా ఫలానా దాసుడు భోజనం కోసం నిన్ను మొరపెట్టుకున్న సంగతి నీకు తెలీదా? అయితే నువ్వతనికి భోంచేయించలేదు. ఒకవేళ నువ్వతనికి అన్నం పెట్టివుంటే దాని (ఫలాన్ని) నా దగ్గర పొందేవాడివి కాదా?'

'ఓ ఆదం కుమారుడా! నేన్నిన్ను మంచినీళ్ళడిగాను. నువ్వు నాకు త్రాపలేదు.' అతనంటాడు : 'ఓ నా స్వామీ! నేన్నీకు మంచినీళ్ళు ఎలా త్రాపగలను? నువ్వు సకల లోకాల స్వామివి కదా!' అల్లాహ్ అంటాడు: 'నా ఫలానా దాసుడు నిన్ను నీరు కోసం వేడుకున్నాడు. కాని నువ్వతనికి నీరు త్రాపలేదు. ఒకవేళ నువ్వతనికి నీరు త్రాగించి ఉంటే దాన్ని (బహుమతిని) నా వద్ద పొందేవాడివి." (ముస్లిం)

ఈ హదీసులో మనిషి స్థానం ఎంత ముఖ్యమైనదో వివరించబడింది. ఆపదలో ఉన్న మనిషిని ఆదుకోవడంలో దైవ ప్రసన్నత ఇమిడి ఉందని సోదాహరణగా విశదీకరించటం జరిగింది. ఆపదలో ఒండొకరిని ఆదుకోవడం తప్పనిసరి. అందులో ఏ మాత్రం లోటు కనబరచినా ప్రళయదినం నాడు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. నిర్దయుడైన మనిషిని అల్లాహ్ "ఓ ఆదం పుత్రుడా!" అని సంబోధించాడు. దివ్య ఖుర్‌ఆన్‌లోనూ సంబోధనా తీరు ఇలాగే ఉంది. అందులోనూ హెచ్చరించవలసి వచ్చినప్పుడు "యా బనీ ఆదమ్" అని వాక్యం మొదలవుతుంది. ఇదిగో చూడండి:

> "ఓ ఆదం సంతానమా! మీరు షైతాన్‌కు దాస్యం చేయరాదని నేను మీ నుండి ప్రమాణం తీసుకోలేదా? నిశ్చయంగా వాడు మీ బహిరంగ శత్రువు." (యాసీన్ : 60)

ఇక ప్రజలకు శుభవార్త ఇవ్వవలసి ఉన్నప్పుడు "నా దాసులు" అని సంబోధించ బడింది. ఉదాహరణకు,

> "విషయాన్ని సావధానంగా వినే, మరియు దాని ఉత్తమ కోణాన్ని పాటించే నా దాసులకు శుభవార్త వినిపించండి. వారెవరంటే, అల్లాహ్ వారికి మార్గం చూపాడు. వారే వివేచనాపరులు." **(అజ్జుమర్ : 17, 18)**

"నేను వ్యాధిగ్రస్తుడినయ్యాను. నువ్వు నన్ను పరామర్శించలేదు. నేను నిన్ను అన్నం అడిగాను. కాని నువ్వు నాకు అన్నం పెట్టలేదు. నేను నిన్ను మంచినీళ్ళు అడిగాను.

https://teluguislam.net

నువ్వు నాకు త్రాపలేదు.” వ్యాధి, ఆకలిదప్పులను అల్లాహ్ తన వైపునకు వర్తింప జేసుకుని ప్రశ్నించాడని ఉలమాలు (పండితులు) అభిప్రాయపడ్డారు. హదీసులోని తరువాయి వచనాల ద్వారా తెలిసిపోతుంది - వ్యాధిగ్రస్తుడు, ఆకలిగొన్నవాడు, దప్పికగొన్నవాడు మనిషేకాని సర్వలోకాల ప్రభువు ఎంతమాత్రం కాదని. నిజానికి ప్రభువు ఈ బలహీనతలన్నింటికీ అతీతుడు, పరిశుద్ధుడు. ఆయనలో ఏ దౌర్బల్యమూ లేదు. వాస్తవానికి ఆయన అక్కరలేనివాడు.

“నా ఫలానా దాసుడు రోగగ్రస్తుడయ్యాడు.”
“నా ఫలానా దాసుడు అన్నం అడిగాడు.”
“నా ఫలానా దాసుడు నీళ్ళు అడిగాడు.”

ఇటువంటి బాధితులను అల్లాహ్ “నా దాసుడు” అని ప్రస్తుతించాడు. ఎందుచేత నంటే కష్టకాలంలో దాసుడు తన ప్రభువుకు అత్యంత చేరువవుతాడు. ఆయన కరుణకు అర్హుడవుతాడు. అటువంటి తరుణంలో గనక ఏ మనిషయినా ఆ బాధితుణ్ణి ఆదుకున్నాడంటే అతను కూడా దైవకారుణ్యంలో భాగం పొందుతాడు. “నువ్వు నన్ను అతని దగ్గర పొందివుండేవాడివి” అంటే నువ్వు గనక ఆ రోగగ్రస్తుణ్ని పరామర్శించి, అతని దుఃఖభారాన్ని తగ్గించి ఉంటే, ఇంకా అతనికి సపర్యలు చేసివుంటే నా దయాదాక్షిణ్యాలకు నోచుకునేవాడివి. ఈ రోజు నీకు దాని బహుమతి లభించి ఉండేది అని భావం.

“దాన్ని నా వద్ద పొందేవాడివి” అంటే నువ్వే గనక ఆకలిగొన్నవాడికి అన్నం పెట్టి ఉంటే నేను ఈ రోజు స్వర్గపు ఫలాలు తినిపించేవాడిని. నువ్వు గనక దప్పికగొన్నవాడి దాహం తీర్చి ఉంటే ఈ రోజు నీకు కౌసర్ సరస్సులోని అత్యుత్తమమైన పానీయం ఇవ్వబడేది. ఎందుకంటే ప్రపంచం పరీక్షా స్థలమైతే పరలోకం పరీక్షా ఫలితాల నిలయం.

ఈ హదీసు ద్వారా దైవ సన్నిధిలో మనిషికి ఎంత ఉన్నత స్థానం ఉందో తెలుస్తోంది. ఏ విధంగానైతే ఆపదలో ఉన్న మనిషిని ఆదుకోకపోవటం వల్ల దైవకారుణ్యానికి నోచుకోకుండా పోతామో అదేవిధంగా సముచితమైన కారణమేదీ లేకుండా ఒక మనిషిని అవమానించడం వల్ల కూడా దైవాగ్రహానికి గురయ్యే ప్రమాదముంది. ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యే మరో విషయమేమిటంటే, ఆకలిగొన్న వాడికి అన్నం పెట్టడం, దప్పికగొన్నవాడి దాహం తీర్చడం, రోగగ్రస్తుణ్ని పరామర్శించడం ఉత్తమ నీతి నడవడికలకు తార్కాణం. పైగా ఇవి ఎటువంటి ధర్మాలంటే వాటిని ఉపేక్షించడం వల్ల ప్రళయ దినాన ప్రభువు సమక్షంలో సమాధానం చెప్పుకోవలసి వస్తుంది. సర్వోన్నత ప్రభువు తన గ్రంథంలో ఎన్నోచోట్ల అన్నం తినిపించటాన్ని, పరస్పరం సాయం చేయటాన్ని ఆదేశించాడు. పైగా వాటిని విశ్వాస లక్షణాలుగా పేర్కొన్నాడు. ఈ విధ్యుక్త ధర్మాల నిర్వర్తనలో ఉద్దేశ్యపూర్వకంగా వెలితి కనబరచేవాడు, తన అలక్ష్యధోరణి వల్ల ప్రపంచంలో ఏ విధంగా మనుషులు సాయానికి నోచుకోకుండా పోతారో అదేవిధంగా అతను తీర్పు దినం నాడు దైవ కటాక్షానికి నోచుకోకుండా పోతాడని ఈ పవిత్ర హదీసు వల్ల బోధపడుతుంది

◆◆◆

https://teluguislam.net

# 13. ప్రతి ముస్లిం గౌరవనీయుడే

ప్రవక్త మహనీయులు (సఅసం) ప్రవచించారని హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించారు : "మీలో ఎవ్వరూ మీ సోదరుని వైపు ఆయుధం ఎక్కుపెట్టరాదు. బహుశా షైతాన్ అతని చేయిని ఝుళిపించవచ్చు. ఇంకా, అది నరక కూపంలో పడిపోవచ్చు." (ముస్లిం)

తాత్పర్యం

ఈ హదీసులో ముస్లిం హక్కుల గురించి నొక్కి పలకడం జరిగింది. ఏ ముస్లిమునయినా భయపెట్టడం, కలవరానికి గురిచెయ్యడం, లేదా అతను నొచ్చుకునేలా వ్యవహరించడం పట్ల వారించబడింది.

"మీ సోదరుని వైపు ఆయుధాన్ని ఎక్కుపెట్టరాదు." ఇక్కడ సోదరుడంటే ముస్లిం అన్నమాట. ముస్లిములు పరస్పరం అన్నదమ్ములు. అల్లాహ్ సెలవిచ్చాడు : "ఇన్నమల్ మోమినీన ఇఖ్వ" (విశ్వాసులు పరస్పరం సోదరులు). ఆటపాటల్లో, ఎందుకైనానికయినా భయపెట్టే సంకల్పంతో కరవాలాన్ని, ఖడ్గాన్ని, లేక మరే ప్రమాదకరమైన ఆయుధాన్నయినా లేపటం హరాం (నిషిద్ధం).

"షైతాన్ అతని చేయిని ఝుళిపించవచ్చు" అంటే చేయి జారినా చేయి విసిరినా చేతిలోని ఆయుధానికి ఎదుటి వ్యక్తి గురికావచ్చు. ఇది ఘోర అన్యాయం అవుతుంది. ఒక ముస్లింను అకారణంగా చంపిన కారణంగా ఇతను నరకాగ్నికి ఆహుతి అవుతాడు. ఎందుకంటే అన్యాయంగా, అధర్మంగా ఏ ముస్లిమునైనా వధించటం మహాపాతకం. అల్లాహ్ సెలవిచ్చాడు :

> "ఉద్దేశ్యపూర్వకంగా ఎవడైతే ఒక విశ్వసించిన వాణ్ణి చంపుతాడో అతనికి బహుమానం నరకం. అందులో అతడు సదా ఉంటాడు. అతనిపై అల్లాహ్ ఆగ్రహం మరియు శాపం అవతరిస్తాయి. అల్లాహ్ అతడి కొరకు కఠినమయిన శిక్షను సిద్ధపరచి ఉంచాడు.
>
> (అన్ నిసా: 93)

ఏ ముస్లిం హత్యకయినా, గాయానికయినా కారణభూతమయ్యే ప్రతి విధానాన్ని, ప్రతిదానిని మహనీయ ముహమ్మద్ (సఅసం) నిషేధంగా (హరామ్)గా ఖరారు చేసినట్లు అసంఖ్యాకమయిన హదీసుల ద్వారా విదితమవుతోంది.

https://teluguislam.net

హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది : ఎప్పుడయినా ఏ ముస్లిం అయినా మరో ముస్లిం వైపునకు ఇనుప ముక్కతో సంజ్ఞచేస్తే దైవదూతలు అతన్ని శపిస్తారు - ఒకవేళ అతను సంజ్ఞ చేసిన వ్యక్తి అతని తోబుట్టువు అయినాసరే.

ఇబ్నుల్ అరబీ ఏమంటున్నారో చూడండి - 'కేవలం ఇనుప ముక్కతో సంజ్ఞ చేసిన మాత్రానికే అతను శాపగ్రస్తుడయితే, ఇక ఆ ఇనుపముక్కతో ఎదుటి ముస్లింపై దాడి జరిపితే, అప్పుడతని పర్యవసానం ఇంకెంత ఘోరంగా ఉంటుందో?'

వేళాకోళంగానే అయినా ఆయుధంతో సైగ చేసిన వ్యక్తి ధూర్తుడిగా పరిగణించబడటానికి కారణమేమంటే, అతని, ఈ చేష్ట మూలంగా ఎదుటి వ్యక్తి భయాందోళనకు గురయ్యాడు. అదే ఒకవేళ అతను నిజంగానే ఎదుటి వ్యక్తికి కీడు తలపెట్టే ఉద్దేశ్యంతో చేస్తే అది మహాపరాధమే అవుతుంది. అందుకే ఒరలేని (నగ్న) ఖడ్గాలు ఇచ్చిపుచ్చుకోరాదని అనబడింది. అలా ఇచ్చిపుచ్చుకొంటున్నప్పుడు ఏమరుపాటువల్ల ఖడ్గం చేజారిపోయి హాని కలిగే ప్రమాదముంది.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక బృందం వైపుగా వెళుతుండగా, వారు ఒరలేని ఖడ్గాలను మార్పిడి చేసుకుంటూ కనిపించారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం) వారిని ఇలా మందలించారు - "ఇలాంటి చేష్ట చేయరాదని నేను మీకు చెప్పలేదా? మీలో ఎవరయినా ఖడ్గాలు మార్చుకుంటున్నప్పుడు ఒరలో పెట్టి మరీ ఇవ్వాలి." (అహ్మద్, బజార్)

నేటి ఆధునిక కాలంలో ఎవరయినా - వేళాకోళానికయినా సరే - రివాల్వర్‌ను ఎదుటివారికి గురిపెట్టడం, గుళ్లు నింపిన రివాల్వర్‌తో అనుభవం లేకుండా ప్రాక్టీసు చేయటం కూడా హదీసులో ప్రస్తావించబడిన ఖడ్గాల మార్పిడిలాంటిదే.

ముక్తసరిగా హదీసు సారాంశం ఏమంటే ప్రతి ముస్లిం ప్రాణం అత్యంత విలువైనది, గౌరవప్రదమైనది. కాబట్టి అకారణంగా, అన్యాయంగా ఒక ప్రాణానికి హాని తలపెట్టడం దైవ సమక్షంలో పెద్దనేరం అవుతుంది. అటువంటి వారి నుండి ప్రళయదినాన కఠినంగా లెక్క తీసుకోవటం జరుగుతుంది.

https://teluguislam.net

# 14. స్వర్గం

హజ్రత్ అబూహురైరా (రజిఅన్) ఉల్లేఖించారు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు : "అల్లాహ్ ఏమని సెలవిచ్చాడంటే, "నేను సజ్జనులైన నా దాసుల కొరకు ఏ కన్నూ చూడని, ఏ చెవీ వినని, ఏ మనిషి హృదయమూ ఊహించనైనా లేని వస్తువులను సిద్ధంగా ఉంచాను." ఒకవేళ మీరు కోరితే (నిశ్చయం కోసం) ఈ ఆయత్ చదువుకోండి - "ఫలా తాలము నఫ్సుమ్మా ఉక్ఫియ లహుమ్ మిమ్మిన్ ఖుర్రతి ఆయున్, జజాఅన్ బిమా కానూ యామలూన్" (వారి పనులకు బదులుగా వారి కనుల చల్లదనం కోసం సిద్ధం చేయబడి ఉన్న సంపత్తి గురించి ఏ ప్రాణికీ తెలియదు). (బుఖారి)

ఈ హదీసులో కారుణ్య ప్రభువైన అల్లాహ్ సజ్జనులైన తన దాసులకు గొప్ప శుభవార్త నిచ్చాడు. తాను చూపిన మార్గాన్ని అవలంబించే సద్వర్తనులకే ఈ గొప్ప ప్రతిఫలం దక్కుతుందని తెలియజేశాడు.

"సిద్ధంగా ఉంచాను"

అల్లాహ్ ఏ అనుగ్రహాలు, కానుకలనయితే సిద్ధంగా ఉంచాడో అవి స్వర్గంలో ఉన్నాయి. ఈ వాక్యం ద్వారా తెలిసిందేమంటే స్వర్గం ఇప్పుడు నెలకొని ఉంది. అసంఖ్యాకమయిన హదీసుల ద్వారా, అల్లాహ్ స్వర్గాన్ని మూసి ఉంచినట్లు విదితమవుతోంది.

సద్వర్తనులైన నా దాసుల కొరకు .....

అల్లాహ్ ఏ సందర్భంగానయినా, ఏ మనిషినయినా 'నా దాసుడు' అని ప్రశంసా పూర్వకంగా నొక్కిపలికితే, ఆ మనిషికి అంతకన్నా భాగ్యం ఏం కాగలదు? సర్వోన్నతుడు, స్తోత్రాలకర్హుడైన ప్రభువే అశక్తుడు, దోషపూరితుడైన మనిషిని తన దాసునిగా చెప్పుకోవటం అపూర్వమైన విషయం. ఈ ఆప్యాయత, ఈ మమకారం శుభవార్త, బహుమతి ప్రదానాల సందర్భంగా ఉబికి రావటం గమనార్హం.

అల్లాహ్‌కు ప్రీతికరమైన, సద్వర్తనులయిన ఆ దాసులెవరు? వారి గుణగణాలు, లక్షణాలు దివ్య ఖుర్ఆన్‌లో వివరించబడ్డాయి.

1. "ఎవరయితే మా ఆయత్‌లను విశ్వసించారో, మరియు మంచిపనులు చేశారో వారు స్వర్గ నివాసులు. వారు అక్కడ సదా ఉంటారు - ఈ విషయంలో మేము ప్రతి వ్యక్తిపైనా అతని శక్తి సామర్థ్యాలకు అనుగుణంగానే బాధ్యతను మోపుతాము." (అల్ ఆరాఫ్ :42)

2. "ఇది ఏ స్వర్గమంటే దీనికి వారసులుగా ధర్మపరాయణులైన మా దాసులనే చేస్తాము." (మర్యమ్ : 63)

3. "ఆ రోజు మా ఆయత్‌లను విశ్వసించిన వారితో, ఇంకా విధేయతను కనబరచిన వారితో అనబడుతుంది - 'ఓ నా దాసులారా! ఈ రోజు మీరు భయపడవలసిన, దుఃఖించవలసిన అవసరం లేదు. స్వర్గంలో ప్రవేశించండి మీరూ, మీ భార్యలూను." (జుఖ్‌రుఫ్ : 68, 69)

https://teluguislam.net

**4. "ఎవరు తమ ప్రభువు ఎదుట నిలబడే విషయమై భయపడ్డారో వారి కోసం రెండు ఉద్యాన వనాలున్నాయి." (అర్రహ్మాన్ : 46)**

పై ఆయత్‌ల ద్వారా అటువంటివే ఇతర ఆయత్‌ల ద్వారా సజ్జనులైన దైవదాసుల గుణగణాలను తెలుసుకోవచ్చు. వారు సతతం దైవగ్రంథాన్ని విశ్వసిస్తారు. మంచిపనులు చేస్తూ ఉంటారు. దైవాగ్రహాన్ని, దేవుడు తీసుకునే లెక్కను గురించి తలచుకుని ఆపాదమస్తకం కంపిస్తుంటారు. ఆరాధనలలో ఏకాగ్రతను, వినయాన్ని పాటిస్తారు. నైతిక విషయాలకు కట్టుబడి ఉంటారు.

అటువంటి సద్వర్తనుల కోసం అల్లాహ్ సిద్ధం చేసివుంచిన బహుమానాలను ఏ మనిషీ కనలేదు, వినలేదు, ఆలోచించనైనా లేదు. దివ్య గ్రంథంలో అల్లాహ్ స్వర్గంలో పలురకాల కానుకలు, వరాలను పలుచోట్ల ప్రస్తావించాడు - ఆ విధంగానయినా మనిషి స్వర్గ సుఖాలను ఊహించగలుగుతాడని. అంతేగాని, వాస్తవానికి - హదీసులో పేర్కొనబడినట్లు - స్వర్గంలోని వస్తువులను ఎవరూ చూడలేదు. అక్కడి ఆహార పదార్థాలు, పండ్లు ఫలాలు, మాంసాదులు, పాలు తేనియలు, నీరు, మధుపానం, అక్కడి పట్టువస్త్రాలు, బంగారం, వెండి వజ్రవైఢూర్యాలు, అక్కడి నివాసస్థలాలు, అందలి భార్యాభర్తలు, వారి అందచందాలు, గుణగణాలు - అన్నింటికీ మించి దైవదర్శనంలోని మహదానందం తదితర విషయాలను ఏ మనిషిగాని, ప్రవక్తగాని, దైవదూతగాని ఊహించనైనాలేరు.

సహీహ్ రివాయత్ (ఉల్లేఖనం) ప్రకారం, అందరికన్నా పెద్దదూత అయిన జిబ్రయీల్ (అలైహిస్సలాం) స్వర్గంలో సైరుచేసినట్లు విదితమవుతోంది. అయితే కేవలం సైరు ద్వారా స్వర్గసుఖాలను ఊహించటం కష్టం. ఎందుకంటే ఏ వస్తువు నాణ్యతగాని, రుచిగాని దాన్ని వినియోగించటం ద్వారానే తెలిసివస్తుంది. మరో ముఖ్య విషయం ఏమంటే, అల్లాహ్ స్వర్గంలో సిద్ధంచేసి ఉంచిన సమస్త వస్తువులు, పదార్థాలు దైవదాసులు అందులోకి ప్రవేశించిన తరువాత మరింత వృద్ధిచెందుతాయి. కొత్త కొత్త బహుమానాలు వారి సమక్షంలో సమర్పించబడతాయి. అవెంత అపురూపంగా, హృద్యంగా ఉంటాయంటే వాటిని గురించి మనిషి ఎన్నడూ ఊహించి కూడా ఉండడు. అల్లాహ్ ఆ సత్యాన్నే ఇలా చెప్పాడు :

**"వారి కర్మలకు ప్రతిఫలంగా, వారి కళ్ళ చల్లదనం కొరకు ఏం సిద్ధం చేయబడివుందో, వాటి గురించి ఏ ప్రాణీ ఎరుగదు." (అస్ సజ్‌దహ్ : 17)**

"ఒకవేళ మీకు నమ్మశక్యం కాకపోతే ఈ ఆయత్ చదువుకోండి" అని చెప్పిన వారు హజ్రత్ అబూహురైర (రజిఅన్). "సిద్ధంచేసి ఉంచాను" అన్నంతవరకే అసలు హదీసు. అల్లాహ్ సిద్ధంచేసి ఉంచిన, కానుకల నిలయమైన స్వర్గం పట్ల ప్రజలు ఎంత అలసత్వం ప్రదర్శిస్తున్నారు?! అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త స్వర్గం గురించి పదే పదే నొక్కి పలికిన తరువాత కూడ మానవాళి దాని విషయంలో ఏమరుపాటుకు గురై ఉండటం సృష్టిలోనే అత్యంత ఆశ్చర్యకరమైన విషయంగా అగుపిస్తుంది.

https://teluguislam.net

# 15. పెండ్లి ప్రాముఖ్యత

అల్‌ఖమ ఇలా అన్నారు -

"నేను మినాలో అబ్దుల్లాహ్ వెంట నడుస్తూ ఉండగా ఆయన్ని ఉస్మాన్ (రజిఅన్) కలుసుకున్నారు. వారాయనతో మాట్లాడసాగారు. ఉస్మాన్ (రజిఅన్) ఆయనతో అన్నారు : "ఓ అబూ అబ్దుర్రహ్మాన్! మీ వివాహం ఒక యుక్త వయస్కురాలైన అమ్మాయితో ఎందుకు జరిపించకూడదు? తద్వారా మీకు పూర్వకాలం (యౌవనం) ఎందుకు జ్ఞాపకం చేయకూడదు?" అబ్దుల్లాహ్ బదులిచ్చారు - "మీరు కూడా అదే మాటంటున్నారా? దైవప్రవక్త (సఅసం) మాకు, ఓ యువకుల్లారా! మీలో నికాహ్ చేసుకోగల శక్తి ఉన్నవారు నికాహ్ చేసుకోవాలి. ఎందుకంటే చూపులను వాల్చడానికి, మర్మాంగాలను పరిరక్షించుకోవటానికి అలా చేయటం మంచిది. ఎవరికయితే నికాహ్ చేసుకునే స్థోమత లేదో వారు తప్పకుండా ఉపవాసం ఉంటుండాలి. అది అతని కొరకు డాలు వంటిది అని ప్రబోధించారు" అని అన్నారు. (ముస్లిం)

అల్‌ఖమగారు, మహాప్రవక్త ప్రియసహచరుల శిష్యగణంలోని వారు. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (ర.అ) యొక్క ముఖ్య శిష్యులు. ఈయన హిజ్రీ శకం 60 తరువాత మరణించారు.

'మినా' మక్కా సమీపంలోని ఒక ప్రదేశం. అక్కడ హజ్ యాత్రీకులు జిల్‌హజ్ 8 నుండి 12వ తేదీ వరకు విడిదిచేస్తారు. ఉస్మాన్ మరియు అబ్దుల్లాహ్‌ల మధ్య ఆ సంభాషణ బహుశా హజ్ దినాలలోనే జరిగి ఉంటుంది.

అబ్దుల్లాహ్ అంటే ఇక్కడ హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజిఅన్) అన్నమాట. హదీసువేత్తల పరిభాష ప్రకారం - హదీసులో ఎప్పుడు అబ్దుల్లాహ్ ప్రస్తావన వచ్చినా అది అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజిఅన్)కే వర్తించటం పరిపాటి.

తొల్దొలి రోజుల్లో ఇస్లాంను స్వీకరించిన వారిలో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజిఅన్) ఒకరు. మహాప్రవక్త ముహమ్మద్‌తో ప్రత్యేక సాన్నిహిత్యం ఉన్నవారిలో ఆయన ఆరవవారు. యుద్ధాలన్నింటిలో ఆయన ఇస్లాం తరపున పాల్గొన్నారు. దైవప్రవక్త (సఅసం) పరమపదించిన తరువాత ఆయన ఇస్లామీయ రాజ్యంలో పలు ముఖ్యమయిన బాధ్యతలను నిర్వర్తిస్తుండేవారు. హిజ్రీ శకం 32వ ఏట హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ మరణించారు. అప్పటికీ ఆయన వయస్సు 60 ఏండ్లకు పైబడింది.

https://teluguislam.net

"మీ వివాహం యుక్త వయస్కురాలైన అమ్మాయితో ఎందుకు జరపకూడదు?" అన్న వాక్యం గమనార్హం. మహాప్రవక్త (సఅసం) హయాంలోనూ, ఆయనకు ముందు మరియు ఆయన అనంతరం, ఆ మాటకొస్తే నేటివరకు కూడా - వయస్సు పైబడిన అరబ్బు పురుషులు చిన్న వయసున్న కన్యలను వివాహమాడటం కనిపిస్తుంది. వారి దృష్టిలో ఇది ఆక్షేపించదగ్గ విషయం కాదు, దోషభూయిష్టమయిన విషయం అంతకన్నా కాదు. సుఖవంతమయిన, సంతోషదాయకమయిన దాంపత్య జీవితం కొరకు మనసులు కలుస్తే చాలుగాని వయసుతో పని ఏముందీ? అన్నది వారి అభిమతం. వయసులోని తేడాపాడాలకు సంసార జీవితంలో అంతగా ప్రాముఖ్యం లేదన్నది వారి అభిప్రాయం. హదీసులో "అల్‌బాదహ్" అనే పదం వచ్చింది. దీని భావం "జోడు" అని ఒక అర్థం వస్తుంది. అంటే ఎవరయితే తోడునీడకై యోగ్యుడయ్యాడో అతను పెండ్లి చేసుకోవాలి. మరెవరయితే లైంగికశక్తి ఉండి కూడా వివాహం చేసుకోగల ఆర్థిక స్థోమత కలిగిలేడో అతను వీలయినన్ని ఎక్కువ నఫిల్ (అదనపు) ఉపవాసాలు పాటిస్తూ ఉండాలి. ఇంద్రియ నిగ్రహం కోసం, మనసును చెడు ఆలోచనల నుండి రక్షించుకోవటం కోసం ఇలా చేయటం అవసరం. అందుకే రోజా (ఉపవాసం)ను లైంగిక వాంఛల నుండి కాపాడే 'డాలు'గా అభివర్ణించడం జరిగింది. కామవాంఛలను షైతాన్ ఒక ఆయుధంగా వాడుకుని విశ్వాసిపై ఏదో ఒక వైపునుండి దాడి చేయడానికి పొంచి ఉంటాడు. ఏదో ఒక మిషపై అతన్ని చెడుల ఊబిలోకి లాక్కుపోవటానికి ఎత్తులు వేస్తుంటాడు. అయితే ఆ యువకుడు పాటించే ఉపవాసం, అతనికి ఒక డాలు లాగా, ఒక రక్షక కవచంలాగా పనిచేస్తూ అతను దుష్ట కోర్కెల వాతన పడకుండా కాపాడుతూ ఉంటుంది. ఉపవాసం పాటించిన వ్యక్తిలో లైంగిక ఆవేశం తగ్గుముఖం పడుతుంది. దాని స్థానే భయభక్తులు, ధర్మనిష్ఠ ఆధిక్యత వహిస్తాయి. దైవప్రవక్త (సఅసం) నవయువకులను ఉద్దేశించి ఈ హితబోధ చేసినప్పటికీ యువతులకు సయితం ఇది వర్తిస్తుంది.

"అల్‌బాదహ్" అనే పదానికి మరో అర్థం వివాహానంతరం అయ్యే ఖర్చుల్ని భరించగలగటం అని. అంటే సహధర్మచారిణికి తగురీతిలో భోజన వసతి సౌకర్యం కల్పించటం, ఆమె దుస్తులు తదితర అవసరాలను తీర్చటం అన్నమాట. ఏ వ్యక్తికయితే భార్య యొక్క కనీస అవసరాలను కూడా తీర్చగలిగే స్థోమత లేదో, అతను ఒకవేళ యుక్త వయస్కుడైనప్పటికీ పెండ్లి చేసుకోకుండా ఉండటమే మంచిది. తనలో కట్టలు త్రెంచుకునే లైంగిక వాంఛలకు పటిష్ఠమయిన ఆనకట్టవేసి ఆపుకోవటానికి అతను తరచూ ఉపవాసాలు ఉండాలి. ఉపవాసాల మూలంగా అతని కోర్కెల కళ్ళెం పూర్తిగా అతని అదుపులోకి వచ్చేస్తుంది. ఆ విధంగా అతను నీతిబాహ్యమైన చేష్టల నుండి తనను రక్షించుకోగలుగుతాడు.

https://teluguislam.net

"ఓ యువకుల్లారా! మీలో వివాహ స్థోమత ఉన్నవారు, నికాహ్ చేసుకోవాలి" అన్న దైవప్రవక్త (స) వారి హితవును అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ ఉస్మాన్ (రజిఅన్) ముందు ప్రస్తుతించటంలోని ఉద్దేశం గమనించదగినది. వివాహం చేసుకోమని ప్రవక్తగారు చెప్పినది యువకులతోనే గాని, ముసలివారితో కాదు. వివాహం ఏ వయసులో నయినా ధర్మసమ్మతమే. అయితే యుక్త వయస్సులో మాత్రం అది అవసరం. ఎవరి వద్దయితే రెండు యోగ్యతలు (స్థోమత) సమకూర్తాయో వారు పెండ్లాడమని మహాప్రవక్త ప్రబోధించారు. ఆ రెండు యోగ్యతలు ఏమిటంటే; 1. లైంగిక శక్తి. 2. ఆర్థిక స్థోమత.

ప్రాచీన ఉలమాల (విద్వాంసులు)లో నికాహ్ విషయమై పలు అభిప్రాయాలున్నాయి. వాస్తవానికి ఆయా వ్యక్తుల వ్యక్తిగత స్థితిగతుల దృష్ట్యా నికాహ్ ఆజ్ఞ వారికి వేర్వేరుగా వర్తిస్తుంది. కొంతమంది పరిస్థితి ఎటువంటిదంటే, వారు వివాహ కాంక్ష కలిగి ఉంటారు, ఆర్థికంగా కూడా స్థితిపరులై ఉంటారు. అటువంటివారు పెండ్లి చేసుకోవటం అవసరం. మరికొందరి పరిస్థితి ఏమంటే, వారికి వివాహాపేక్ష లేదు, పెండ్లాన్ని పోషించే స్థోమత కూడా లేదు. అటువంటి వారు వివాహమాడటం ఎంతకీ సమంజసం కాదు. ఇంకా కొంతమంది పరిస్థితి ఎలాంటిదంటే; వారికి పెండ్లి మోజు ఉందిగాని శ్రీమతిని సుఖపెట్టే ఆర్థిక స్థోమత లేదు. అటువంటి వారు వివాహమాడటం తప్పనిసరికాదు, అయితే వారికా అనుమతి మాత్రం ఉంది. నేటి పేదవాడు రేపు శ్రీమంతుడు కావచ్చు. ఒకవేళ యువకులు పెండ్లి గనక చేసుకోని పక్షంలో వారు ఉపవాసాలు పాటిస్తూ ఉండాలి - తద్వారా వారు తమ మర్మాంగాలను కాపాడుకోగలుగుతారు. మరి కొంతమంది ఎలాంటివారంటే, ఆర్థికంగా వారు మంచి స్థితిలోనే ఉన్నారు. అయితే పెండ్లి పట్ల వారికి ఆసక్తి లేదు. అటువంటి వ్యక్తి గురించి ఇమామ్ షాఫయీ (రహ్మాలై) అభిప్రాయం ఏమంటే, అతనికై వివాహం 'ముస్తహబ్' కాదు. అతను పెండ్లి చేసుకోకుండా ఉండటం, ఆరాధనల కోసం సమయాన్ని కేటాయించటం ఉత్తమం. అయితే ఇతర ఇమాములు (రహ్మాలై), ఆ వ్యక్తి పెండ్లి చేసుకోవటమే ఉత్తమమని అభిప్రాయపడ్డారు.

ఈ హదీసు వల్ల బోధపడేదేమంటే వివాహం ప్రతి ఒక్కరికి అవసరం. అది ప్రవక్తల సంప్రదాయం. దీని మూలంగా మనిషికి నైతికత, పరిశుద్ధత అలవడతాయి.

https://teluguislam.net

# 16. ప్రవక్త సహచరుల స్థానం

ఇబ్నె మస్‌ఊద్ (రజిఅల్లాహు అన్‌హు) పలికారు : "ఎవరిని అనుసరించాలన్నా గతించిన వారిని అనుసరించండి. ఎందుకంటే బ్రతికి ఉన్నవాడు పరీక్షల నుండి సురక్షితంగా ఉండలేడు. వారు (గతించినవారు) మహాప్రవక్తగారి ప్రియ సహచరులు. ప్రవక్త (సఅసం) అనుయాయులలో కెల్లా మంచివారు. వారి మనసులు అందరి మనసుల కన్నా మంచివి. వారి జ్ఞానం ఇతరులందరి జ్ఞానంకన్నా లోతైనది. ఇంకా వారు తక్కువ మొహమాటస్తులు. అల్లాహ్ వారిని, తన ప్రవక్త సహచర్యం కొరకు తన ధర్మస్థాపన కొరకు ఎన్నుకున్నాడు. వారి గొప్పతనాన్ని గుర్తించండి, వారి మార్గచిహ్నాలను అనుసరించండి. సాధ్యమయినంత వరకు వారి నీతి నడవడికలను ఆదర్శంగా తీసుకోండి. ఎందుకంటే వారు సన్మార్గాన ఉండేవారు." (రివాహ్ రజీన్)

ఇవి మహాప్రవక్త (సఅసం) నోట వెలువడిన పలుకులు కావు. అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజిఅన్) తన సహచరులకు చేసిన హితవు మాత్రమే. అయితే వీటిని ఎంతో ప్రమాణబద్ధంగా భావించడం జరిగింది. (1) "ఎవరిని అనుసరించాలన్న...." అన్న వాక్యం ప్రత్యేకించి గమనించదగినది. ప్రతి ముస్లిం వాస్తవానికి దైవగ్రంథాన్ని, మహాప్రవక్త (సఅసం) సంప్రదాయాన్ని అనుసరించే ప్రయత్నంలో ఉంటాడు. దానికి సంబంధించి ఎవరి ఆదర్శమయినా ముందు ఉంటే, అది అతనికై ఎంతో సులభతరమవుతుంది. అందుకే అల్లాహ్ తన గ్రంథమయిన ఖుర్‌ఆన్‌లో సద్వర్తనులయిన తన దాసుల సుగుణాలను, లక్షణాలను విశదీకరించాడు. వారి మార్గాన్ని అనుసరించమని ఆజ్ఞాపించాడు. ఇబ్రాహీం, ఇస్‌హాఖ్, యాఖూబ్, నూహ్, దావూద్, సులైమాన్, అయ్యూబ్, యూసుఫ్, మూసా, హారూన్, జకరియ్యా, యహ్యా, ఈసా, ఇలియాస్, ఇస్మాయీల్, యూనుస్ మరియు లూత్ అలైహి ముస్సలాంల ప్రస్తావన వచ్చిన తరువాత ఖుర్‌ఆన్‌లో ఇలా ఆదేశించబడింది :

> **"వీరెవరంటే, అల్లాహ్ వీరికి మార్గం చూపాడు. వీరి జీవితాలనే అనుసరించండి. ఈ విషయమై నేను మీ నుండి ఎటువంటి ప్రతిఫలాన్నీ అపేక్షించటం లేదని వారితో చెప్పివేయండి. ఇదైతే సమస్త లోకాల కోసం ఒక సర్వసామాన్య హితోపదేశం మాత్రమే." (అల్ అన్ ఆమ్ : 90)**

(2) "గతించిన వారిని అనుసరించండి" అంటే విశ్వాస స్థితిలో మరణించిన వారని భావం. ఇంకా వారెంతో సద్వర్తనులు. సతతం వారు దైవ విధేయతలో ఉండేవారు.

(3) "బ్రతికి ఉన్నవాడు పరీక్షనుండి సురక్షితంగా ఉండలేడు" అన్న వాక్యం కూడా

https://teluguislam.net

ఆలోచించదగినదే. జీవించి ఉన్నవాడిచేత ఎప్పుడైనా పెద్దపాపం జరిగిపోవచ్చు. ధర్మపరాయణుడుగా పరిగణించబడే వ్యక్తే ఒక్కోసారి అపరాధానికి ఒడిగడతాడు. విశ్వాసిగా బ్రతికేవాడు మధ్యలో ధర్మభ్రష్టుడుగా, అవిశ్వాసిగా మారిపోయే అవకాశం కూడా ఉంది. (దైవం మన్నించుగాక!) అందుకే సజీవుడైన ఏ మనిషినయినా, భావితరాలకు ఆదర్శవంతుడు అని అనటం సమంజసం కాదు. అయితే మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) గారి జీవితం, ఆయన వ్యక్తిత్వం నిస్సంశయంగా అందరికీ ఆదర్శవంతమైనది. నిజానికి ఆచరించవలసింది, అనుసరించవలసింది ఆయన నెలకొల్పిన సున్నత్ (సంప్రదాయం)నే, దివ్య ఖుర్‌ఆన్‌లో సెలవియ్యబడింది -

**"యథార్థానికి దైవప్రవక్తలో మీకోసం అత్యుత్తమమయిన ఆదర్శం ఉంది. అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించే, మరియు అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి వ్యక్తి కొరకు (ఆయనలో ఆదర్శం ఉంది)." (అల్ అహ్‌జాబ్ : 21)**

దివ్య ఖుర్‌ఆన్‌లో 20 కంటే ఎక్కువ చోట్లే అల్లాహ్ తన అంతిమ ప్రవక్తతోపాటు, ఆయన ప్రియ సహచరుల సుగుణాలను వివరించాడు - వారి జీవితాలను ఆదర్శంగా గ్రహించి మనం ఆ మేరకు అనుసరిస్తామన్నదే దీని ఉద్దేశం. సహాబాలు (ప్రవక్త సహచరులు) దోషరహితులు కారు. విమర్శకు అతీతులు కూడా కారు. అయితే వారిలో మంచి అధికంగా ఉండేది. వారిలో ఎన్ని సుగుణాలు ఉండేవంటే, అసలటువంటి సద్వర్తనుల సమూహం నాటి నుండీ నేటి వరకు ధరణిపై జన్మించనే లేదు.

(4) "ప్రవక్త (స) అనుయాయుల్లో కెల్లా మంచివారు" అనేది మరో వాక్యం. అంటే మహాప్రవక్త (సఅసం) అనుచర సమాజంలో ఎందరు మరణించారో, ఇంకా ఎందరు తరువాత మరణించనున్నారో - వారందరిలో కెల్లా ప్రవక్త ప్రత్యక్ష సహచరగణం శ్రేష్ఠమయినది. గౌరవప్రదమైనది. ఎందుకంటే, వారు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోసం తమ జీవితాలనే అంకితం చేసివేశారు. సర్వాస్వాన్నీ అర్పించారు.

(5) "వారి మనసులు అందరి మనసుల కన్నా మంచివి" - అంటే, వారు దైవానికి విధేయత చూపేవారు, ఆయన ఆయత్‌లను విశ్వసించేవారు, తమ సకల ఉపాసనలను ప్రదర్శనా భావం నుండి కాపాడుకునేవారు అని భావం. ఇంకా వారి హృదయాలు దైవభీతితో కంపిస్తూ ఉండేవి. దైవం పట్ల వారి హృదయాలలో అచంచల విశ్వాసం, అకుంఠిత దీక్షాభావం ఉండేవి.

(6) "వారి జ్ఞానం అందరికన్నా లోతైనది" అంటే, వారు ఏ విషయాన్నయినా క్షుణ్ణంగా పరిశీలించేవారు. దాని లోతుల్లోకి వెళ్ళిపోయే వారు. మంచీచెడుల మధ్య విచక్షణను

https://teluguislam.net

పాటించేవారు. లోక జ్ఞానంతో పాటు పరలోక సాఫల్యం గురించిన జ్ఞానం వారిలో మెండుగా ఉండేది.

(7) "వారు తక్కువ మొహమాటస్తులు" అంటే వారిలో కృత్రిమంగా హావభావాలను ప్రదర్శించే అలవాటుగాని, ముసుగులో గుద్దులాట ధోరణిగాని ఉండేవి కావు. ఏ విషయాన్నయినా సూటిగా అడిగేవారు, సూటిగానే సమాధానమిచ్చేవారు. మరోమాటలో చెప్పాలంటే వారి జీవితాలు తెరచిన పుస్తకం వంటివి. అన్నపానీయాలలోనయినా, తమలోని లోటుపాట్లను సంస్కరించుకునే ప్రయత్నంలో నయినా వారు మొహమాట పడేవారు కాదు. వారిలో దాపరికం ఉండేది కాదు.

(8) "అల్లాహ్ వారిని తన ప్రవక్త సహచర్యం కొరకు, తన ధర్మస్థాపన కొరకు ఎన్నుకున్నాడు." అల్లాహ్, అసంఖ్యాకులయిన తన దాసులలో ఏ ఒక్కరినో తన పనికోసం ప్రవక్తగా ఎన్నుకుంటాడు. అదేవిధంగా ప్రవక్త సహచర్య భాగ్యం కూడా ఏ కొందరికో గాని ప్రాప్తం కాదు. సహాబాలు కూడా దేవుని తరపున ఎన్నుకోబడ్డారు. వారు ఇస్లాం అనే కట్టడానికి పునాదిరాళ్ళ వంటివారు. ప్రవక్త క్రమ శిక్షణలో వారు ఎలా పోతపోయబడ్డారంటే అవసరమయితే తమ ధన ప్రాణాలను, తమ సంతానాన్ని సయితం అల్లాహ్ మరియు ప్రవక్త కోసం అర్పించడానికి సిద్ధంగా ఉండేవారు. దైవధర్మాన్ని భువిపై స్థాపించే, దివ్య గ్రంథాన్ని ప్రజలకు వినిపించే ప్రయత్నంలో ఉండేవారు. దైవం వారిని ఎన్నుకున్నది కూడా అందుకే మరి.

(9) "వారి గొప్పదనాన్ని గుర్తించండి" అంటే వారిలోని మంచిని గ్రహించి, వారిని ప్రేమించటం, వారిలో ఉండే ఉత్తమ గుణగణాలను అలవరచుకోవటమని భావం.

(10) "వారు సన్మార్గాన ఉండేవారు." ఎందుకంటే వారు అల్లాహ్ మరియు మహాప్రవక్త గారి పంథాను ఖచ్చితంగా అవలంబించారు. ఖుర్అన్ ఉద్దేశ్యాన్ని సరిగ్గా అర్థం చేసుకున్నారు. దైవమార్గంలో ఎలాంటి త్యాగమయినా సంతోషంగా చేశారు. ప్రవక్త సహచర గణాన్ని, వారి గుణ గణాలను అల్లాహ్ ఎన్నో ఆయత్‌లలో వివరించాడు - అవి మనకు మార్గదర్శకం కావటానికి.

> **"ముహమ్మద్ అల్లాహ్ యొక్క ప్రవక్త. ఎవరయితే ఆయనకు తోడుగా ఉన్నారో వారు కాఫిర్ల (తిరస్కారుల) యెడల కఠినులు. (అయితే) పరస్పరం ఎంతో దయార్ద్ర హృదయులు. మీరు వారిని రుకూ మరియు సజ్దాల స్థితిలో చూస్తారు. వారు అల్లాహ్ కృపను, ఆయన ప్రసన్నతను అన్వేషిస్తారు. వారి ముఖారవిందాలపై సజ్దాల చిహ్నాలు కనిపిస్తాయి."** **(అల్ ఫతహ్ : 29)**

https://teluguislam.net

# 17. దైవమార్గంలో ఖర్చు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారని అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజిఅన్) ఉల్లేఖించారు : "మీలో తమ సొమ్ము కన్నా ఎక్కువగా తమ వారసుని సొమ్మును ఇష్టపడే వారెవరు?" అని ప్రవక్త ప్రశ్నించగా, 'మాలో ప్రతి ఒక్కరికీ వారసుల సొమ్ముకన్నా, తమ స్వంత సొమ్మే ప్రీతికరమైంది' అని సహాబాలు బదులిచ్చారు. ఆయన (సఅసం) ప్రబోధించారు : "వాస్తవానికి మనిషి సొమ్మయితే అతను (పరలోకానికి) పంపుకున్నదే. ఇక అతను వదలిపెట్టిపోయేదంతా అతని వారసులది." (బుఖారి)

హాఫిజ్ మూసలి కూడా ఈ హదీసును ఉల్లేఖించారు. అయితే ఈయనగారు ఉల్లేఖించిన హదీసులో రెండు వాక్యాలు అదనంగా ఉన్నాయి. "మాలో ప్రతి ఒక్కరికి మా వారసుల సొమ్ముకన్నా మా సొంత సొమ్మే ప్రీతికరమైనద"ని ప్రవక్త సహచరులు విన్నవించుకున్నప్పుడు మహాప్రవక్త (సఅసం) ఇలా అంటారు : "మీరేమంటున్నారో బాగా అర్థం చేసుకోండి." దానికి సహచరులు, "ఓ దైవప్రవక్తా! మాకైతే తెలిసింది ఇంతే" అన్నారు. అప్పుడు దైవప్రవక్త (సఅసం), "మీరు పంపుకున్నదే అసలు మీ సొంతం. మీరు విడిచిపెట్టిపోయేది మీ వారసులది" అని పలికారు.

దైవప్రవక్త (సఅసం) తన ప్రియసహచరుల ఆంతర్యాల్లో పరలోకం పట్ల విశ్వాసాన్ని పటిష్టం చేయడానికి, దాతృగుణం వారిలో పెంపొందింపజేయడానికి పలు దృష్టాంతాలను, విధానాలను చూపించారు. దైనందిన జీవితంలో ఎదురయ్యే సంఘటనల ద్వారానే పరలోక ఉద్దేశ్యాలను, పరమార్థాలను విపులీకరించేవారు. ఈ హదీసులో ఆయన (సఅసం) తన సహచరులను ఒక విలక్షణమైన పద్ధతి ద్వారా దైవమార్గంలో ఖర్చుకోసం పురికొలిపారు.

మృతుడు వదలిపెట్టిన డబ్బు దస్కం, ఇల్లూ వాకిలీ ఇతర స్థిరచరాస్తులు అన్నీ అతని వారసునికే చెందుతాయి.

(1) "అతను ముందు (పరలోకానికి) పంపుకున్నదే అతని సొంత ఆస్తి" అనే హదీసు వాక్యంలోని లోతులను ఇప్పుడు తెలుసుకుందాం.

మనిషి చేసుకున్న కర్మలే అతన్ని వెంటాడి వస్తాయి. ఎవరు చేసిన కర్మను వారనుభవించక తప్పదన్నది లోకోక్తి. అయితే ప్రపంచంలో అల్లాహ్ తనకు ప్రసాదించిన శక్తియుక్తులు, సిరిసంపదలను మనిషి అల్లాహ్ మార్గంలో గనక ఖర్చుచేస్తే వాటి పుణ్యఫలం పరలోకంలోని, అతని ఖాతాలో జమ అవుతూ ఉంటుంది. ఎప్పుడయితే అతను చనిపోయి, తన ప్రభువు సన్నిధికి చేరుకుంటాడో అప్పుడు అతని పుణ్య ఫలం అతనికి అపూర్వంగా స్వాగతం పలుకుతుంది. ప్రపసమక్షంలో అతనికి గౌరవస్థానం ఆర్జించి పెడుతుంది.

హదీసు ద్వారా తెలిసే మరో చేదు సత్యం ఏమంటే, ఎవరయితే ధనాన్ని దైవమార్గంలో

https://teluguislam.net

ఖర్చు పెట్టకుండా పిసినిగొట్టుగా మారి ఒక్కొక్క పైసా తన వారసుల కోసం కూడబెడతాడో, అతడు అత్యంత అవివేకి అతనికి అతని వారసుల గురించి చింత ఉందిగాని తన స్వయం గురించిన ధ్యాసే లేదు. పర్యవసానంగా అతను తన పరలోక జీవితాన్ని చేతులారా నాశనం చేసుకుంటున్నాడు. అటువంటి వ్యక్తి తీర్పుదినం నాడు ఘోర పరాభవానికి గురికాక తప్పదని విదితమవుతోంది.

ఇబ్నె బుతాన్ ఇలా అంటున్నారు -

ఈ హదీసులో సత్కార్యాలు మరియు దైవమార్గంలో వీలైనంత అధికంగా ఖర్చు చేయటంపై పురికొల్పటం జరిగింది. అలా చేయటం వల్ల మనిషి పరలోకంలో సఫలీకృతుడవుతాడని దీని ఉద్దేశ్యం. మరణించేవాడు కూడబెట్టిన ప్రతిదీ అతని వారసులకు వెళ్ళిపోతుంది. అదే అతను బ్రతికి ఉండగా సత్యపథంలో, సత్కార్యాలలో ఎంతగా ఖర్చుపెడితే అంతగానే ఆ పుణ్యఫలాన్ని మరణానంతర జీవితంలో అనుభవిస్తాడు. అలా అని, ఐశ్వర్యాన్ని కలిగి ఉండటం తప్పు కూడా కాదు. అయితే దేవుని యెడల అవిధేయతకు ఒడిగడుతూ, పాపకార్యాలలో ఖర్చు పెడుతున్న వ్యక్తి ఎంత కష్టపడి, శ్రమకోర్చి ధనం సంపాదించినా అది అతనికి ప్రయోజనకారి కాబోదు.

జవసత్వాలు ఉడిగిపోకముందే - ఆరోగ్యవంతుడుగా ఉండగానే - దానధర్మాలు చేయటం, ఉపకారాలు చేసుకోవటం మంచిది. కాటికి కాళ్ళు జాపే తరుణంలో ఖర్చు చేయటం వేరు. సఅద్ బిన్ అబీ వఖాస్ (రజిఅన్) గురించి ఒక హదీసులో ఉంది - ఆయన తీవ్రంగా జబ్బుపడ్డారు. మరణకాలం దాపురించిందని ఆయనకు అనిపించింది. అట్టి స్థితిలో దైవప్రవక్త (సఅసం) ఆయన్ని పరామర్శించడానికి ఏతెంచారు. అప్పుడు సఅద్ (రజిఅన్) అన్నారు : "దైవప్రవక్తా! నేను నా ఆస్తి పాస్తులన్నింటినీ దైవమార్గంలో వెచ్చించాలని నిర్ణయించుకున్నాను." మహాప్రవక్త (స) గారు అందుకు అంగీకరించలేదు. దానికి బదులు మూడింట ఒక వంతు సొమ్మును ఖర్చుచేయటానికే అనుమతి ఇచ్చారు. అ తరువాత ఇలా హితబోధ చేశారు - "మూడింట ఒక వంతు ఖర్చుచేస్తే అదే ఎక్కువ. మీరు మీ వారసులను స్థితిపరులుగా వదలి వెళ్ళండి. మీరు వారిని (మీ వారసులను) ప్రజలకు భారంగా వదలిపెట్టటం కంటే ఇదే మీ కొరకు ఉత్తమం. మీరు గనక అలా చేయకపోతే వారు ప్రజల ఎదుట యాచిస్తూ తిరుగుతారు."

ఈ హదీసులోని సారాంశం ఏమిటంటే మరణ సమయంలో సిరిసంపదలన్నింటినీ దానం చేసేసి ఆలు బిడ్డలను అగత్యపరులుగా చేసివేయటం సమ్మతించదగిన విషయం కాదు. అయితే వృద్ధాప్యం రాకముందే, మనిషి ఆరోగ్యంగా ఉండి కష్టపడి సంపాదిస్తున్న రోజుల్లోనే విస్తృతంగా దైవమార్గంలో ఖర్చుపెట్టడం మంచిది. దీనికి భిన్నంగా పిసినారితనం ప్రదర్శించడం, భార్యాబిడ్డలను ఇంకా ఇంకా సుఖపెడదామన్న అత్యాశకుపోయి సంపదను పోగేస్తూ ఉండటం కూడా హర్షణీయం కాదు. ఈ రెండు విపరీత వాదాలకు మధ్య - మధ్యేమార్గాన్ని అవలంబించటం సబబు.

https://teluguislam.net

మనిషి చెమటోడ్చి సంపాదిస్తున్న రోజుల్లో దైవమార్గంలో ఖర్చుపెట్టినప్పుడే పరీక్షలో నెగ్గుకు వచ్చినట్లు లెక్క. మరణ ఘడియలు ఆసన్నమయినప్పుడు మనిషి సహజంగానే దైవం వైపునకు మరలుతాడు. కాని యౌవ్వన ప్రాయంలోనూ, శరీరంలో బలం ఉన్నప్పుడునూ రేయింబవళ్ళు కూడబెట్టే ఆలోచనలో ఉంటాడు. అన్ని పరిస్థితుల లోనూ దైవమార్గంలో ఖర్చు పెట్టాలన్న భావన కలిగి ఉండటమే సిసలయిన విజయం.

అబూజర్ (రజిఅన్) ఉల్లేఖనాన్ని ఇమామ్ బుఖారి (రహ్మాలై) ఇలా ఉటంకించారు: నేను (అబూజర్) ఒక రాత్రి బయటకు వెడలాను. ఆ సమయంలో దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) ఒంటరిగా నడుస్తూ కనిపించారు. ఆయన వెంట మరెవరూ లేరు. తను మరొకరి వెంట నడవటం బహుశా దైవప్రవక్తకు ఇష్టం లేదేమోనని నేను ఊహించాను. నేను చంద్రుని వెన్నెల్లో నడవసాగాను. ఆయన (సఅసం) వెనుదిరిగి నన్ను చూశారు. "ఎవరు?" అని కూడా ప్రశ్నించారు. "అల్లాహ్ నన్ను మీ పేర అర్పించుగాక! నేను అబూజర్‌ని" అని సమాధానమిచ్చాను. "అబూజర్! రండి" అని ఆయన (సఅసం) నన్ను పిలిచారు. నేను ఆయన వెంట కొంతసేపు నడుస్తూనే ఉన్నాను. కాస్సేపు గడిచాక ఆయన (సఅసం) ప్రవచించారు : "ఎక్కువ ఐశ్వర్యం ఉన్నవారే ప్రళయదినాన తక్కువ పుణ్యఫలాన్ని పొందుతారు. అయితే దైవ ప్రసాదితాన్ని పొంది, కుడివైపు నుంచీ, ఎడమవైపు నుంచీ, ముందు నుంచీ, వెనుక నుంచీ దైవమార్గంలో ఖర్చు చేసినవారి సత్కార్యాల కోసం సొమ్మును వెచ్చించిన వారి విషయం వేరు."

కుడి, ఎడమలు, ముందు వెనుకల నుంచీ అంటే ప్రతి మంచి కార్యంలోనూ - అది వ్యక్తిగత స్థాయిలోనయినా, సామూహిక స్థాయిలోనయినా - ఊగిసలాడకుండా, ఉదారంగా, దైవ ప్రసన్నతను బడసే లక్ష్యంతో ఖర్చుచేయటం అని అర్థం. దీని పరలోక పరమార్థాన్ని అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా విశదపరిచాడు :

> **"నమాజ్‌ను నెలకొల్పండి, జకాత్ ఇవ్వండి. అల్లాహ్‌కు ఉత్తమ ఋణం ఇస్తూ ఉండండి. మీరు మీ స్వయం కొరకు దేన్నయితే ముందుగానే చేరవేస్తారో దాన్ని అల్లాహ్ వద్ద పొందుతారు. అతను ఎక్కువ శ్రేష్ఠుడు, గొప్ప ప్రతిఫలం కలవాడు. ఇంకా మీరు అల్లాహ్‌ను క్షమాభిక్ష కోరుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ ఎక్కువగా మన్నించేవాడు, కనికరించేవాడూను."** **(అల్ ముజమ్మిల్ : 20)**

"ముందుగా చేరవేయటం" అంటే భావం దైవమార్గంలో, దైవకార్యాలలో మనస్ఫూర్తిగా ధనం ఖర్చు పెట్టడం. ఈ పద్దులలో ఖర్చుపెట్టినది పరలోకంలోని అతని ఖాతాలో చేరి సురక్షితంగా ఉంటుంది. అతను తన స్వామి సన్నిధికి వెళ్ళినప్పుడు, అతనికి ఎంతగానో ఉపయోగపడుతుంది.

https://teluguislam.net

# 18. విశ్వాసంలోని మాధుర్యం

మానవ మహోపకారి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రబోధించారు : ఎవరిలోనయితే మూడు సుగుణాలు ఉన్నయ్యో అతను విశ్వాసం (ఈమాన్)లోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు. అవేమంటే;

1. ఇతరులందరికంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త అతనికి ప్రియతమమైన వారై ఉండాలి.

2. అతనెవరిని ప్రేమించినా అల్లాహ్ కొరకే ప్రేమించాలి.

3. అగ్నిలో నెట్టివేయబడటమంటే అతనికి ఎంత అయిష్టంగా ఉంటుందో ధిక్కారం (కుఫ్ర్) వైపునకు పోవాలన్నా అంతే అయిష్టత ఉండాలి. (బుఖారి)

ఉల్లేఖకుని పరిచయం

ఈ హదీసును అనస్ బిన్ మాలిక్ (రజిఅన్) ఉల్లేఖించారు. హజ్రత్ అనస్‌గారు దైవప్రవక్త (సఅసం) సేవకులుగా ఉన్నారు. మహాప్రవక్త (స) మదీనాకు హిజ్రత్ చేసివచ్చినప్పుడు ఈయన వయస్సు పది సంవత్సరాలు. ఈయన తల్లి ఈయన్ని దైవప్రవక్తకు సేవలు చేయమని చెప్పి అప్పగించింది. తన కుమారుని వయస్సులో, ఆస్తిపాస్తుల్లో, సంతానంలో వృద్ధి కోసం దైవప్రవక్త (సఅసం) ప్రార్థించాలన్నది ఆమె ఆకాంక్ష. ఆమె మనోరథం ఈడేర్చడానికి మహాప్రవక్త అనస్ కోసం ప్రార్థించారు. ప్రవక్తగారు చేసిన ప్రార్థనా ఫలితంగా హజ్రత్ అనస్‌కు ఇతర సహాబాల కన్నా ఎక్కువ మంది పిల్లలు పుట్టారు. ఈయన తోట ఏడాదిలో రెండుసార్లు పండేది. అయితే ఈ వృద్ధి వికాసాలతో ఝంజాటాలతో తాను విసిగెత్తి పోయానని, దేవుని సన్నిధి కొరకు నిరీక్షిస్తున్నానని అనస్ అంటూ ఉండేవారు. హిజ్రీ శకం 93లో ఆయన బస్రాలో కన్నుమూశారు. అప్పటికి ఆయనకు నూరేళ్ళు పైబడ్డాయి.

## వివరణ

ఈ హదీసులో మహనీయ ముహమ్మద్ 'విశ్వాసం' లోని ఉన్నత శ్రేణిని గురించి వివరించారు. పైగా దీన్ని విశ్వాసంలోని మాధుర్యంగా, తీపిగా అభివర్ణించటం జరిగింది. ఎందుకంటే తియ్యదనాన్ని మానవ నైజం కూడా వాంఛిస్తుంది. షేఖ్ అబ్దుర్రహ్మాన్ బిన్ హసన్ "ఫతహ్ అల్ మజీద్"లో ఇలా అభిప్రాయపడ్డారు : "ఇక్కడ తీపి అనేది అభిరుచికి తార్కాణం. దైవధర్మాన్ని అవలంబించటం వల్ల ప్రాప్తమయ్యే తృప్తి, ఆనందం, ప్రశాంతతలకు ఇది ప్రతీక. వాస్తవానికి నిష్కల్మష విశ్వాసం ఉన్నవారే ఈ దివ్యానుభూతికి లోనవుతారు.

https://teluguislam.net

'విశ్వాసంలోని తీపి'ని గురించి నవవి (రహ్మలై) ఏమంటున్నారో చూడండి : దైవ విధేయతలో, భక్తిపారవశ్యాలలో లీనమైపోయి తాదాత్మ్యం చెందటం, దైవప్రవక్త ప్రసన్నతను చూరగొనే మార్గంలో కష్టాలు కడగండ్లను ఆహ్వానించి ఓర్పుతో భరించటమే విశ్వాసంలోని తీపికి నిదర్శనం.

విశ్వాసం యొక్క ఈ ఉన్నత స్థానం ప్రాప్తమయ్యేదెలా? దైవప్రవక్త (సఅసం) ఈ విషయమై మూడు షరతులను పేర్కొన్నారు.

ఇమామ్ ఇబ్నె తైమియ (రహ్మలై) ఏమన్నారంటే, తృప్తికి, ఆనందానికి ప్రతీక అయిన విశ్వాస మాధుర్యం, దాసుడు తన ప్రభువును అమితంగా ప్రేమించినపుడే ప్రాప్తిస్తుంది. ఈ అమితమయిన ప్రేమ మూడు విషయాలతో పెనవేసుకుని ఉంది. ఒకటి, ఆ ప్రేమ పరిపూర్ణతను సంతరించుకోవటం. రెండు, దాని ప్రభావం దాసునిపై పడటం. మూడు, దానికి హాని చేకూర్చగల వస్తువులకు, విషయ లాలసకు దూరంగా ఉండటం.

ప్రేమ పరిపూర్ణతను సంతరించుకోవటం అంటే మతలబు దాసుడు ఇతరులందరి కన్నా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను ప్రేమించాలి. ఆ ప్రేమ అతనిపై ఎంత గట్టి ప్రభావం వేయగలగాలంటే, అతను ఎవరిని అభిమానించినా, ఎవరిని సమర్థించినా, ఎవరికి తోడ్పడినా అది అల్లాహ్ కోసమే అయి ఉండాలి. తనలోని ఈ సదమరవర్తనను, సాధుశీలాన్ని అపహరించే సమస్త వస్తువులను, అలవాట్లను అతను మానుకోవటమే గాకుండా వాటికి బహుదూరంగా మసలుకోవాలి. అంతేకాదు, ఆయా చెడు సాధనాలను మనసులో అసహ్యించుకోవాలి. తనను ఎవరయినా అగ్ని గుండంలో పడవేయజూస్తే ఎంతగా భయాందోళన చెందుతాడో అంతే భయాందోళన ఆ హానికరమయిన సాధనాల పట్ల కూడా చెందాలి.

"ఇతరులందరికంటే అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త అతనికి ప్రియతమమైన వారై ఉండాలి" అనే హదీసులోని అంశం ప్రత్యేకంగా గమనించదగినది. ఈ నేపథ్యంలో హాఫిజ్ ఇబ్నె హజర్ ఏమంటున్నారో చూడండి : తమ విశ్వాసం పరిపూర్ణతను సంతరించుకోవాలని కాంక్షించేవారు, తమ తల్లిదండ్రుల, భార్యాభర్తల, సమస్త జనుల హక్కుల కన్నా తమపై అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తకు ఎక్కువ హక్కులున్నాయని తెలుసుకుంటారు. ఎందుకంటే మార్గ విహీనతకు గురై ఉన్న తమకు సన్మార్గం లభించినా, నరకాగ్ని నుండి విముక్తి కలిగినా అది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త మూలంగానే కదా!"

దివ్య గ్రంథంలోనూ ఆ విషయమే నొక్కి వక్కాణించబడింది :

https://teluguislam.net

"ఓ ప్రవక్తా! అనండి, 'ఒకవేళ మీ తండ్రులు, మీ కుమారులు, మీ సోదరులు, మీ భార్యలు, మీ బంధువులు మరియు ఆత్మీయులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయని మీరు భయపడే మీ వ్యాపారాలు, మీరు ఇష్టపడే మీ గృహాలు మీకు గనక అల్లాహ్, ఆయన ప్రవక్త మరియు ఆయన మార్గంలో జిహాద్ చేయటం కంటే ఎక్కువ ప్రియతమమైతే అల్లాహ్ తన తీర్పును మీ ముందుకు తీసుకువచ్చే వరకు నిరీక్షించండి. అల్లాహ్ హద్దులు మీరే వారికి మార్గం చూపడు." (అత్ తౌబా: 24)

మనిషికి అత్యంత ప్రీతికరమైన ఎనిమిది అంశాలను అల్లాహ్ పై ఆయత్‌లో ప్రస్తుతించాడు. వాటి ప్రేమలో పడిపోయిన కారణంగానే మనిషి దైవనామ స్మరణపట్ల అలసత్వం, అశ్రద్ధ చూపుతాడు. అందుకే, మనిషి హృదయంలో గనక ఆ ఎనిమిది అంశాలు లేదా వాటిలో ఏ ఒక్కదానిపైనయినా సరే అల్లాహ్ పట్ల కన్నా ఎక్కువ ప్రేమ ఉంటే వ్యధాభరితమయిన శిక్షకు గురవుతాడని హెచ్చరించటం జరిగింది. అటువంటి వారు దుర్మార్గుల్లో కలసిపోతారు (దైవం మన్నించుగాక!)

అల్లాహ్‌పట్ల, ఆయన ప్రవక్త పట్ల అపారమయిన ప్రేమ ఉందని ఊరకే చెప్పుకుంటూ తిరిగితే సరిపోదు. దాన్ని క్రియాత్మకంగా చాటిచెప్పాలి. దేవుడు మరియు దైవప్రవక్త పట్ల ఎవరికెంత ప్రేమ ఉన్నదీ నిజానికి దైవాజ్ఞాపాలన ద్వారానే తెలుస్తుంది. దైవాజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటిస్తూ, అడుగడుగునా భయభక్తులతో జీవించే వాడే యదార్థానికి దైవసామీప్యం పొందగలుగుతాడు. తన స్వామి దేన్ని ఇష్టపడతాడో, మరి దేన్ని ఇష్టపడడో ఆ సామీప్య భాగ్యంతోనే గ్రహిస్తాడు. తనను సృష్టించిన ప్రభువు ప్రసన్నత చూరగొనాలంటే, అంతిమ దైవప్రవక్తకు విధేయత చూపటం కూడా అవసరమన్న సత్యాన్ని గుర్తిస్తాడు.

అల్లాహ్ సెలవిచ్చాడు -

"ప్రవక్తా! మీరు ప్రజలకు చెప్పండి, 'మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే, నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అనన్యంగా కరుణించేవాడు కూడాను." (ఆలి ఇమ్రాన్ : 31)

అల్లాహ్ పట్ల తనకు ప్రగాఢమైన ప్రేమ ఉందని పలికే ప్రతి ఒక్కరికీ ఈ ఆయత్ నిర్ణయాత్మకమైనదని ఇబ్నె కసీర్ (రహ్మాలై) వ్యాఖ్యానించారు. ఆయన ఇంకా ఇలా వ్రాశారు : ఎవరయితే అల్లాహ్ యెడల తనకు ప్రేమ ఉందని చాటుకుంటాడో, అలా చాటుకుంటూ ముహమ్మద్ (సఅసం) గారి పద్ధతి ప్రకారం నడవడో అతను

https://teluguislam.net

అసత్యవాది. మనోవాక్కాయ కర్మలచేత అతను ముహమ్మద్ చూపిన షరీఅత్‌ను అనుసరించనంత వరకూ అబద్ధాలకోరుగానే పరిగణించబడతాడు.

సహీహ్ హదీస్‌లో మహాప్రవక్త (సఅసం) ప్రవచనం ఒకటి ఇలా ఉంది - "నేను ఆచరించని పనిని ఎవరయినా చేస్తే అతను ధూర్తాకారి అవుతాడు."

ఏ వ్యక్తయినా తనకు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పట్ల గల ప్రేమ పరిమాణాన్ని కొలచుకోదలుస్తే, ఖుర్ఆన్ మరియు హదీసుల గీటురాయిపై అతను తన జీవితాన్ని పరీక్షించి చూసుకోవాలి. ఒకవేళ తన దైనందిన జీవితం షరీఅత్‌కు అనుగుణంగా ఉందని తెలిస్తే దేవుని పట్ల, దైవప్రవక్త పట్ల ప్రేమ చెక్కుచెదరకుండా ఉన్నట్లే లెక్క. అదే అతని ఆచరణ గనక దివ్య గ్రంథం మరియు ప్రవక్త సంప్రదాయం పరిధుల్లో లేదని తేలితే దేవునిపట్ల, దైవ ప్రవక్త పట్ల తనలో ప్రేమభావం లేదని అనుకోవాలి. అప్పుడతని ప్రథమ కర్తవ్యం ఏమంటే, తన జీవితాన్ని దైవాదేశాల పరిధిలో, దైవప్రవక్త సంప్రదాయం వెలుగులో మలచుకోవటానికి ప్రయత్నించటం.

"ఎవరిని ప్రేమించినా అల్లాహ్ కొరకే ప్రేమించాలి" : దైవప్రవక్తలు, సద్వర్తనులైన ప్రజలు, విశ్వాసులను ప్రేమించటం దైవం యెడల ప్రేమకు ప్రతిరూపం. వారిని ప్రేమించటానికి కారణం అల్లాహ్ వారిని ప్రేమించటమే! అల్లాహ్ దీవెనలు, సహాయం వారికి ఉండటం మూలంగానే!!

అయితే విశ్వాసులయిన మంచివారి పట్ల ఒక వ్యక్తికి గల ఈ ప్రేమాభిమానం 'షిర్క్' (బహుదైవోపాసన) కానేరదు. మంచి వారిని ప్రేమించినంత మాత్రాన అల్లాహ్ యెడలగల ప్రేమను విస్మరించినట్లుకాదు. ప్రేమించేవాడు, తన ప్రభువు వారిని ప్రేమిస్తున్నాడు గనకనే తనూ ప్రేమిస్తున్నాడు. ప్రభువు ఎవరిని ఇష్టపడటం లేదో వారిని తనూ ఇష్టపడటం లేదు. తన ప్రభువు స్నేహం చేసిన వారితోనే తనూ సావాసం చేస్తున్నాడు. తన ప్రభువు పట్ల శత్రుభావం కనబరుస్తున్న వారిని తనుకూడా తన శత్రువులుగా పరిగణిస్తున్నాడు. తన ప్రభువు తనతో ప్రసన్నుడయితే పరమానంద భరితుడవుతాడు. తన ప్రభువు ఆగ్రహిస్తే ఆందోళనతో కుమిలిపోతాడు. తన ప్రభువు దేన్ని ఆజ్ఞాపించాడో దాన్నే తనూ ఇతరులకు ఆజ్ఞాపిస్తాడు. తన ప్రభువు వేటి జోలికి పోరాదని చెప్పాడో వాటి విషయంలో ప్రజలను అప్రమత్తం చేస్తాడు. ఒక్క మాటలో చెప్పాలంటే అతను ఎట్టి పరిస్థితుల్లోనూ తన ప్రభువు విధేయతలోనే ఉంటాడు.

భయభక్తులు గల దాసులను, పశ్చాత్తాపం చెందేవారిని, పరిశుద్ధతను అవలంబించే వారిని, సౌశీల్యవంతులను, ఏకాగ్రతతో ఆరాధనలు చేసేవారిని అల్లాహ్ ఇష్టపడతాడు. కాబట్టి మనం కూడా అటువంటి వారిని - అల్లాహ్ ఇష్టపడుతున్నందున - ఇష్టపడాలి.

https://teluguislam.net

స్వామి ద్రోహానికి పాల్పడే వారిని, తలబిరుసుతనం ప్రదర్శించే వారిని, కల్లోలాన్ని రేకెత్తించేవారిని అల్లాహ్ ఇష్టపడడు. కాబట్టి అటువంటి దుర్మార్గులను మనం కూడా అసహ్యించుకోవాలి - ఒకవేళ వారు మన సమీప బంధువులైనప్పటికీ వారికి దూరంగానే మసలుకోవాలి.

"అగ్నిలో నెట్టివేయబడటమంటే ఎంత అయిష్టమో కుఫ్ర్ (ధిక్కారం) వైపునకు పోవాలన్నా అంతే అయిష్టత ఉండాలి."

మనిషిలో ఈమాన్ (విశ్వాసం) యెడల ఎంత ప్రగాఢమైన ప్రేమ ఉండాలంటే, దానికి విరుద్ధాంశమయిన కుఫ్ర్ (అవిశ్వాసం)ను, కుఫ్ర్ వైపునకు లాక్కుపోయే వస్తువులను తలచుకోగానే అతనిలో అసహ్యం, ఏవగింపు కలగాలి. అవిశ్వాస వైఖరిని అతను ఎంతగా ద్వేషిస్తాడో అతనిలో ఈమాన్ అంతే దృఢంగా ఉన్నట్లు లెక్క. మహాప్రవక్త ప్రియ సహచరులను గురించి అల్లాహ్ అంతిమ గ్రంథంలో ఇలా పేర్కొన్నాడు :

**"మీ మధ్య దైవప్రవక్త ఉన్నారన్న సంగతిని బాగా తెలుసుకోండి. ఒకవేళ ఆయన అనేక వ్యవహారాలలో మీరు చెప్పినట్లుగా వింటే, మీరే స్వయంగా నష్టపోతారు. అయితే అల్లాహ్ విశ్వాసాన్ని మీకు ప్రీతికరం గావించాడు. ఇంకా దాన్ని మీ మనసుల్లో సమ్మతమైనదిగా చేశాడు. అవిశ్వాసం, అపచారం, అవిధేయతలను ద్వేషించే వారుగా చేశాడు. సన్మార్గం పొందేది ఇటువంటివారే."**

**(అల్ హుజురాత్ : 7)**

అవిశ్వాసం, అపరాధం, అవిధేయత అంటే ప్రవక్త సహచరులలో ద్వేషం రగుల్కొనేది. తమలోని ఈ సుగుణం మూలంగానే వారు సన్మార్గ భాగ్యం పొందారు.

ఈ హదీసు ద్వారా బోధపడిన మరో సత్యం ఏమంటే, విశ్వాసం (ఈమాన్)లో పలు అంతస్థులు ఉన్నాయి. ఒకరిలో విశ్వాసం పరిపూర్ణంగా ఉంటే, మరొకరిలో అసంపూర్ణంగా ఉంటుంది. దైవారాధన, దైవ నామస్మరణ వల్ల విశ్వాసి హృదయం నెమ్మదిస్తుంది. మనసు ప్రశాంతతను, సంతృప్తిని పొందుతుంది. ఈ ఉన్నత స్థానం కేవలం కుఫ్ర్‌కు దూరంగా ఉండటంతోనే ప్రాప్తించదు. కుఫ్ర్‌ను ద్వేషించినపుడే ప్రాప్తిస్తుంది.

https://teluguislam.net

# 19. దైవప్రవక్త (సఅసం) సంప్రదాయం

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ కథనం ప్రకారం ముగ్గురు మనుషులు మహాప్రవక్త (సఅసం) గారి ధర్మపత్నుల ఇళ్ళకు వచ్చి మహాప్రవక్త (సఅసం) గారి ఆరాధనల గురించి వివరాలు అడిగి తెలుసుకోసాగారు. వారికా వివరాలు తెలుపగా, అవి కొద్దిగేనని వారనుకున్నారు. తరువాత వారిలా అనసాగారు : "మహాప్రవక్త ఎక్కడా? మేమెక్కడ? ఆయన (సఅసం) యొక్క ముందూ వెనుకటి పారపాచ్చాలన్నీ క్షమించబడ్డాయి." తరువాత వారిలో ఒకరు - "నేను ఇకనుండి రాత్రంతా నమాజ్‌లోనే గడుపుతాను" అని అంటే, మరొకరు, "నేను నిత్యం ఉపవాసం పాటిస్తాను, ఏ ఒక్క రోజు కూడా ఉపవాసం మానను" అన్నారు. ఇంకొకరు, "నేను స్త్రీలకు దూరంగా ఉంటాను, అసలెప్పుడూ వివాహమే చేసుకోను" అని ఖండితంగా చెప్పారు. మహాప్రవక్త (సఅసం) వారు ఈ విషయం తెలుసుకుని ఇలా ప్రబోధించారు : "మీరీ విధంగా అంటున్నారు. వినండి - దైవసాక్షిగా! నేను మీకన్నా అధికంగా దైవానికి భయపడేవాడిని. అయితే నేను ఉపవాసం పాటిస్తాను, విరమిస్తాను కూడా. నమాజ్ చేస్తాను, నిద్రపోతాను కూడా. ఇంకా స్త్రీలను కూడా వివాహమాడతాను. ఎవరు నా విధానం పట్ల విసుగెత్తాడో అతనితో నాకెట్టి సంబంధం లేదు." (బుఖారి)

హదీసు వివరణ

(1) "ముగ్గురు మనుషులు మహాప్రవక్త (సఅసం) గారి ధర్మపత్నుల ఇళ్ళకు వచ్చారు." ఆ ముగ్గురు ఎవరెవరో "ముస్నద్ అబ్దుర్రజాఖ్"లో పేర్కొనడం జరిగింది. వారిలో ఒకరు అలీ బిన్ అబీతాలిబ్, మరొకరు అబ్దుల్లాహ్ బిన్ ఉమ్రె బిన్ ఆస్, ఇంకొకరు ఉస్మాన్ బిన్ మజ్‌ఊన్ (ర.అన్‌హుమ్)లు.

(2) "మహాప్రవక్త (సఅసం) ఆరాధనల గురించి వారు వివరాలు అడిగి తెలుసుకోసాగారు" అంటే భావం, దైవప్రవక్త రాత్రిపూట చేసే తహజ్జుద్ నమాజ్, వేడుకోలు (దుఆ) మరియు నఫిల్ రోజా (అదనపు ఉపవాసం)ల గురించి తెలుసుకోదలచారన్నమాట.

(3) "అది కొద్దిగేనని వారనుకున్నారు." ఆరాధనపట్ల ప్రవక్త ప్రియ సహచరుల మక్కువకు ఇది తార్కాణం. మహాప్రవక్త అందరికన్నా ఎక్కువగా దైవధ్యానంలో గడిపేవారు. ఆయన (స) అర్ధరాత్రి తహజ్జుద్ నమాజ్‌లో గడిపితే, నెలలో సగం రోజులు నఫిల్ ఉపవాసాలు పాటించేవారు. ఇక మిగిలిన సమయాలలో కూడా

https://teluguislam.net

ఆయన దైవనామస్మరణలో దైవస్తోత్రంలో, ప్రాయశ్చిత్తంలో గడిపేవారు. అయినప్పటికీ ఇదంతా తక్కువేనని ప్రవక్త సహచరులు తలపోశారు.

(4) "మహాప్రవక్త ఎక్కడా మేమెక్కడా?" అని వారు పోల్చుకోవటంలోని ఉద్దేశ్య మేమంటే, మహాప్రవక్త పాపమెరుగనివారు. కాగా, తాము లోపాలకు నిలయమైనవారు. తాము సామాన్య మానవులైతే, ఆయన (స) గారు దైవప్రీతిని చూరగొన్న ప్రవక్తాయే. (కనుక) ఆయన (సఅసం) గారు చేసేటంతటి ఆరాధన, ఉపాసనలు తమ స్థాయికి సరిపోవు. తాము మరిన్ని ఎక్కువ ఆరాధనలు చేస్తేనేగాని తమకు దైవప్రసన్నత లభించదు అని వారు తలపోశారు.

(5) "అల్లాహ్ ఆయనగారి ముందు వెనుకటి పొరబాట్లను మన్నించాడు." అంటే ప్రవక్తగారు పాపాల జోలికి పోనివారు. నిరపరాధులు. ఒకవేళ ఆయనచేత ఏదయినా పొరబాటు జరిగిపోతే అల్లాహ్ ఆయన్ని క్షమించివేశాడు. ఆ మన్నింపు ప్రకటన ఖుర్ఆన్‌లో ఉంది.

> **"(ఓ ప్రవక్తా!) అల్లాహ్ మీ యొక్క మునుపటి వెనుకటి అపరాధాలను మన్నించాడు. మీపై తన కరుణానుగ్రహాన్ని పూర్తిచేశాడు. ఇంకా మీకు రుజుమార్గం చూపాడు." (అల్ ఫతహ్ : 2)**

(6) "నేనయితే ఇకనుండి రాత్రంతా నమాజ్‌లోనే గడుపుతాను" అంటే ఒక్క క్షణం కూడా రాత్రిని వృధా పోనివ్వను. నిద్రపోను. అనునిత్యం ఇలాగే చేస్తాను అని ఆ సహాబి కృతనిశ్చయం చేసుకున్నారు. రాత్రిపూట తియ్యటి నిద్రను త్యజించి తన స్మరణలో గడిపేవారి గురించి అల్లాహ్ తన గ్రంథంలో ఇలా వర్ణించాడు :

> **"వారి వీపులు పడకలకు వేరుగా ఉంటాయి. వారు తమ ప్రభువును అత్యంత ఆశతోను, భయభక్తులతోను వేడుకుంటారు. మేము వారికి ప్రసాదించిన దాంట్లోంచి ఖర్చుచేస్తారు. వారి ఆచరణలకు ప్రతిఫలంగా ఎంత ఎక్కువ, మరెంత ఉత్తమ సామగ్రి - వారి కళ్ళకు చలువను ప్రసాదించే సామగ్రి - భద్రపరచబడి ఉందో ఎవరికీ తెలియదు." (సజ్దా : 16, 17)**

పై ఆయత్‌లలో రాత్రిపూట అత్యంత ప్రీతికరమైన నిద్రను త్యాగం చేసి దైవధ్యానంలో నిలబడి, ఆయన్ని ఆశతో వేడుకున్న వారికి శుభవార్త ఇవ్వబడింది. అలా అని రేయంతా నిద్రపోకుండా అస్తమానం నమాజ్‌లోనే, దైవనామస్మరణలోనే గడపమని భావం ఎంతమాత్రం కాదు. కరుణామయుడయిన అల్లాహ్ తన అంతిమ ప్రవక్తను ఉద్దేశించి ఖుర్ఆన్‌లో ఇలా అన్నాడు :

https://teluguislam.net

"ఓ (దుప్పటి) కప్పుకుని నిదురించేవాడా! రాత్రిపూట నమాజ్‌లో నిలబడు. అయితే కొద్దిగా, లేదా సగం రాత్రి లేదా దానికన్నా కొంచెం తక్కువ సేపు ధ్యానించు. లేక దానికంటే ఇంకొంచెం ఎక్కువసేపు (నమాజ్ చేయి). ఇంకా, ఖుర్‌ఆన్‌ను బాగా ఆగి ఆగి మరీ పఠించు." (అల్ ముజమ్మిల్ : 1 - 4)

పై ఆయత్‌లలో, రాత్రి సాంతం నమాజ్‌లో గడపాలని అనబడలేదు. ఒక్కొక్కప్పుడు కొంతసేపు, మరొకప్పుడు సగం రాత్రి, ఇంకొకప్పుడు అంతకన్నా ఎక్కువ సమయం వీలునుబట్టి, శక్తినిబట్టి ఆరాధనలో గడపమని మాత్రమే నిర్దేశించడం జరిగింది. దేవుడు తన ప్రవక్తకు ఇచ్చిన ఆదేశమే ప్రవక్త అనుయాయులకు కూడా వర్తిస్తుంది. అంతేగాని అందులో మరింత విపరీతానికి పోయి, తమ శరీరంపై మోతాదుకు మించిన భారం వేసి అనర్థాన్ని కొనితెచ్చుకోవలసిన అవసరం లేదని, మనిషి ఎప్పుడూ రెండు తీవ్ర వాదాలకు నడుమ మధ్యే మార్గాన్ని అనుసరించాలని బోధపడుతోంది.

(7) "నేను నిత్యం ఉపవాసం పాటిస్తాను" అంటే ప్రతి రోజూ నాగాలేకుండా ఉపవాసం పాటిస్తాను. అలా చేయటం వల్ల కామవాంఛలు అణగారిపోయి అంతర్యం పూర్తిగా అదుపులోకి వస్తుంది అని, అప్పుడే ప్రభువు ప్రసన్నత తనకు ప్రాప్తమవుతుందని ఆ సహాబి ఉద్దేశ్యం. అల్లాహ్ ఉపవాసి కొరకు విరివిగా ప్రతిఫలం సిద్ధం చేసి ఉంచాడు. మహనీయ ముహమ్మద్ వీలయినన్ని ఎక్కువ నఫిల్ రోజాలను పాటించేవారు. అన్నింటికన్నా అత్యుత్తమమయిన ఉపవాసం దావూద్ (అలైహిస్సలాం) గారి ఉపవాసం అని, ఆయన (అస్సలాం) ఒకరోజు ఉపవాసం ఉండేవారని, ఆ మరునాడు ఉపవాసాన్ని విడనాడే వారని అంతిమ దైవప్రవక్త ప్రవచించారు. ప్రతిరోజూ నఫిల్ రోజాలు పాటించరాదని కూడా ఆయన నొక్కి చెప్పారు.

(8) "నేను స్త్రీలకు దూరంగా ఉంటాను. అసలెప్పుడూ వివాహమే చేసుకోను." వివాహమాడటం వలన, భార్య సాంగత్యం వలన పురుషుడు దైవాన్ని విస్మరిస్తాడని, భార్యను సుఖపెట్టడంలోనే నిమగ్నుడవుతాడని ఆ విధంగా అతను దైవాగ్రహానికి గురయ్యే ప్రమాదముందని సదరు సహాబి భావించారు. అందుచేత వివాహానికి, సంసార జంఝాటాలకు దూరంగా ఉండాలని ఆయన తలపోశారు. అయితే ఇదికూడా విపరీతమయిన పోకడే.

(9) "మీరీ విధంగా అంటున్నారు" మహాప్రవక్త (సఅసం) ఒక ప్రసంగంలో ఆ ముగ్గురు సహచరుల పేర్లు ప్రస్తావించకుండా 'మీలో కొందరు ఇలా అంటున్నారు' అని సాధారణంగా విషయాన్ని ప్రస్తుతించి, ఆ విపరీత పోకడను ఖండించారని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది.

https://teluguislam.net

(10) "దైవసాక్షి! నేను మీ అందరికంటే ఎక్కువగా దైవానికి భయపడేవాడిని."

మహాప్రవక్త గారు ప్రమాణం చేసి మరీ తాను దైవభీతిపరుడినని ప్రకటించుకున్నారు. అవసరమయితే - ఎదుటివారిని మార్గభ్రష్టత నుంచి కాపాడే లక్ష్యంతో - మనిషి తనలోని సుగుణాన్ని చాటుకోవటం సబబేనని దీనిద్వారా విదితమయ్యింది. మహాప్రవక్త అపరాధాలను అల్లాహ్ క్షమించివేసినందున ప్రవక్త గారు ఎక్కువసేపు దైవారాధనలో గడపటం లేదేమోనని, తాము సామాన్యులమైనందున మరింత ఎక్కువ సాధన చేయవలసి ఉంటుందని ఆ ముగ్గురు సహచరులు ఊహించుకున్నారు. వాస్తవానికి వారి ఊహ సరైంది కాదు. అందుకే రసూలుల్లాహ్ గారు, తాను అందరికన్నా అధికంగా దైవానికి భయపడేవాడినని ప్రకటించుకోవలసి వచ్చింది.

(11) "నేను ఉపవాసం పాటిస్తాను. విరమిస్తాను కూడా." అంటే నెలలో కొన్ని రోజులు ఉపవాసం ఉంటాను. కొన్ని రోజులు ఉండను అని దీని భావం. అదేవిధంగా రాత్రిపూట కొంత సమయం దైవారాధనలో గడుపుతాను. మరికొంతసేపు విశ్రమిస్తాను. ఎందుకంటే, మనిషి తన శరీరానికి విశ్రాంతినివ్వటం అవసరం. అలాగే స్త్రీలను వివాహమాడతాను. వారితో ధర్మసమ్మతమైన సంబంధం కలిగి ఉంటాను. ఇదే అసలు అల్లాహ్ సమ్మతించి ఆమోద ముద్రవేసిన మధ్యేమార్గం.

(12) "ఎవరు నా విధానం పట్ల విసుగెత్తాడో అతనితో నాకెట్టి సంబంధం లేదు."

ఇక్కడ 'విధానం' అంటే భావం ప్రవక్త గారు నెలకొల్పిన సంప్రదాయం (సున్నత్). అన్నపానీయాలు, వివాహాది శుభకార్యాలు, లావాలేవీలు మొదలగు విషయాలు ప్రత్యేకంగా ఆరాధన కోవలోకి రావు. అయినా ఇవన్నీ మహాప్రవక్త గారి విధానం, ఆయన ప్రవేశపెట్టిన షరీఅత్‌లో ముఖ్యమైన విషయాలే. ఏ విధంగానయితే ఆరాధన విషయంలో దైవప్రవక్త పద్ధతిని అనుసరిస్తామో, అదేవిధంగా జీవితపు అన్ని విభాగాలలోనూ ప్రవక్త గారిని ఆదర్శంగా తీసుకోవాలి. ప్రవక్తగారి విధానం పట్ల విముఖతను ప్రదర్శించటం వాస్తవానికి సత్యధర్మం పట్ల విముఖతకు, తిరుగుబాటుకు ఆనవాలు వంటిది. ప్రవక్త గారి సంప్రదాయాన్ని త్రోసిరాజని ఇతర విధానాలను అవలంబించటం ముస్లిమైన ఏ ఒక్కడికీ తగదు. ఒకవేళ ఎవరయినా అలా చేశాడంటే అతను సాఫల్యమార్గం తప్పిపోయి, ధర్మభ్రష్టుడై పోయాడన్నమాట. అటువంటి వ్యక్తితో ప్రవక్త అనుచర సమాజానికి సంబంధం లేదు.

ఒకవేళ ఏ ముస్లిమయినా, అనివార్య పరిస్థితిలో ప్రవక్తగారి ఏ సున్నత్‌నయినా పాటించలేకపోతే అది వేరే విషయం. అయితే పాటించే వీలుండి కూడా

https://teluguislam.net

ఉద్దేశ్యపూర్వకంగా పాటించకపోతే ప్రవక్త సంప్రదాయం పట్ల అతనిలో విసుగు పుట్టిందని అనుకోవలసి ఉంటుంది.

ఈ హదీసులో ప్రవక్తగారి జీవిత విధానం ఎటువంటిదో స్పష్టమయ్యింది. రాత్రంతా - ఎల్లప్పుడూ - నిద్రపోకుండా ఆరాధనలో గడిపేవాడు కూడా మహాప్రవక్త విధానాన్ని విస్మరించాడు. అలాగే రాత్రంతా దుప్పటి తన్నిపట్టి పడుకొని, దైవాన్ని అసలు స్మరించని వాడు కూడా ప్రవక్త విధానాన్ని విస్మరించాడు. ప్రతిరోజూ ఉపవాసం పాటించేవాడు కూడా ప్రవక్త సంప్రదాయాన్ని ఖాతరు చేయటం లేదు. అలాగే నఫిల్ రోజా అసలెన్నడూ పాటించని వాడు కూడా ప్రవక్త నెలకొల్పిన సున్నత్‌ను గౌరవించటం లేదు. అదేవిధంగా ఎవరయినా భార్యతో శాశ్వతంగా లైంగిక సంబంధం త్రెంచుకుంటే, లేదా పెళ్ళి చేసుకోకుండా ఉండిపోతే అది కూడా ప్రవక్త సంప్రదాయానికి విరుద్ధమే. అలాగే ఎవరయినా భార్య పొందులో మునిగిపోయి ఆరాధనలను బొత్తిగా విస్మరిస్తే అదికూడా ప్రవక్త సంప్రదాయానికి విరుద్ధమే.

దైవప్రవక్త సంప్రదాయంలోనే మన శ్రేయోసాఫల్యాలు ఉన్నాయి. దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

> **"యదార్థానికి మీ కొరకు దైవప్రవక్త (విధానం)లో అత్యుత్తమ ఆదర్శం ఉంది – అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసించే, అల్లాహ్‌ను ఎక్కువగా స్మరించే ప్రతి వ్యక్తికై (ప్రవక్త ఆదర్శప్రాయులు)." (అల్ అహ్‌జాబ్ : 21)**

అల్లాహ్‌ను, అంతిమదినాన్ని విశ్వసించే ప్రతి వ్యక్తి ప్రవక్త ఆచరణా పద్ధతిని అనుసరించాలని పై ఆయత్‌లో ఉపదేశించటం జరిగింది. ఇస్లాంలో సన్యాసత్వానికి తావులేదని కూడా పై చర్చ ద్వారా రూఢీ అవుతోంది.

ప్రవక్త సహచరులు తీర్పుదిన సాఫల్యాన్ని దైవ ప్రసన్నతను పొందే లక్ష్యంతో దైవప్రవక్త ఆచరణను అడుగడుగునా ఆదర్శంగా తీసుకోవటానికి పరితపించేవారని, దానికిగాను వారు విశ్వాసుల మాతలయిన ప్రవక్త ధర్మపత్నుల వద్దకు సయితం వచ్చి ప్రవక్త ఆచరణను గురించి అడిగి తెలుసుకునేవారని హదీసు ద్వారా స్పష్టమవుతోంది. అటువంటి తహ తహ మనలో కూడా ఉండాలి. ప్రవక్త దినచర్యను గురించి మనం తెలుసుకోవాలంటే హదీసు గ్రంథాలను ఎక్కువగా అధ్యయనం చేయాలి. మహాప్రవక్త సంప్రదాయానికి విరుద్ధమయిన మరే ఆచరణ అయినాసరే దానివల్ల వృథా శ్రమ తప్ప మరేమీ ప్రాప్తం కాదు.

https://teluguislam.net

# 20. ప్రవక్త (సఅసం) యెడల ప్రేమ

దైవప్రవక్త (సఅసం) ప్రవచించారని హజ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు : "మనిషికి తన భార్యాబిడ్డలకంటే, తన సొంత సొమ్ముకంటే, తన వారికంటే ఎక్కువగా నేను ప్రియమైనవాడ్ని కానంతవరకూ అతను విశ్వాసి (మోమిన్) కాలేడు." (ముస్లిం)

ఈ హదీసులో "విశ్వాసం" యొక్క ఉన్నతమయిన స్థితి వివరించబడింది. పరలోక సాఫల్యం పొందాలంటే అటువంటి ఉన్నతస్థితికి విశ్వాసం చేరుకోవాలి. అంటే మనం మన స్వయంపై దైవప్రవక్తకే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. మనకు మన ప్రాణం కన్నా దైవప్రవక్త ప్రాణమే ప్రీతికరం కాగలగాలి. ఒకసారి హజ్రత్ ఉమర్ మహాప్రవక్తను ఉద్దేశించి, "ఓ దైవప్రవక్తా! నా ప్రాణం తప్ప మిగతా అన్ని విషయాలకన్నా మీరే నాకు ప్రియమైన వారు" అని అన్నారు. దానికి ఆయన (సఅసం), "లేదు, ఎవరి అధీనంలో నా ప్రాణం ఉందో అతని సాక్షిగా చెబుతున్నాను - నేను మీకు మీ ప్రాణం కన్నా ఎక్కువ ప్రియతమం కానంత వరకూ మీరు విశ్వాసి కాలేరు" అని పలికారు. ఉమర్ (రజిఅన్) అన్నారు : "ఇప్పుడు నాకు మీరు నిశ్చయంగా నా ప్రాణం కన్నా ఎక్కువగా ప్రీతికరమైన వారు." దానికి ఆయన (సఅసం), "అయితే ఉమర్! ఇప్పుడు మీరు విశ్వాసులు" అన్నారు. (బుఖారి)

సహచరులు మహాప్రవక్త యెడల అమితమయిన ప్రేమాభిమానం కలిగి ఉండేవారు. చారిత్రక గ్రంథాలు, హదీసు గ్రంథాలే దీనికి నిదర్శనం. హిజ్రత్ సందర్భంగా హజ్రత్ అబూబకర్ (రజిఅన్) మహాప్రవక్తకు చేసిన సేవలను గురించి ప్రఖ్యాత చరిత్రకారులు, హదీసువేత్త అయిన ఇబ్నె కసీర్ (రహ్మాలై) ఇలా వ్రాశారు : దైవప్రవక్త (సఅసం) మరియు హజ్రత్ అబూబకర్ ఇద్దరూ రాత్రిపూట సూర్ గుహలో చేరారు. అయితే అబూబకర్ గుహలోకి మొదట ప్రవేశించారు. దైవప్రవక్తకు కీడు కలిగించే మృగం గాని, పాముగాని గుహలో ఉండవచ్చునేమోనన్న భయంతో అబూబకర్ తొలుత తానే గుహలో ప్రవేశించారు."

మరో ఉల్లేఖనం ఏమని ఉందంటే; ఆ గుహకు ఎన్నో కన్నాలు ఉన్నాయి. అబూబకర్ ఆ కన్నాలను మూసివేశారు. ఒక కన్నాన్ని మూసివేయటానికి వీలుపడకపోతే తన కాలిని దానికి అడ్డుగా పెట్టారు. కన్నం లోపలినుంచి విషపు పురుగులు కాటేయసాగాయి. బాధతో ఆయన కళ్ళనుంచి అశ్రువులు రాలాయి. అయినా ఆయన కాలు తీయలేదు.

ప్రవక్త యెడల ప్రేమ కలిగి ఉండాలంటే ఆయన (సఅసం) సంప్రదాయాన్ని

https://teluguislam.net

అనుసరించాలి. ఎవరయినా, తనకు ప్రవక్త యెడల అమితమయిన ప్రేమ ఉందని చాటుకుంటూ ప్రవక్త సంప్రదాయాన్ని (సున్నత్‌ను) అవలంబించకపోతే, అతను అసత్యవాది, బూటకపు అనుయాయి అనిపించుకుంటాడు. అల్లాహ్ సెలవిచ్చాడు:

> **"మేము అల్లాహ్‌ను మరియు ప్రవక్తను విశ్వసించామని, విధేయతను స్వీకరించామని వారంటారు. ఆ తరువాత వారిలో ఒక వర్గం విధేయత పట్ల విముఖత చూపుతుంది. ఇటువంటి వారు విశ్వాసులు కారు." (అన్నూర్ : 47)**

విధేయతా మార్గం నుండి వైముఖ్యం ప్రదర్శించిన వారిని విశ్వాస పరిధుల నుండి వేరుచేస్తూ పై ఆయత్ అవతరించింది. మనసులో ఎంత అధికంగా విశ్వాసం ఉంటే అంతే అధికంగా విధేయతా భావం ఉంటుంది.

చెప్పుకోవటానికయితే చాలామంది తమకు ప్రవక్తయెడల అపార గౌరవం, ప్రేమ ఉన్నాయని చెప్పుకుంటారు. అయితే వారి మాటలు 'విధేయత' అనే గీటురాయిపై పరికించబడతాయి. ఒకవేళ వారి ఆచరణ ప్రవక్త ఆచరణకు భిన్నంగా ఉంటే వారు చెప్పేదంతా బూటకం అవుతుంది. మనసులో ప్రేమ ఉంటే, నిష్కల్మషమైన విధేయతా భావం ఉంటే అది ఆచరణ ద్వారా తప్పకుండా వ్యక్తమవుతుంది.

> **"(ఓ ప్రవక్తా!) వారితో అనండి, 'ఒకవేళ మీరు అల్లాహ్ యెడల ప్రేమ కలిగి ఉంటే నన్ను అనుసరించండి. అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ అపరాధాలను మన్నిస్తాడు. అల్లాహ్ ఎంతో క్షమించేవాడు, ఎంతగానో కరుణించేవాడు కూడాను." (ఆలి ఇమ్రాన్ : 31)**

హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా అన్నారు :

ప్రవక్తలందరిపట్ల ప్రేమ కలిగి ఉండటం విశ్వాసానికి ప్రతీక. అయితే మనం అందరికన్నా ఎక్కువ ప్రేమ మహాప్రవక్త (సఅసం) యెడల కలిగి ఉండాలి :

ఇమామ్ ఖతాబి ఇలా అంటున్నారు : ఇక్కడ ప్రేమ అంటే భావం లాంఛన ప్రాయమయిన ప్రేమ కాదు - హృదయ పూర్వకమయిన ప్రేమ. మహాప్రవక్త ఏమని ఉపదేశించారంటే, మీరు నా అనుసరణలో మీ మనోకాంక్షల్ని జయించనంతవరకు, నా సంతోషానికి మీ సుఖసంతోషాలపై ప్రాధాన్యత ఇవ్వనంతవరకూ - ఒకవేళ మీకు నష్టం కలిగినాసరే, చివరకు మీరు అమరగతి నొందవలసి వచ్చినా సరే - మీరు నా సంతోషం కొరకు పాటుపడనంతవరకూ మీకు నాపై గల ప్రేమ ధృవీకరించబడదు.

https://teluguislam.net

ఖాజీ అయాజ్ మరియు ఇబ్నె బతాల్ తదితరులు ఇలా అభిప్రాయపడ్డారు : ప్రేమ మూడు రకాలు :

(1) గౌరవనీయమయిన ప్రేమ. ఇది తండ్రిపట్ల ఉంటుంది.

(2) అవ్యాజానురాగాలతో కూడిన ప్రేమ. ఇది సంతానంపై ఉంటుంది.

(3) స్వాభావికమయిన ప్రేమ. ఇది ఒక మనిషికి మరో మనిషిపై సాధారణంగా ఉంటుంది.

ఈ హదీసులో మహాప్రవక్త అన్ని రకాల ప్రేమలను ప్రస్తుతించారు.

ఈ హదీసు ఆలోచన, యోచనల వైపు దృష్టిని మరలిస్తుంది. ఎందుకంటే మహాప్రవక్త (సఅసం) గారి ద్వారా ప్రాప్తమయ్యే మహత్పూర్వకమయిన ప్రయోజనాలకు మూలం ఆలోచన మరియు యోచనలే. ప్రవక్త సహచరులు ఏ విషయంపైనయినా ఎంతో సావధానంగా ఆలోచించేవారు. ప్రతి విషయాన్ని తరచి చూసేవారు. అందుచేత వారి విశ్వాసం ఎంతో దృఢమయ్యింది. ఈ హదీసు ద్వారా ముస్లిమైన ప్రతి ఒక్కరికీ లభించే సందేశం ఏమంటే సకల ప్రేమలకన్నా ప్రవక్త యెడల ప్రేమకు అతను ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ విషయంలో తాను ఏ స్థాయిలో నున్నది అతను సతతం ఆత్మావలోకనం చేసుకుంటూ ఉండాలి.

https://teluguislam.net

# 21. సద్వర్తనుల సహచర్యం

హ్జ్రత్ అనస్ (రజిఅన్) ఉల్లేఖించారు : ఒక వ్యక్తి మహాప్రవక్త (సఅసం) వద్దకు వచ్చి ప్రళయ దినం గురించి దర్యాప్తుచేశాడు. "ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడొస్తుంది?" అని అతను ప్రశ్నించాడు. ఆయన (సఅసం) బదులిచ్చారు : "నువ్వు దాని ఏర్పాటు చేసుకున్నావా?" దానికి ఆ వ్యక్తి, "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తయెడల ప్రేమ కలిగి ఉండటంతప్ప మరే తయారీ చేసుకోలేదు" అని అన్నాడు. అప్పుడు ఆయన (సఅసం), "నువ్వు ప్రేమించేవారితో పాటు ఉంటావు" అని ప్రబోధించారు. (బుఖారి)

అనస్ (రజిఅల్లాహు అన్హు) ఏమంటున్నారో చూడండి : "నేనయితే మహాప్రవక్త మరియు అబూబకర్ (రజిఅన్)ల పట్ల ప్రేమ కలిగి ఉండేవాడిని. ఒకవేళ నేను ఆ మహనీయులు చేసినన్ని మహత్కార్యాలు చేయలేకపోయినప్పటికీ ఈ ప్రేమ మూలంగా తీర్పుదినాన వారి సహచర్యంలోనే ఉండగలనన్న ఆశ నాకుంది."

బుఖారిలోని మరో ఉల్లేఖనం ఇలా ఉంది : ఒకతను మహాప్రవక్త (సఅసం)తో, "ఓ దైవప్రవక్తా! ఆ ఘడియ ఎప్పుడు వస్తుంది?" అని అడిగాడు. "నువ్వు దాని కొరకు చేసిన తయారీ ఏమిటీ?" అని మహాప్రవక్త ఎదురు ప్రశ్న వేశారు. అప్పుడు ఆ వ్యక్తి "దానిగ్గాను నా వద్ద ఎక్కువ నమాజులు లేవు. ఎక్కువ ఉపవాసాలూ లేవు. ఎక్కువ దానధర్మాలు కూడా లేవు. అయితే నేను అల్లాహ్ను, ఆయన ప్రవక్తను ప్రేమిస్తున్నాను" అని విన్నవించుకున్నాడు. ఇది విని, "నువ్వు ఎవరిని ప్రేమిస్తున్నావో వారి వెంట ఉంటావు" అని ఆయన (సఅసం) సెలవిచ్చారు.

దైవప్రవక్తను ఈ విధంగా ప్రశ్నించిన వ్యక్తి ఒక పల్లెటూరి వాడని ఉల్లేఖనాల ద్వారా తెలుస్తోంది. పల్లెటూరి మనుషులు విషయాన్ని దర్యాప్తు చేసే తీరే వేరు. వారిలో మొహమాటంగాని, ఊగిసలాటగాని సాధారణంగా ఉండదు. కాగా, మహాప్రవక్త ప్రియ సహచరుల ధోరణి దీనికి కొంత భిన్నంగా ఉండేది. ఏ విషయాన్ని ప్రవక్తను అడగాలన్నా కించిత్ భయం, జంకు వారికి ఉండేది. పల్లెటూరి నుండి ఏ పామరుడయినా వచ్చి ప్రవక్తను ధర్మసందేహాలు అడిగితే బావుండేదని వారు తలపోస్తూ ఉండేవారు. ఆ విధంగా తమకు మరిన్ని ధార్మిక విషయాలు తెలుస్తాయన్నది వారి ఉద్దేశం.

1. 'ఆ ఘడియ ఎప్పుడొస్తుంది?' అనేది హదీసులోని ఒక వాక్యం. అరబీలో "అసాఅత్" అని ఉంది. దీనికి తెలుగులో "నిర్ధారిత సమయం" అని అర్థం వస్తుంది. నిర్ధారిత

https://teluguislam.net

సమయం అంటే మనిషి మరణించగానే అతని కర్మల లెక్కను తీసుకునే సమయమైనా కావాలి లేదా సమస్త జనులను నిలబెట్టి లెక్కతీసుకునే ప్రళయదినమైనా కావాలి.

2. "నువ్వు దాని ఏర్పాటు చేసుకున్నావా?" అనేది హదీసులోని మరో వాక్యం. ప్రళయదిన ప్రతిఫలం గురించి అంత తొందరపడుతున్నావు. సరే, మరి అక్కడ నీకు గౌరవ స్థానం లభించేందుకు కావలసిన సత్కార్యాలు చేసుకున్నావా? అన్న భావం ఆ ప్రశ్నలో ఇమిడి ఉంది. ఇది ఎంతో వివేకవంతమయిన, ఆలోచనాత్మకమయిన ప్రశ్న. ప్రళయదినం సంభవించటమైతే తథ్యం. అది తన నిర్ణీత సమయంలో రానే వస్తుంది. అది ఎప్పుడు వస్తుంది? అన్న ఆదుర్దాకన్నా దానికోసం తను సన్నద్ధమై ఉన్నానా? లేదా? అన్న చింత మనిషికి ఎక్కువగా ఉండాలి.

3. "నేనే తయారీ చేసుకోలేదు" అని ఆ పల్లెటూరి వ్యక్తి అనటంలోని ఉద్దేశ్యం తాను బొత్తిగా నమాజ్ చేయటం లేదని, దానధర్మాలు చేయటం లేదని కాదు. ఆ విధ్యుక్తధర్మాలను తను నెరవేరుస్తున్నాడు. అయితే అవి అతని దృష్టిలో బహుస్వల్పం అన్నమాట. మరో ఉల్లేఖనంలో ఆ విషయమే ఉంది (నా దగ్గర నమాజులు, ఉపవాసాలు, దానధర్మాలు ఎక్కువగా లేదని ఆ వ్యక్తి చెప్పాడు).

విధ్యుక్త ధర్మాలను (ఫరాయజ్) నెరవేర్చనిదే ఏ వ్యక్తి తాను అల్లాహ్ మరియు ఆయన అంతిమ ప్రవక్త అభిమానినని చెప్పుకోలేడు. సహాబాల హయాంలో ఇలా ఆలోచించే వారే కాదు. విశ్వసించి, ముస్లింనని ప్రకటించుకుని ఇస్లాంలోని ప్రధాన విధులపట్ల అలసత్వం వహించటం ఆనాడు ఎక్కడా లేదు.

4. "అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పట్ల ప్రేమ తప్ప ......"

అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యెడల ఎవరి హృదయంలోనయినా ప్రేమ ఉంటే అది అతనిలోని విశ్వాసానికి (ఈమాన్‌కు) ప్రబల తార్కాణం అన్నమాట. విశ్వాసం లేనిదే ప్రేమ ప్రసక్తే రాదు. అంటే తన మనసులో విశ్వాసం ఉంది గనకనే అల్లాహ్‌ను, దైవప్రవక్తను తాను ప్రేమిస్తున్నానని, అందుకనే తనకు పరలోకం గురించిన చింత అధికంగా ఉందని ఆ పల్లెటూరి వ్యక్తి ఉద్దేశ్యం. అతని ఆలోచన ఎంతో అర్థవంతమైంది కూడా.

5. "నువ్వు ఎవరిని ప్రేమిస్తున్నావో వారి వెంట ఉంటావు."

అంటే నీ విశ్వాసం, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యెడల నీకు గల ప్రేమ నీకు ఉపయోగపడతాయి. తీర్పుదినాన నీ చేత ప్రేమించబడిన వారి సహచర్యం

https://teluguislam.net

నీకు ప్రాప్తమవుతుంది. ఇంకా నువ్వు వారి శ్రేణిలోని వ్యక్తిగానే పరిగణించబడతావు. అల్లాహ్‌ను ప్రేమించినవాడు ప్రళయదినాన అల్లాహ్ ఆగ్రహానికి గురికాకుండా ఉంటాడు. మహాప్రవక్తను ప్రేమించినవాడు, ఆయన (సఅసం) చెంత స్వర్గంలో ఉంటాడు. విశ్వాసుల పలు అంతస్థులు ఉంటాయి. ఒకరు ఎగువ స్థాయిలో ఉంటే మరొకరు దిగువస్థాయిలో ఉంటారు. ఎగువ స్థాయిలో నున్న వారు దిగువ స్థాయిలో ఉన్నవారిని చూచి అల్పులని భావించరు. అలాగే దిగువ స్థాయిలో నున్నవారు ఎగువస్థాయిలో నున్నవారిని చూసి అసూయ చెందరు. ప్రతి ఒక్కరూ దైవానుగ్రహాలను ఆస్వాదిస్తూ ఆనందంలో మునిగి ఉంటాడు.

మహాప్రవక్త (సఅసం) పల్లెటూరి వ్యక్తికి చేసిన ఉపదేశం విని సహచరులు ఎంతో సంతోషించారు. అది వారిలోని విశ్వాస భాగ్యానికి ప్రతీక. వారు అన్నిటికన్నా ఎక్కువగా పరలోకం గురించి ఆలోచిస్తుండేవారు. తాము ప్రేమించిన వారి వెంటే ఉంటామన్న సంగతి తెలియగానే వారి సాఫల్యం వారి కళ్ళముందు కదలాడింది. ఎందుకంటే మహాప్రవక్త యెడల వారికి గల ప్రేమ నిజమైనది, అపారమైనది, నిష్కల్మషమైనది.

కేవలం నోటితో ప్రకటించినంత మాత్రాన నిజమైన ప్రేమ వెల్లడి కాదు. ఆచరణకు, త్యాగానికి అది మారుపేరు. తాము ప్రేమించేవారి అభీష్టానుసారం మసలుకున్నప్పుడే, వారు సమ్మతించిన మార్గాన్ని అనుసరించినప్పుడే అది సార్థకమవుతుంది.

హజ్రత్ అనస్ (రజి) గారు మహాప్రవక్త మరియు అబూబకర్ (రజి) లను ఎంతగానో ప్రేమించేవారు. ఆ కారణంగా తనకు వారి సహచర్యం లభిస్తుందని ఆయన ఆశిస్తుండేవారు. హజ్రత్ అబూబకర్ (ర.అ) మహాప్రవక్త (సఅసం) కు అత్యంత ప్రియమైన సహచరులు. ఇహలోకంలో వారు ఎప్పుడూ ఆయనకు చేదోడు వాదోడుగా ఉండేవారు. ఒకేచోట వారి అంత్యక్రియలు జరిగాయి. స్వర్గంలో కూడా వారు ఒకేచోట ఉంటారు. దైవప్రవక్తల తరువాత - సామాన్య మానవులలో శ్రేష్టులైన వారు అబూబకర్ గారే. ఆ తరువాత స్థానం హజ్రత్ ఉమర్ (రజి) గారిది.

6. ఆ మహనీయులు చేసినన్ని సత్కార్యాలు నేను చేయలేకపోయినా వారిని ప్రేమిస్తున్నందున పరలోకంలో వారి సహచర్యం నాకు లభిస్తుందని ఆశిస్తున్నానని హజ్రత్ అనస్ (రజి) అన్నారు.

అంటే, నా సత్కార్యాలు వారి సత్కార్యాలు, త్యాగాల ముందు బహు స్వల్పమైనవి. అయితే నేను వారిని ప్రేమ అనే తీగతో అల్లుకుపోయాను. అందుచేత ఎలాగోలా స్వర్గంలోకి ప్రవేశిస్తాను.

https://teluguislam.net

అబూ మూసా అష్అరి ఉల్లేఖనం ఒకటి ఇలా ఉంది : "ఒక మనిషి కొందరిపట్ల ప్రేమ కలిగి ఉంటాడు. కాని వారి స్థాయిలో మహత్కార్యాలు చేయలేడు. మరి అప్పుడతని పరిస్థితి ఏమిటి? " అని మహాప్రవక్త (సఅసం)ను అడగగా, "మనిషి ఎవరిని ప్రేమిస్తాడో వారి వెంట ఉంటాడు" అని ఆయన (సఅసం) బదులిచ్చారు.

ఈ అధ్యాయంలోని హదీసు ద్వారా అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను ప్రేమించటం వల్ల ప్రాప్తమయ్యే మహాభాగ్యం ఎటువంటిదో విదితమవుతోంది. అదేవిధంగా దైవదాసుల్లోని సద్వర్తనుల సావాసంలో ఉండటం శుభసూచకమని కూడా బోధపడుతోంది. ఇకపోతే, అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను ప్రేమించటమంటే ఏ విధంగా ప్రేమించటం అన్న ప్రశ్న జనిస్తుంది. అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త కోరిన విధంగా జీవితం గడపటం, వారు వద్దన్న విషయాల జోలికి పోకుండా ఉండటం, వారి ప్రసన్నతను చూరగొనగలిగే పనులను చేయటమే ఆ ప్రేమకు ప్రతిరూపం.

ఇక, సద్వర్తనులయిన మానవులను ప్రేమించటం అంటే వారి దాస్యం చేయమని భావం ఎంతమాత్రం కాదు. వారి మాదిరిగా మంచి పనులు చేస్తూ, వారి స్థాయికి ఎదగటానికి ప్రయత్నించాలి.

https://teluguislam.net

# 22. స్వర్గం - నరకం

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖనం ఇలా ఉంది - ప్రవక్త మహనీయులు (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు: "స్వర్గాన్ని ఇక్కట్లతో చుట్టుముట్టడం జరిగింది. నరకాన్ని సుఖ విలాసాలతో ఘెరావ్ చేయడం జరిగింది." (ముస్లిం)

## తాత్పర్యం

పై హదీసు భావాన్ని గ్రహించాలంటే హజ్రత్ అబూహురైర (రజిఅన్) ఉల్లేఖించిన హదీసును పరిశీలించవలసి ఉంది. అబూహురైర (రజిఅన్) ప్రకారం, మహాప్రవక్త (సఅసం) ప్రవచనం ఇలా ఉంది : అల్లాహ్ స్వర్గ నరకాలను నిర్మించిన తరువాత (తన దూత అయిన) జిబ్రయీల్‌ను స్వర్గం వైపునకు పంపాడు. "దాన్ని చూసిరండి, నేను దాని నివాసుల కోసం, దాన్ని రూపొందించాను" అని అల్లాహ్ (జిబ్రయీల్‌తో) అన్నాడు. జిబ్రయీల్ స్వర్గం వద్దకు వచ్చారు. స్వర్గాన్ని, అందులో నివసించే వారి కొరకు అల్లాహ్ తరపున సమకూర్చబడిన సామగ్రిని తిలకించారు. తరువాత ఆయన (అల్లాహ్) వైపునకు మరలారు. "(ప్రభూ!) నీ గౌరవ ప్రపత్తుల సాక్షిగా! దాన్ని గురించి ఎవరు విన్నా సరే తప్పకుండా అందులోకే ప్రవేశిస్తారు." అప్పుడు అల్లాహ్ ఆజ్ఞతో అది ఇక్కట్లతో చుట్టుముట్టబడింది. తరువాత ఆదేశించాడు : "అందులో ప్రవేశించదలిచే వారికై నేను ఏమేం (సృష్టించి) ఉంచానో వెళ్ళి చూడండి." జిబ్రయీల్ (అలైహిస్సలాం) దాని వైపునకు వెళ్ళిచూస్తే, అది ఇక్కట్లతో చుట్టుముట్టబడి ఉంది. జిబ్రయీల్ మరలివచ్చారు. "(ప్రభూ!) నీ గౌరవం సాక్షిగా! అందులో ఎవరూ ప్రవేశించలేరేమోనని నాకు అనుమానంగా ఉంది" అని విన్నవించుకున్నారు. అప్పుడు అల్లాహ్ ఆదేశమయ్యింది : "వెళ్ళి నరకాన్ని చూడండి. అందులో ఉండేవారి కొరకు నేను ఏం సిద్ధం చేసి ఉంచానో చూడండి". వెళ్ళి చూస్తే, అందులో తీవ్రమైన నిప్పు సెగలు కానవచ్చాయి. (జిబ్రయీల్) మరలి వచ్చి విన్నవించుకున్నారు : "(ప్రభూ!) నీ గౌరవోన్నతుల సాక్షిగా! ఎవరు దాన్ని గురించి విన్నా అందులోకి పోరు." అప్పుడు దైవాజ్ఞతో అది సుఖభోగాలతో ఘెరావ్ చేయబడింది. ఆజ్ఞ అయ్యింది : "దాని వైపునకు వెళ్ళి చూడండి" అని. అప్పుడు నరకం వైపునకు వెళ్ళిచూసి ఇలా అన్నారు - "(ప్రభూ!) నీ గౌరవాదరణల సాక్షిగా చెబుతున్నాను. ఎవరూ దీని బారిన పడకుండా ఉండలేరు, అందులోనే పడిపోతారని నాకు అనుమానంగా ఉంది." (తిర్మిజి)

"స్వర్గాన్ని ఇక్కట్లతో చుట్టుముట్టడం జరిగింది." అంటే శాశ్వత సుఖాలకు

https://teluguislam.net

నిలయమయిన స్వర్గంలో స్థానం సంపాదించటం కొరకు కొన్ని విధ్యుక్త ధర్మాలను విధిగా నిర్వర్తించాలని అల్లాహ్ నిర్ధారించాడు. అలాగే కొన్ని రకాల పనులకు, విషయ లాలసకు దూరంగా ఉండాలని కూడా దేవుడు నిర్ణయించాడు. దేవుడు నిర్ణయించిన విధ్యుక్త ధర్మాలను సక్రమంగా పాటించడం, ఆయన పోవద్దన్న వాటి జోలికి పోకుండా మనోవాంఛలను అణచుకోవటం మనిషికి కాస్త శ్రమగానే ఉంటుంది. దీన్నే కష్టాలతో, ఇక్కట్లతో పోల్చటం జరిగింది.

"నరకాన్ని సుఖవిలాసాలతో ఘెరావ్ చేయడం జరిగింది." అంటే దేవుడు విధించిన హద్దులను అతిక్రమించి జాలిగా గడపటం, దేవుడు హరామ్ (నిషేధించిన) చేసిన సొమ్ము తినటం, విషయ లాలసలో లీనమవటం మనిషికి ఎంతో సులభసాధ్యం. పైగా ఈ మార్గంలో పడిన మనిషి తింటూ, త్రాగుతూ, అనుభవిస్తూ మస్తుగా ఉంటాడు. కాని పర్యవసానం - దైవాజ్ఞల్ని ధిక్కరించిన కారణంగా - భయంకరంగా ఉంటుంది. నరకం సుఖ విలాసాలతో ఘెరావ్ చేయబడిందనే దానికి భావం ఇదే.

పై చర్చ ద్వారా తేలిందేమంటే మనిషి స్వర్గంలో చేరటం అతి సులువయిన విషయం కాదు. నిరంతరం సాధన చేయకుండా కష్టాలను సహించకుండా, బాధలను భరించకుండా మహోన్నత లక్ష్యం ప్రాప్తం కాదు. అల్లాహ్ తన పవిత్ర గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు :

"స్వర్గంలో ఇట్టే ప్రవేశించగలమని మీరు అనుకుంటున్నారా? వాస్తవానికి మీకు పూర్వం వారిపై వచ్చిన (కష్టాల) దశలు మీపై రానేలేదు. వారిపై కాఠిన్యం, విపత్తులు వచ్చిపడ్డాయి. ఇంకా వారిని విదిల్చి కొట్టడం జరిగింది. కడకు ఆ కాలపు ప్రవక్త మరియు విశ్వసించిన సహచరులు 'దైవ సహాయం ఎప్పుడొస్తుందీ?' అని హాహా కారం చేయసాగారు. (ఆ సమయంలో వారిని ఓదార్చడం జరిగింది) అవును, దైవ సహాయం దగ్గరలోనే ఉంది అని." (అల్ బఖర : 214)

ఇకపోతే, దేవుడు హరామ్ (నిషిద్ధం)గా ఖరారు చేసిన వస్తువులు! పైకి అవి ఎంతో ఆకర్షణీయంగా, విలాసవంతమైనవిగా అగుపిస్తాయి. వాటిలో ఎంతో ఆనందానుభూతి ఉంటుంది. ఆ తళుకు బెళుకుల, రంగు రంగుల లోకంలో మనిషి తన నిజ స్థానాన్ని, తన జీవన పరమార్థాన్ని కూడా విస్మరించి వాటికి దాసోహం అంటాడు. కాని ఆ రసాస్వాదన క్షణికమైనది. ఆ తరువాత ఎదర ఉన్నదంతా చీకటే. అప్పటి వరకు తన పాలిట ఎంతో తియ్యనైనదిగా, మధురమైనవిగా అగుపించినవన్నీ తరువాత అతని యెడల విషపూరితమైనవిగా పరిణమిస్తాయి. దైవప్రబోధం :

**"ప్రాపంచిక జీవితమైతే కేవలం మోసపుచ్చే సామగ్రి మాత్రమే." (హదీద్ : 20)**

https://teluguislam.net

మహాప్రవక్త గారి ప్రవచనంపై ఉలమాలు చేసిన వ్యాఖ్యను ఇమామ్ నవవి (రహ్మాలై) ఇలా ఉటంకించారు :

ఆయన (సఅసం) ఎంత గొప్ప దృష్టాంతం పేర్కొన్నారు! ఆయన (సఅసం) నోట వెలువడ్డ శుభప్రదమైన వాక్కుల భావం ఏమంటే, ప్రజలు కష్టాలను సహించనంత వరకూ స్వర్గంలో చేరలేరు. కాగా, విలాసాల వైపునకు పరుగులు తీస్తూ మనిషి నరకంలో పడిపోతాడు. స్వర్గం కష్టాల, బాధల మధ్య దాగి ఉంటుంది. అయితే నరకాగ్ని విలాసాలతో కప్పబడి ఉంటుంది. ముసుగు తీసి చూసిన వాడు యదార్థాన్ని గ్రహిస్తాడు. బాధల బరువును సహనంతో మోస్తూ స్వర్గపు పరదాను ఎత్తినవాడు స్వర్గంలో తప్పక ప్రవేశిస్తాడు. రుచులు మరుగుతూ, ఇహలోక సుఖాలను జుర్రుకుంటూ ధర్మమార్గాన్ని మరచినవాడు, కడకు నరకాన్నే చవిచూస్తాడు. అదే అతని గమ్యస్థానం. అక్కణ్ణుంచి అతను తిరిగి రాలేడు.

ఒకే దైవాన్ని విశ్వసిస్తూ, ఆయన్నే సేవిస్తూ ఆయన మార్గంలో నిరంతరం పాటుపడుతూ, చెడుల నుంచి తనను రక్షించుకుంటూ జీవితం గడపటం, క్రోధాన్ని జయించటం, క్షమాగుణాన్ని అలవరచుకోవటం, దానధర్మాలు చేయటం, తనకు అపకారం తలపెట్టేవారికి సయితం ఉపకారం చేయటం, మనో వాంఛలను అదుపులో పెట్టుకోవటం, సహన స్థయిర్యాలను కలిగి ఉండటం - ఇవన్నీ స్వర్గపు బాటలోని కష్టాలే. స్వర్గం కోరుకుంటున్న వారు అవసరమైతే వీటిని ఆహ్వానించి, భరించవలసిందే.

పోతే -

మద్యపానం, జూదం, వ్యభిచారం, అపసవ్యమైన అనర్థదాయకమయిన విషయాలు, అసత్యం, చాడీలు, మనోవాంఛల దాస్యం, పదార్థపూజ, వంశం, కులం గోత్రాల ప్రాతిపదికపై అహంకారాన్ని ప్రదర్శించడం, దురాచారాలు, దుస్సంప్రదాయాలు - ఇవన్నీ నరకానికి గొనిపోయేవే.

అయితే సుఖాలు, విలాసాలు అధర్మమని కాదు - వాటిలో ధర్మసమ్మతమైనవి కూడా ఉంటాయి. అయితే మనోవాంఛలకు ఒకసారి దాసుడైపోయిన మనిషి, ధర్మసమ్మతమైన మార్గాల ద్వారా కోర్కెలు తీరకపోతే అడ్డమైన గడ్డినల్లా కరచి వాటిని పొందాలని ప్రయత్నిస్తాడు. మంచీ చెడుల విచక్షణా జ్ఞానాన్ని కోల్పోతాడు. మితిమీరిన ఈ కోర్కెల మూలంగా అతని అంతర్యంలో కాఠిన్యం తిష్ఠవేస్తుంది. మనసులో మలినం పేరుకుంటుంది. దైవదాస్య భావం, దైవ విధేయతా భావం పట్ల అలసత్వం లేక వైముఖ్యం ప్రదర్శిస్తాడు. కోర్కెల గుఱ్ఱాలను పోషించడానికి రేయింబవళ్ళు సంపాదనా యత్నంలోనే ఉండిపోతాడు.

https://teluguislam.net

ఈ హదీసు ద్వారా బోధపడే మరో విషయం ఏమిటంటే, స్వర్గ-నరకాలు సృజించబడి ఉన్నాయి. అవి ఎక్కడో ఒకచోట నెలకొని ఉన్నాయి. మేరాజ్ రాత్రిన ప్రవక్త మహనీయులు స్వర్గ నరకాల సైరు చేసి వచ్చారు. ఈ హదీసు ద్వారా బోధపడే మరో విషయం; ఈ ప్రపంచం కేవలం సుఖాస్వాదనలకు నిలయం కాదు. ఈ లోకంలో ఏ సుఖమయినా, మరే ఆనందమయినా - అది ధర్మ సమ్మతంగా లభిస్తే, దాన్ని దైవానుగ్రహంగా భావించి పొందవచ్చు. ఇలాంటి సుఖాలు పరలోక సాఫల్యానికి ఎలాంటి అవరోధం కాజాలవు.

దైవాజ్ఞలను పాలిస్తూ, ఆయన మోపిన విధ్యుక్త ధర్మాలను నిర్వర్తిస్తూ ఆయన వద్దన్న వాటి జోలికి పోకుండా గడపటం సాధారణ విషయం కాదు. నిజానికి అదొక పెద్ద పరీక్ష, మహాయజ్ఞం. అయితే చిత్తశుద్ధితో దైవమార్గాన పయనించాలని నిశ్చయించుకున్న వాని కోసం, దేవుడు తన మార్గాన్ని సులభతరం చేస్తాడు. అంటే అల్లాహ్‌కు భయపడుతూ, అల్లాహ్ మార్గంలో ఖర్చుచేస్తూ ప్రవక్తలను విశ్వసిస్తూ మంచిపనులు చేసిన వారికి అల్లాహ్ స్వర్గంలో సులువుగా ప్రవేశం కల్పిస్తాడు.

హరామ్ నుండి మనిషి తనను కాపాడుకోవటం మొదట్లో కాస్త కష్టంగా కనిపిస్తుంది. కాని అతను స్థిర చిత్తంతో, ఓపికతో ధర్మ మార్గానికి కట్టుబడి ఉంటే రాను రాను అతను ఎంత కాలితే అంతే కుందనంలా, మేలిమి బంగారంలా మెరిసిపోతాడు. క్రమక్రమంగా చెడులంటే, హరామ్ వస్తువులంటే అతను అసహ్యించుకోసాగుతాడు. ఇక అప్పుడతను చెడుల బారిన పడకుండా, వాటికి దూరంగా ఉండటం ఎంతో సులువు. ప్రవక్త సహచరుల నుద్దేశించి ఇలా సెలవియ్యబడింది :

> **"ఆయన మీ మనసుల్లో అవిశ్వాసం, అపసవ్యత, అవిధేయత పట్ల ఏహ్యభావాన్ని కలుగజేశాడు. ఇటువంటి వారే దేవుని కరుణానుగ్రహాలకు నోచుకున్నారు." (అల్ హుజురాత్ : 7)**

పై విషయాల సారాంశం ఏమిటంటే, మానవుడు కష్టాలను ఎదుర్కోవలసి వచ్చినప్పటికీ అతను స్వర్గపు బాటపై నడవాలి. ధర్మసమ్మతం కాని, నరకానికి గొనిపోయే ఎన్ని సుఖభోగాలు తారసపడినా వాటి వలలో చిక్కకుండా తనను రక్షించుకోవాలి.

https://teluguislam.net

# 23. ముస్లిం చేసే దానధర్మాలు

మహాప్రవక్త (సఅసం) ప్రబోధించారని అబూ మూసా అష్అరి (రజిఅన్) నుడివారు: "దానం ఇవ్వటం ప్రతి ముస్లింకు తప్పనిసరి." సహచరులు అడిగారు - 'ఒకవేళ అతని వద్ద లేకుంటే?!' ఆయన (సఅసం) అన్నారు : 'అతను తన స్వహస్తాలతో శ్రమించి సంపాదించాలి. (దాంతో) తన స్వయానికి ప్రయోజనం చేకూర్చాలి మరియు దానం ఇవ్వాలి.' సహచరులు సందేహంగా అడిగారు - 'ఒకవేళ అలా చేయలేకపోతే? లేదా చేయకపోతే?' ఆయన (సఅసం) ప్రబోధించారు : 'దయనీయ స్థితిలో ఉన్న అగత్యపరునికి సహాయపడాలి.' సహచరులు అడిగారు - 'ఒకవేళ అలా చేయకపోతేనో?' ఆయన (సఅసం) బదులిచ్చారు : 'మంచిని ఆజ్ఞాపించాలి'. సహచరులు మళ్ళీ అడిగారు - 'ఒకవేళ అది కూడా చేయలేకపోతే?!' ఆయన (సఅసం) చెప్పారు : '(పరులను) నొప్పించకుండా జాగ్రత్త పడాలి. ఇది కూడా అతని పాలిట దానమే." (బుఖారి)

**తాత్పర్యం :**

ఈ హదీసును ఉల్లేఖించిన వారు అబూ మూసా అష్అరి (రజిఅల్లాహు) హిజ్రత్‌కు ముందే ఈయన మక్కా వచ్చి ఇస్లాంను స్వీకరించారు. తరువాత తన జాతి వారి వైపునకు మరలివెళ్ళారు. కొంత కాలం గడిచిన తరువాత ఆయన తన దేశం నుండి ఓడలో బయలుదేరారు. మార్గమధ్యంలో గాలి దిశ మారిపోవటం వల్ల ఈయన ఆఫ్రికాకు చేరుకోవలసి వచ్చింది. అక్కడ ఆయన జాఫర్ బిన్ అబీ తాలిబ్ (ర.అ) వద్ద ఆగారు. ఆ తరువాత ఆయనతో పాటే హిజ్రీ 6 వ సంవత్సరం మదీనా వచ్చారు. మహాప్రవక్త (సఅసం) ఈయన్ని యమన్‌లోని కొన్ని ప్రాంతాలకు అధికారిగా నియమించారు. ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజిఅన్) హయాంలో ఈయన బస్రా గవర్నర్‌గా నియమితులయ్యారు. హజ్రత్ ఉస్మాన్ (రజిఅన్) కాలంలో కూఫా గవర్నర్ పదవి లభించింది. ఉమర్ గారి కాలంలో ఈయన 'అహ్వాన్', 'అస్‌బహాన్'లను జయించారు. ఈయనగారి కంఠస్వరం మృదు మధురమైనది. తనను కలుసుకున్నప్పుడల్లా ఖుర్ఆన్‌ను చదివి వినిపించమని హజ్రత్ ఉమర్ ఈయన్ని కోరేవారు. ఖలీఫా కోరిక మేరకు ఈయన ఖుర్ఆన్ పఠించి వినిపించేవారు. బస్రా ప్రజల్లో ఈయన ఖుర్ఆన్ మరియు సత్యధర్మాన్ని వ్యాపింపజేశారు. దాదాపు హిజ్రీ శకం 50వ ఏట ఈయన కాలధర్మం చెందారు - అప్పటికి ఈయన వయస్సు రమారమి 63 సంవత్సరాలు.

https://teluguislam.net

"దానం ఇవ్వటం ప్రతి ముస్లింకు తప్పనిసరి." ముస్నద్ తియాసి ఉల్లేఖనంలో "ప్రతిరోజు" అనే పదం అదనంగా ఉంది. ఈ దానం శక్తిమేరకు ప్రతి ఒక్కరిపై తప్పనిసరి అవుతుంది. అంటే ప్రతి ముస్లిం నైజంలో, అతని ప్రవర్తనలో సదకా (దానం) ఒక భాగం కావాలన్నది దీని పరమార్థం. అతను ఏ స్థితిలో ఉన్నా - కలిమిలో ఉన్నా లేమి తాండవిస్తున్నా - అతనిలో దాతృస్వభావం మాత్రం ఉండాల్సిందే అన్నది పై వాక్యం ఉద్దేశ్యం.

'ఒకవేళ అతని వద్ద లేకపోతే' అని ప్రవక్త గారి ప్రియసహచరులు ప్రశ్నించారు. 'దానం' అనే ప్రస్తావన రాగానే ధన ధాన్యాదుల ద్వారా చేసే సహాయం మాత్రమేనని అసలు సహచరులు తలపోశారు. అయితే ఈ "పదం"కు ఉన్న భావం ఎంతో విస్తృతమయిందని, అపదలో ఉన్న ఒక వ్యక్తిని మృదువుగా పలకరించి అతన్ని ఓదార్చటం, అతని ఆపదను కడతేర్చే సంకల్పంతో తరుణోపాయం సూచించటం కూడా "సదకా" కోవలోకే వస్తుందని మహనీయ ముహమ్మద్ (సఅసం) విశ్లేషించారు.

ఈ నేపథ్యంలో ఇబ్నె అబీ హమ్జ ఇలా అభిప్రాయపడ్డారు :

"దాన ధర్మాలు చేయడం కేవలం శ్రీమంతులకే పరిమితం కాదని, డబ్బు ఖర్చుపెట్టకుండా కూడా దానధర్మాలు చేయవచ్చని ఈ హదీసు ద్వారా అధారం లభిస్తున్నది."

"అతను తన స్వహస్తాలతో శ్రమించి సంపాయించాలి." అన్న ప్రవక్తగారి పలుకు గమనించదగినది. కష్టపడి ఉపాధిని సంపాయించటం చాలా ముఖ్యం అని దీనిద్వారా విదితమవుతుంది. కష్టపడి సంపాయించగలిగినప్పుడే ఏ మనిషయినా తన స్వయానికై ఖర్చుచేసుకుని ఇతరుల కేదైనా సహాయం చెయ్యగలుగుతాడు. శ్రమించి సంపాదించుకుంటేనే, ఎదుటివారి ముందు చేతులు చాచి యాచించే దురవస్థ రాకుండా జాగ్రత్త పడగలుగుతాడు. పైపెచ్చు సమాజంలో గౌరవప్రదంగా జీవిస్తూ, ఆత్మాభిమానాన్ని కాపాడుకుంటూ, వీలయినంత ఎక్కువగా నిరాధారులను ఆదుకోగలుగుతాడు.

"దయనీయ స్థితిలో ఉన్న అగత్యపరునికి సహాయపడాలి" అనేది హదీసులోని మరో వాక్యం. అటువంటి సహాయం నోటిద్వారా కావచ్చు. చేతల ద్వారా కూడా కావచ్చు. మరోవిధంగా కూడా కావచ్చు. సహాయపడే తీరు ఎన్నో రకాలు.

"మంచిని గురించి ఆజ్ఞాపించాలి" అనేది మరో వాక్యం. వేరొక ఉల్లేఖనంలో "చెడుల నుండి ఆపాలి" అని కూడా ఉంది. మంచిని ఆజ్ఞాపించటంలోనే "చెడుల నుండి అపటం" అనే భావం ఇమిడి ఉంది. ఖుర్‌ఆన్ హదీసుల వెలుగులో సమ్మతమయిన

https://teluguislam.net

ప్రతిదీ 'మంచి'గానే పరిగణించబడుతుంది. అలాగే ఖుర్ఆన్, హదీసులలో ఏవేవైతే 'కూడదు' అని అనబడ్డాయో అవి చెడుగానే పరిగణింపబడతాయి. వాటి జోలికి ప్రజలను పోనివ్వకుండా చూడటం కూడా గొప్ప సత్కార్యమే.

"(పరుల మనసు) నొప్పించకుండా జాగ్రత్త పడాలి." నోటి ద్వారానయినా, చేతల ద్వారానయినా లేక ఆ రెండింటి ద్వారానయినా ఎదుటివారు నొచ్చుకునేలా ప్రవర్తించరాదు. ఎట్టి పరిస్థితిలోనూ దైవ ప్రసన్నత చూరగొనటమే దీనివెనుక అసలు ప్రేరణ అయివుంటే తప్పకుండా ఇది సయితం పుణ్యకార్యంగానే పరిగణించ బడుతుంది. దైవదాసులకు బాధ కలగకుండా మసలు కోవటం ఒక నిజమైన ముస్లిం యొక్క చిహ్నం. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజిఅన్) ఉల్లేఖించిన హదీసు ద్వారా ఇదే భావం వ్యక్తమవుతోంది. ఆయన ఉల్లేఖించిన ప్రవచనం ఇలా ఉంది : నిజమైన ముస్లిం అతనే - ఎవరి నోటి మరియు చేతుల బారి నుండి ముస్లింలు సురక్షితంగా ఉండగలరో."

"ఒకవేళ అలా చెయ్యలేకపోతే," ప్రవక్త సహచరులు పలు కోణాల నుంచి ఒక విషయం యొక్క లోతుపాతులను తెలుసుకునేవారు. వారలా అడగటం వల్లనే "విషయం" ప్రాముఖ్యతను సంతరించుకుంది. సదకా (దానం) యొక్క విస్తృత భావం కూడా తెలిసివచ్చింది. దానధర్మాలు చేయటం, అవసరం ఉన్న వారిని ఆదుకోవటం, మంచిని గురించి అజ్ఞాపించటం, చెడుల నుండి ఆపటం ఇవన్నీ చెయ్యవలసిన ముఖ్య పనులేనని, వీటికిగాను దైవసన్నిధిలో ప్రతిఫలం కూడా అపారమని తెలియవచ్చింది.

ఈ హదీసు ద్వారా స్పష్టమయిన మరో విషయం ఏమిటంటే, సత్కార్యాలు వాటి ప్రాముఖ్యత, ప్రతిఫలాల దృష్ట్యా ఎన్నో స్థాయిలను కలిగి ఉంటాయి. అయితే వీటిలో అన్నిటికన్నా ఉత్తమమయినది, మనిషి తన ధనాన్ని ఇతరులకు దానం చేయటం. ఒక ముస్లిం ఫకీరు - భిక్షకుడు - దైవమార్గంలో ఖర్చుపెట్టలేకపోతే అతను, అది మినహా మిగతా సత్కార్యాలపై చొరవచూపాలి. అల్లాహ్ ఏ ప్రాణిపైనా అతని శక్తికి మించిన భారం మోపడు. మనిషి, తాను ఏ సత్కార్యమూ చేయలేకపోతే, అతను కనీసం చెడుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి.

ఈ హదీసు ద్వారా విదితమయ్యే మరో విషయం ఏమిటంటే, షరీఅత్ ఆదేశాలు - స్థితిగతుల దృష్ట్యా - స్వల్పమయిన వ్యత్యాసంతో వర్తిస్తాయి. ప్రవక్త మహనీయులు (సఅసం), ప్రతి ముస్లిం దానం ఇవ్వటం తప్పనిసరి అని ఖరారు చేశారు. అయితే ప్రతి ముస్లిం దానధర్మాలు చెయ్యలేడు. పైగా కొంతమందైతే దానాలు పుచ్చుకోవటం

https://teluguislam.net

తప్ప మరో గత్యంతరం లేని స్థితిలో ఉంటారు. అటువంటప్పుడు పుచ్చుకోవడం వారికొరకు సమంజసమే అవుతుంది. విషయాన్ని కూలంకషంగా అర్థం చేసుకునే ఉద్దేశ్యంతో మాటిమాటికీ విద్వాంసుని అడగవచ్చు అని కూడా ఈ హదీసు ద్వారా తెలియవస్తోంది. అదేవిధంగా కష్టపడి చెమటోడ్చి సంపాయించడం శ్రేష్ఠతతో కూడుకున్న విషయమని అలా సంపాయించే వాడే తనను ఆదుకోవటంతో పాటు ఇతరులను కూడా ఆదుకోగలుగుతాడని అవగతమవుతోంది.

గ్రంథ రచయిత మౌలానా సఫీ అహ్మద్ మదనీ జమీఅతె అహ్లెహదీస్ క్రియాశీలక కార్యకర్తల్లో ఒకరు. ఈయన ప్రాథమిక ధార్మిక విద్యాభ్యాసాన్ని ఉమ్రాబాద్ (తమిళనాడు)లోని జామియ దారుస్సలాంలో అర్జించారు. అనంతరం బనారస్‌లోని జామియ సలఫియాలో ఉన్నత విద్య నభ్యసించి మదీనాలోని ఇస్లామీయ యూనివర్శిటీ నుండి పట్టభద్రులయ్యారు. ప్రస్తుతం ఈయన హైదరాబాదులో జమాఅత్ కార్యకలాపాలలో నిమగ్నులై ఉన్నారు.

“కలామె హిక్మత్”లో ఈయన అసంఖ్యాకమయిన, సమగ్రమయిన హదీసులను (ప్రవక్త ప్రవచనాలను) సంకలనం చేసి పవిత్ర ఖుర్‌ఆన్ వెలుగులో వాటిని విశదీకరించారు. ఈ సందర్భంగా రచయిత ప్రఖ్యాత హదీసువేత్తల, ప్రముఖ ప్రాచీన విద్వాంసుల (ఉలమాల) విధానాన్ని దృష్టిలో ఉంచుకుని, వీలయినంతవరకు వారి అడుగుజాడల్లోనే తన ప్రయత్నాన్ని ముందుకు సాగించారనిపిస్తుంది. ఈ కృషి శ్లాఘనీయమనటంలో సందేహం లేదు. ఈ గ్రంథం అధ్యయనం వల్ల పాఠకులకు ఎన్నో ధార్మికవిషయాలు బోధపడగలవని ఆశిస్తున్నాను. కారుణ్య ప్రభువయిన అల్లాహ్ రచయిత కృషిని స్వీకరించాలని ప్రార్థిస్తున్నాను.

**- మౌలానా ముహమ్మద్ నజీర్**

**నాజిమ్** : ప్రసార, ప్రచార, ప్రచురణల విభాగం
జమీఅతె అహ్లెహదీస్, ఆంధ్రప్రదేశ్

https://teluguislam.net